మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 16 అక్టోబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 281 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

ఆసియా గేమ్స్ విజేతలతో ప్రధాని భేటీ

2

పొద్దున్నే పెండ్లి.. సాయంత్రం ఇడుపుకాయితం

2

ఎల్‌నినో ఓ ప్రకృతి విపత్తు

పరిస్థితులు చేయి దాటేలా ఉన్నయ్..

నీరు, విద్యుత్ కోత తప్పదు

భూమిపై నివసించే ప్రతీ ప్రాణిపై ఎల్‌నినో ప్రభావం పడుతుంది

వచ్చే సీజన్‌లో వరి సాగు వాయిదా వేసుకోవాలె

పార్టీలు, పౌరులు ప్రభుత్వానికి సహకరించాలి

దసరా తరువాత అఖిలపక్ష నేతలతో చర్చలు

సాయం కోసం కేంద్రం పెద్దలనూ కలుస్తం

ఎల్‌నినోపై మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ సమీక్ష



హైదరాబాద్, అక్టోబర్ 15, (మనం బ్యూరో): ఎల్‌నినో ఓ ప్రకృతి విపత్తు అనీ, భూమిపై ఉన్న ప్రతి జీవరాశిపై దీని ప్రభావం ఉండబోతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 100 దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉంటుందని శాస్త్రవేత్తలు ప్రకటించారనీ, దీనిని ఎదుర్కోవడానికి అందుబాటులో ఉన్న మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో చర్చించి కార్యాచరణను రూపొందించామని వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ఎల్‌నినో పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలనీ, ఈ ఏడాది 209 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్న దృష్ట్యా నీళ్లను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. హైదరాబాద్‌కు నీరందించే జలాశయాలూ ఎండిపోతున్నాయనీ, రైతులు పెద్ద మనసు చేసుకుని వరి సీజన్‌ను వాయిదా వేసుకోవాలని సూచించారు. అక్టోబర్ నెలలో 15 వేల మెగావాట్లు ఉండాల్సిన విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పెరిగిందనీ, దీంతో రాష్ట్రంలోని దాదాపు 30 లక్షల పంపు సెట్లు ఆన్ అయ్యాయని తెలిపారు. విద్యుత్ శాఖ సమర్థవంతంగా పనిచేసి రైతులు ఇతర అవసరాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తోందన్నారు. వచ్చే నెల 8 నుంచి 10 నెలల్లో

...మిగతా 2లో

భారత్-అమెరికా తొలి దశ ట్రేడ్ డీల్ ఖరారు

కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్

ఢిల్లీ, అక్టోబర్ 15: భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన తొలి దశ ఖరారైందని, ప్రస్తుతం దీనికి చట్టపరమైన ముసాయిదా రూపకల్పన జరుగుతోందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాటాడుతూ... అమెరికాతో వాణిజ్య ఒప్పందం మొదటి దశ పూర్తయింది. అందుకు అవసరమైన చట్టపరమైన ముసాయిదా తుది దశలో ఉంది. వీలైనంత త్వరలో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్నాయని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు.. అమెరికా సుంకాలపై అధికారికంగా స్పష్టత వచ్చాకే.. ఈ ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేయనున్నాయని వెల్లడించారు.

వెనకబాటుతనాన్ని బదిలీ చేయలేం

మతమార్పిడి రిజర్వేషన్లపై సుప్రీం కీలక తీర్పు

ఢిల్లీ, అక్టోబర్ 15: మతమార్పిడి రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. హిందూమతం నుంచి ఇతర మతాల్లోకి మారినవారు.. కేవలం మతమార్పిడి ఆధారంగా వెనకబడిన తరగతుల (బీసీ) కోటాను క్లెయిమ్ చేసుకోలేరని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మతం మారినంత మాత్రాన.. ఆ వ్యక్తి సామాజిక వెనకబాటుతనాన్నీ బదిలీ చేయలేమని పేర్కొంది. ఇస్లాంలోకి మారినవారికి బీసీ రిజర్వేషన్ అర్హత లేదంటూ గతంలో మద్రాస్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని తమిళనాడు ప్రభుత్వం సవాలు చేయగా.. హైకోర్టు తీర్పునే సుప్రీంకోర్టు తాజాగా సమర్థించింది. గతంలో హిందూమతాన్ని అనుసరించిన బీసీ వ్యక్తి.. ఇస్లాంలోకి మారగానే ఆటోమెటిక్ గా రిజర్వేషన్ క్లెయిమ్ చేసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తాజాగా స్పష్టం చేసింది. ఆ వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా అదే వెనకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నట్లు చట్టబద్ధంగా నిరూపితమైతే.. రాష్ట్ర ప్రభుత్వం నోటిపై చేసిన కమ్యూనిటీ పరిధిలోకి వస్తేనే రిజర్వేషన్ వర్తిస్తుందని పేర్కొంది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం వెల్లడించింది.

కాకతీయ మెగా టెక్స్‌టైల్

పార్క్‌లో తనిఖీ

వరంగల్ వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్

వరంగల్, అక్టోబర్ 15: వరంగల్ జిల్లాలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ఉన్న అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమల పురోగతికి అవసరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, ఐఏఎస్ అధికారులకు సూచించారు.

గురువారం ఆయన వరంగల్లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. పార్క్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కిటెక్స్, యంగ్వన్, గణేశా కంపెనీలను స్వయంగా తనిఖీ చేశారు. ఆయా పరిశ్రమల్లోని ఉత్పత్తి కార్యకలాపాలు, పనితీరును పరిశీలించి, సంబంధిత అంశాలపై అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో వస్త్ర

...మిగతా 2లో

సింగరేణిని ప్రైవేటీకరణ చేసేదే లేదు

బీఆర్ఎస్ పదేండ్లు ఏటీఎంలా వాడుకుని ఇప్పుడు రాజకీయం చేస్తోంది

బొగ్గు బ్లాకులను వేలం వేసినప్పుడు మోడీ కాళ్లు పట్టుకుంది మీరేగా?

బీఆర్ఎస్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 15 (మనం బ్యూరో): సింగరేణి తెలంగాణ ప్రజల గుండెకాయ.. దానిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రసక్తే లేదని రాష్ట్ర పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గత పదేళ్లలో సింగరేణిని ఏటీఎంలా వాడుకున్న బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పారదర్శకత వస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గురువారం సీఎల్పీలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ప్రస్తుతం తొమ్మిది గనుల నుంచి జీ-9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి

...మిగతా 2లో

ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఖతార్‌లోని భారత రాయబారి శ్రీకర్ రెడ్డి భేటీ

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక.. బతుకమ్మ

లోక్‌భవన్ బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ శుక్లా

గౌరమ్మకు గవర్నర్ దంపతుల ప్రత్యేక పూజలు

తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ప్రార్థన

కాంగ్రెస్ పాలనలో..

22-ఎ పేరిట వ్యవస్థీకృత భూ దోపిడీ

- ఎత్తివేత పేరుతో బడాబాబులకు లబ్ధి
- ప్రభుత్వం ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలె
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 15 (మనం బ్యూరో): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సెక్షన్ 22-ఏ నిషేధిత జాబితా పేరుతో లక్షలాది మంది భూ యజమానులు రైతులు తీవ్ర వేధింపులకు గురవుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మండిపడ్డారు. పట్టా భూములు, వ్యవసాయ క్షేత్రాలు, ప్లాట్లను అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చి వాటి తొలగింపు పేరుతో భారీ అవినీతి దందాకు తెరలేపారని ఆరోపించారు. గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో

...మిగతా 2లో

1 నుంచి ఫోన్ స్క్రీన్‌పై

కాలర్ ఐడీ

ఢిల్లీ, అక్టోబర్ 15: తెలియని నంబర్లతో వేధించే స్పామ్, మోసపూరిత కాల్సుకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీఓటీ) జారీ చేసిన తాజా ఆదేశాల ప్రకారం.. నవంబర్ 1 నుండి దేశంలోని అన్ని టెలికాం కంపెనీలు 4జీ, 5జీ నెట్వర్క్ లలో 'కాలింగ్ నేమ్ ప్రజెంటేషన్' సేవలను తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుంది. ట్రాయ్ సిఫార్సులతో

...మిగతా 2లో

హర్ముజ్‌లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు!

టెహ్రాన్, అక్టోబర్ 15: హర్ముజ్ జలసంధిలో ఓ కార్గో నౌక మునిగిపోయింది. సీమైన్‌ను ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ వెల్లడించింది. అయితే, మైన్‌ను ఢీకొట్టి నౌక మునిగిపోయినట్లుగా ఐఆర్జీసీ ప్రకటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. చట్ట విరుద్ధమైన, ప్రమాదకర మార్గంలో నౌక ప్రయాణిస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు చెప్పినట్లు

...మిగతా 2లో

పాకిస్థాన్

మళ్లీ సౌదీకి హ్యాండ్ ఇచ్చింది

రియాద్, అక్టోబర్ 15: ఒక చిన్న గెరిల్లా దళమైన హూతీలు సౌదీ అరేబియాపై వరుస దాడులు చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారు. రియాద్‌కు నమ్మకంగా ఉన్నట్టు నటించే పాకిస్థాన్ మరోసారి ముఖం చాటేసింది. ఇన్ని దాడులు జరుగుతున్నా ఇస్లామాబాద్ ఉలుకుపలుకు లేకుండా ఉండటం గమనార్హం. ఆగస్టు 7న సౌదీ, పాకిస్థాన్, టర్కియేలు 'మక్కా ఒప్పందం' పేరిట రక్షణ ఒడంబడికను కుదుర్చుకున్నాయి. తమలో ఏ ఒక్కరిపైన దాడి జరిగినా మూడు దేశాలూ రంగంలోకి దిగుతాయని హెచ్చరించాయి. కానీ గెరిల్లాల దెబ్బకు సౌదీ విలవిలలాడుతోంది. అయినా పాక్ పట్టించుకోకపోవడం గమనార్హం.

పాకిస్థాన్‌కు యుద్ధంలో దిగాలనివున్నా ఇరాన్ భయం నిలువరిస్తోంది. ఇప్పటికే భారత్ ధాటికి

పలు వైమానిక స్థావరాలను కోల్పోయింది. ఇరాన్‌తోనూ పాకిస్థాన్‌కు సుదీర్ఘమైన సరిహద్దు ఉంది. మరోపక్క తాలిబాన్ల సర్కార్‌తో పోరు సాగిస్తోంది. యెమెన్‌లో ఎలాంటి సైనిక చర్యలో పాల్గొన్నా.. ఇరాన్

...మిగతా 2లో

అది హిందూ వ్యతిరేక ఘటనే

అమెరికాలో ఆలయంపై దాడిపై భారత్ స్పందన

ఢిల్లీ, అక్టోబర్ 15: అమెరికాలో హిందూ ఆలయంలో కాల్పులకు కుట్రపన్నిన ఘటనపై భారత ప్రభుత్వం స్పందించింది. అది పూర్తిగా హిందూ వ్యతిరేక ఘటన అని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ కుట్ర కేసుపై విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మీడియాతో మాట్లాడారు. 'ఇల్లినోయిలోని అరోరా శివారు ప్రాంతంలోని హిందూ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకొని కాల్పుల కుట్రకు సంబంధించిన నివేదికలు మా దృష్టికి వచ్చాయి. ఆ కుట్ర ఘటన తీవ్ర కలవరానికి గురిచేసింది. దాని వెనక జాతి వివక్ష, హిందూ వ్యతిరేక స్వభావం ఉన్నట్లు తెలుస్తోంది. భారతీయుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది' అని జైస్వాల్ పేర్కొన్నారు. రైఫిల్ జామ్ అవడంతో ఆగిన నరమేధం.. భారతీయులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపే ఉద్దేశంతో

...మిగతా 2లో

కుప్పకూలిన పాఠశాల పైకప్పు..

34 మంది విద్యార్థులు మృతి

పెషావర్, అక్టోబర్ 15: పాకిస్థాన్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు పాఠశాల పైకప్పు కూలి 34 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అత్యధికులు 13 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులే కావడం విషాదకరం. పెషావర్‌లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం పూట తరగతులు జరుగుతుండగా

...మిగతా 2లో

ఆసియా గేమ్స్ విజేతలతో ప్రధాని భేటీ

ఢిల్లీ, అక్టోబర్ 15: ఆసియా క్రీడల పతక విజేతలతో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంభాషించారు. తన నివాసంలో అథ్లెట్లతో భేటీ అయిన ప్రధాని వారిని అభినందించారు. స్వర్ణాలు గెలిచిన భారత హాకీ, క్రికెట్ పురుష, మహిళా జట్లతోపాటు ప్రతి అథ్లెట్ తో మోడీ ఫొటోలు దిగారు. జపాన్ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ 85 పతకాలను గెలిచి తన నాలుగో స్థానాన్ని కాపాడుకుంది. ఇందులో 21 బంగారు, 27 రజత, 37 కాంస్య పతకాలు ఉన్నాయి.

పాద్దున్నే పెండి.. సాయంత్రం ఇడుపుకాయితం

కన్యాకుమారి, అక్టోబర్ 15: కొత్తగా పెళ్లి చేసుకున్న ఓ జంట రోజైనా గడవకముందే విడిపోయిన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. కన్యాకుమారి జిల్లా కుళచ్చల్కి చెందిన 31ఏళ్ల వయసున్న ఓ సైనికుడు, కన్యాకుమారి-కేరళం సరిహద్దు ప్రాంతమైన పారసాలై ప్రాంతానికి చెందిన 26ఏళ్ల యువతి నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. యువతి తిరువనంతపురంలోని ఓ ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తోంది. ఇదిలా ఉండగా పెద్దల అంగీకారంతో గత సోమవారం ఇద్దరి వివాహం జరిగింది. సాయంత్రం వివాహ రిసెప్షన్ ఏర్పాటు చేశారు. అప్పుడు మద్యం మత్తులో ఉన్న వరుడు.. వధువు తండ్రితో గొడవపడ్డాడు. మామ, అడ్డొచ్చిన భార్యపై చేయి చేసుకొని వెళ్లిపోయాడు. అనంతరం తండ్రీకూతుళ్లు కుళచ్చల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తర్వాత భర్తతో తెగదెంపులు చేసి కుమార్తెను తమ ఇంటికి తీసుకెళ్లారు.

అమెరికాలో ఆలయంపై దాడిపై భారత్ స్పందన

(మొదటి పేజీ తరువాయి)

నిందితుడు అలెగ్జాండ్రోస్ పపోరాకిస్ ఆలయానికి వెళ్లినట్లు పోలీసులు దర్యాప్తులో అధికారులు గుర్తించారు. అయితే, రైఫిల్ జామ్ అవడంతో కుట్ర విఫలమైనట్లు పేర్కొన్నారు. రెస్టారంట్లో తనతో పాటు పనిచేసే ఓ ఫ్రెండ్ కు ఫోన్ చేసి కాల్పులు జరపాలనుకున్న విషయాన్ని, తుపాకీ జామ్ అయిన సంగతిని చెప్పడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

34 మంది విద్యార్థులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాల భవనం పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ దుర్ఘటనలో 34 మంది విద్యార్థులతో పాటు ఓ ఉపాధ్యాయురాలు కూడా మరణించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. మరో 40 మందికిపైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం నేపథ్యంలో పాఠశాల యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎల్‌నినో ఓ ప్రకృతి విపత్తు

(మొదటి పేజీ తరువాయి)

తలెత్తే పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. కేంద్రం నుంచి ఎలాంటి సహకారం తీసుకోవాలి అనే అంశంపై సైతం చర్చించామనీ, 10 లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోయే పరిస్థితి ఉందని నివేదికలు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పంటలు ఎండిపోవద్దని అధికారులను ఆదేశించామనీ, ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. దేన్నైనా కొనుగోలు చేయవచ్చు కానీ, నీటిని కొనుగోలు చేయలేమనీ, అందుకే అందుబాటులో ఉన్న 200 టీఎంసీల నీటిని కేవలం తాగునీటి కోసమే వాడుకోవాలని కోరారు. చుక్కచుక్కనూ ఆదా చేసుకోవాలనీ, తప్పుడు ప్రచారాన్ని నమ్మి వరి సాగు చేస్తే నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు ఇచ్చే పథకాల ద్వారా రైతులను ఆదుకోవాలనీ, కేంద్రం నుంచి ఉదారంగా సాయం తీసుకునే అంశంపై అధికారులు నివేదికలు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్‌పై ఆరోపణలు.. బీఆర్ఎస్ నేతల పైశాచిక ఆనందం

కాంగ్రెస్ వల్లనే కరువు వచ్చిందని విమర్శించడం బీఆర్ఎస్ నేతల పైశాచిక ఆనందానికి నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఏపీ, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు బ్రిటన్, జపాన్ వంటి దేశాల్లో కాంగ్రెస్ పార్టీ ఉందా అని ప్రశ్నించారు. అక్కడ ఎలా ఏ సమస్య ఉంది, 100 దేశాల్లో ఈ సమస్య ఉందనీ, మిడిమిడి జ్ఞానంతో విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. అబద్ధాలతో అధికారంలోకి రావాలనీ, ప్రభుత్వంపై బురదజల్లాలని చూస్తున్నారని బీఆర్ఎస్ నేతలను విమర్శించారు. ఎవరు పక్క రాష్ట్రాలకు వెళ్లి క్షుద్రపూజలు చేశారో, చేతబడి చేశారో తెలంగాణ ప్రజలకు తెలుసు అమాయకులు కారని వ్యాఖ్యానించారు. శాశ్వతంగా తెలంగాణకు కృష్ణా జలాల్లో మరణశాసనం రాసింది ఎవరని ప్రశ్నించారు. కొండపోచమ్మ నుంచి పంచ పాండవుల చెరువుకు ఒక కాలువ తవ్వారనీ, పంచ పాండవుల చెరువు నుంచి నేరుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు 400 ఎకరాలకు నీళ్లు అందిస్తున్నారనీ, కేసీఆర్‌కు ఎందుకు ఈ ప్రత్యేక సౌకర్యం ఉందని ప్రశ్నించారు. దీనిపై నిజనిర్ధారణ కమిటీ వేద్దామా ? కేసీఆర్ నీళ్ల ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పంచపాండవుల చెరువు నుంచి నీళ్లు ఎవరి పొలాలకు వెళుతున్నాయో, చూసి తెలంగాణ ఎవరి పాలైందో చెప్పాలని ప్రశ్నించారు. విద్యుత్ సంక్షోభం రాబోతోందని 1040 మెగావాట్ల భద్రాద్రి ప్లాంట్, 4000 మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కేసీఆర్ హడావుడి చేశారని ఎద్దేవా చేశారు. నామినేషన్ బేసిస్‌పై ప్లాంట్లు ఇస్తున్నట్లు స్వయంగా కేసీఆర్ ప్రకటించారనీ, ఇందులో అవినీతి ఉందని మేం వ్యతిరేకించారని గుర్తు చేశారు. యాదాద్రి సూపర్ క్రిటికల్ పవర్ ప్రాజెక్టు కట్టడానికి రూ.17950 కోట్లతో ఒప్పందం చేసుకున్నారనీ, మూడేళ్లలో కడతామని బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో ఎంఎస్‌పీసీతో 2016లో ఒప్పందం చేసుకున్నారనీ, ఈ ఒప్పందాల వెనక ఉన్న ముసుగు వీరుడు ఎవరని ప్రశ్నించారు. నమస్తే తెలంగాణ పేపర్‌ను రూ100 కోట్లకు కొన్నది ఎవరు? దిగుమతి బొగ్గుపై ఏ విచారణకైనా ఆదేశించడానికి నేను సిద్ధంగా ఉన్నాం, ఏ విచారణ కావాలో కేటీఆర్ అడగాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

సింగరేణి ప్రైవేటీకరణ చేసేదే లేదు

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందనీ, గత పదేళ్లలో ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఏటా సగటున సుమారు 4 మిలియన్ టన్నుల జీ-9 బొగ్గు సరఫరా అయిందని తెలిపారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఏటా 14 మిలియన్ టన్నుల జీ-9 బొగ్గు సరఫరా చేసేలా ఇంధన సరఫరా ఒప్పందం బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందని గుర్తు చేశారు. సింగరేణి భవిష్యత్తులో చేపట్టే కొత్త గనుల నుంచి పెరిగే ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకుని ఆ ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. మరి ఆ కొత్త గనులు ఎందుకు రాలేదు ? కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనకపోవడంతో కీలకమైన కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులు సంస్థకు దక్కలేదన్నారు. దీని ఫలితంగా ఏటా దాదాపు 10 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసే అవకాశాన్ని సింగరేణి కోల్పోయిందని పేర్కొన్నారు. దాదాపు 14 గనులు మూతపడటం కూడా ఉత్పత్తిపై గణనీయమైన ప్రభావం చూపిందనీ, దీనివల్ల 15 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సింగరేణి కోల్పోయిందని వాస్తవం కాదా ? అని ప్రశ్నించారు. రెండేళ్లలోనే నైనీ బొగ్గు గనికి అనుమతులు సాధించి ఉత్పత్తి ప్రారంభించామనీ, మీ హయాంలో నైనీ వైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. ప్రతి టన్నుకు లెక్క ఉన్న ఈ వ్యవస్థలో బొగ్గు మాయమయ్యే అవకాశం లేదనీ ఆధారాలు ఉంటే బయటపెట్టండి, లేకుంటే సింగరేణి కార్మికుల అధికారుల నిజాయితీపై బురదజల్లడం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక లక్ష్యంతో పనిచేస్తుంది, సింగరేణికి కొత్త గనులను సాధిస్తున్నాం, భవిష్యత్తులో మరిన్ని గనులను సాధించేందుకు కృషి చేస్తామన్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటు కీలక ఖనిజాలు, థర్మల్, సౌర విద్యుత్ రంగాల్లో సింగరేణిని విస్తరించేలా కార్యాచరణ చేపడుతున్నామని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

22-ఎ పేరిట వ్యవస్థీకృత భూ దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 22-ఏ నిషేధిత జాబితా కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి సంపాదనకు ప్రధాన వనరుగా మారిందని విమర్శించారు. క్రమబద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగి 20 నుంచి 30 ఏళ్లుగా ప్రజల ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూములు, ప్లాట్లను సైతం రాత్రికి రాత్రి నిబంధనలకు విరుద్ధంగా 22-ఏ జాబితాలో చేరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిషేధిత జాబితా నుంచి పేర్లను తొలగించుకోవాలంటే బాధితులు భారీగా లంచాలు చెల్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందనీ, ఇందుకు నిదర్శనంగానే ఈమధ్య కాలంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది రెవెన్యూ అధికారులు ఏసీబీ వలలో చిక్కుకున్నారని గుర్తు చేశారు.

శామీర్‌పేట మండలం బొమ్రాస్‌పేటలో సుమారు 1500 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో అక్కడి రైతాంగం సమస్య పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. అలాగే, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకే సర్వే నంబరులో చిన్న ప్లాట్ వివాదంలో ఉందో లేక ప్రభుత్వ భూమి అన్న నెపంతో ఆ సర్వే నంబర్ మొత్తాన్ని నిషేధిత 22-ఏ జాబితాలో చేరుస్తున్నారని ఆరోపించారు. ఈ విధానం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు నిలువునా నష్టపోతుండగా, నిషేధిత జాబితా ఎత్తివేత పేరుతో జరిగే పైరవీల ద్వారా బడాబాబులు కొందరు బిల్డర్లు మాత్రమే లబ్ధి పొందుతున్నారని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా ప్రజల ఆస్తి హక్కులను రక్షించాల్సిన ప్రభుత్వమే నిషేధిత జాబితా పేరిట ప్రజలను వేధింపులకు గురి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని 22-ఏ నిషేధిత భూముల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తక్షణమే సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా రామచందర్‌రావు డిమాండ్ చేశారు.

హర్మూజ్‌లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు!

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక మీడియా పేర్కొంది. ప్రమాదానికి గురైన నౌక దాదాపు 2500 కంటైనర్లతో వెళ్తున్నట్లు సమాచారం. వీటిలో ఐఫోన్‌లు, లగ్జరీ పెర్ఫ్యూమ్ బాటిళ్లు, తదితర వస్తువులున్నాయి. ప్రమాదం అనంతరం కంటైనర్లు చెల్లాచెదురు కాగా అందులోని ఐఫోన్‌లు సహా ఇతర వస్తువులు కుప్పలుగా నీటిపై తేలియాడుతున్న దృశ్యాలు కనిపించాయి. జీఏఫ్ఎస్ ప్రైడ్ అనే సింగపూర్ జెండా ఉన్న నౌక దుబాయ్ నుంచి ఈ సరకులను తీసుకువెళ్తున్నట్లు తెలుస్తోంది.హర్మూజ్ మార్గంలో వెళ్తున్న సమయంలో సింగపూర్‌కు చెందిన రెండు సరకు రవాణా నౌకలు గుద్దు తెలియని వస్తువులను ఢీకొన్నాయని నౌకాశ్రయ అధికారులు తొలుత పేర్కొన్నారు. ఇందులో ఒకటి మునిగిపోగా.. మరొకటి సురక్షితంగా గమ్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మొదటి నౌకలోని సిబ్బంది అందర్నీ సురక్షితంగా తరలించామని, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని సింగపూర్ పోర్టు అధికారులు వెల్లడించారు.

సౌదీకి హ్యాండ్ ఇచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. ఇప్పటికే రెండు సరిహద్దు దేశాలతో ఉద్రిక్తతలు ఉన్నాయి. కొత్తగా ఇరాన్‌తో ఉద్రిక్తతలు అంటే కష్టమే అని పాక్ పాలకులు భయపడుతున్నారు. అందుకనే ఈ ఉద్రిక్తతలకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

దేశంలో షియా వర్గాలపై జరుగుతున్న దాడులతో వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. హూతీలపై ఎటువంటి దాడులు చేపట్టినా స్వదేశంలో తీవ్ర నిరసనలు ఎదురుకావచ్చు. ఇప్పటికే ఉగ్రవాదంతో పాటు వేర్పాటువాదం, సరిహద్దు సమస్యలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు ఇది మింగుడుపడని వ్యవహారమే. అందుకనే దూరంగా ఉంటున్నారు. 1960ల నుంచి సౌదీని నమ్మించి మోసం చేయడం పాకిస్థాన్‌కు రివాజుగా మారింది. 1969లో దక్షిణ యెమెన్ దళాలు సౌదీలోకి ప్రవేశించాయి. వీరిని వెళ్లగొట్టేందుకు సౌదీకి సాయంగా పాక్ వాయుసేన పరిమిత దాడులు చేసింది. అయితే భూతల పోరాటంలో పాల్గొనలేదు. 1980ల నుంచి రియాద్, ఇస్లామాబాద్‌ల మధ్య స్నేహబంధం బలపడింది. ఆఫ్గాన్ ముజాహిదీన్లకు ఆర్థిక వనరులు సౌదీ నుంచి వచ్చేవి. పాక్ తాను కొంత తీసుకొని మిగిలినది ముజాహిదీన్లకు అందించేది. 2011లోనూ బహ్రెయిన్‌లో తిరుగుబాటు సందర్భంగా పాక్ దళాల సాయాన్ని

సౌదీ ఆర్థించింది. ఇందుకు గాను కేవలం సైనిక సలహాదారులను మాత్రమే పాక్ పంపింది. 2015లో యెమెన్‌పై సౌదీ నేతృత్వంలో జరుగుతున్న దాడుల్లో పాక్ పాల్గొనబోదని ఆ దేశ పార్లమెంట్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. దీంతో సౌదీకి మళ్లీ ఆశాభంగమే కలిగింది. సౌదీ అరేబియా సుదీర్ఘకాలంగా పాకిస్థాన్‌ను పలు విధాలుగా ఆదుకుంటోంది. ఈ ఏడాదిలోనే 8 బిలియన్ డాలర్లను సాయంగా అందించింది. అంతకుముందు కాలంలోనూ భారీ సాయం చేసింది. ఎంత సాయం తీసుకున్నా పాక్ తన వక్రబుద్ధిని ప్రదర్శిస్తూనే వుంది.

తెలంగాణలో 24 లక్షల ఎకరాలు అటవీ భూమి మాయం

- అసైన్డ్ భూముల అమ్మకానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది?
- ధరణి, భూ భారతి రెండింటిలోనూ అక్రమాలున్నాయ్?
- బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలో దాదాపు 24 లక్షల ఎకరాల అటవీ భూమి లెక్కల్లో వ్యత్యాసం కనిపిస్తోందని, ఆ భూమి ఏమైందో ప్రభుత్వం స్పష్టం చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ప్రముఖ నాయకులే ఈ భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు హైదరాబాద్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూముల అక్రమాలకు సంబంధించిన గణాంకాలను ఆయన వివరించారు. అయితే, ప్రభుత్వం చెబుతున్న అధికారిక రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 66,33,313 ఎకరాల అటవీ భూమి ఉండాల్సి ఉండగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేవలం 42.53 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ భారీ

వ్యత్యాసంపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం అసైన్డ్ భూముల విక్రయానికి సిద్ధమవుతోందని, ఇది పేద ప్రజలకు తీరని అన్యాయం చేయడమేనని ఆయన విమర్శించారు. గతంలోని ధరణి పోర్టల్ నుంచి నేటి భూభారతి వరకు కేవలం పేర్లు మాత్రమే మారాయని, అక్రమాలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గతంలో న్యాయస్థానం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసిన సెక్షన్ 22ఏను, ప్రభుత్వం కొన్ని సవరణలతో నేటికీ కొనసాగించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ఆయన ప్రశ్నించారు. ఈ ఆరోపణలతో తెలంగాణలో భూ రికార్డులు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై రాజకీయ చర్చ మరింత ఊపందుకుంది.

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో తనిఖీ

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వరంగల్ ప్రాంతంలో వస్త్ర పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం కల్పించాలని, స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను పెంపొందించాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన ప్రతిపాదనలతో ముందుకు రావాలని అధికారులను ఆదేశించారు.వస్త్ర పరిశ్రమ రంగం అభివృద్ధి చెందడం ద్వారా స్థానికంగా పరిశ్రమల విస్తరణకు, ఈ ప్రాంత ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి, పరిశ్రమలకు అవసరమైన సహకారాన్ని సకాలంలో అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, చేనేత మరియు వస్త్ర శాఖ అదనపు సంచాలకులు ఎన్. వెంకటేశ్వరరావు, ఏడీ శ్రీకాంత్ రెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, నారాయణ రెడ్డి, టీటీడీఓ, సంగెం తహసీల్దార్ జి. రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ వచ్చాక కరెంట్ సర్వనాశనం

ఎమ్మెల్సీ దాసోజు ధ్వజం

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ ఉద్యమ కాలంలో ఎన్నో సందర్భాల్లో ఇందిరాపార్క్ వద్ద ధర్నాలు, సమ్మెలు, కరెంట్ కోతలకు వ్యతిరేకంగా రైతులు చేసిన ధర్నాలు మరచిపోలేము. తెలంగాణకు రాకముందు పవర్ హాలీడేస్ డిక్లేర్ చేయాల్సిన అగత్యం వచ్చి పరిశ్రమల కానీ ధర్నాలు చేసిన సంఘటనలు చూశామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు.

ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో దాసోజు మాట్లాడుతూ... దానికి కొనసాగింపుగా అన్నట్టుగా పరాకాష్టగా ఆనాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి కర్ర పట్టుకొని తెలంగాణ ఏర్పడితే కరెంట్ కష్టాలుంటాయన్నారు. తెలంగాణ అంధకారంలో మునిగిపోతదని పత్రికా సమావేశాలు పెట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన విషయాన్ని ఒకసారి తెలంగాణ సమాజానికి గుర్తు చేస్తూనే తదనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఒక రుషివలే తపస్సు చేసినట్టుగా అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేసి కనురెప్పపాటు కూడా కరెంట్ పోకుండా దేశమంతా నివ్వెరపోయేలా కరెంట్ అందించిన ఘనత కేసీఆర్ది.. బీఆర్ఎస్ పార్టీదని దాసోజు శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. కేవలం 7 వేల మెగావాట్ల ప్రతిపాదిత సామర్థ్యం ఉన్న కరెంట్ ఉత్పత్తిని 20 వేల మెగావాట్ల వరకు దాన్ని పరిగెత్తించి ప్రపంచమే ఔరా అని అబ్బురపోయే రీతిలో కేసీఆర్ రెవెల్యూషనైజ్ ది ప్రొడక్షన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఇన్ ది స్టేట్ ఆఫ్ తెలంగాణ దేశంలోనే అంత త్వరిత గతిలో కరెంట్ ఉత్పత్తికి తోడ్పడిన ప్రభుత్వం కానీ, నాయకుడు కానీ లేరు.

అది కేసీఆర్కు మాత్రమే వర్తిస్తుందన్నారు.కరెంట్ అనేది ఏ అభివృద్ధికైనా మూల ఇంధనం లాంటిది. ఇవాళ కరెంట్ లేకపోతే ప్రపంచమే అంధకారంలో ఉండేది.. దాన్ని గుర్తించి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రోగ్రెసివ్ పాలసీలు కావొచ్చు.. కెపాసిటీలు పెంచిన తీరు కావొచ్చు. దాదాపు లక్ష కోట్ల రూపాయలు విద్యుత్ రంగంపై ఖర్చు పెట్టిన తీరు కావొచ్చు. తదనునుగుణంగా 20 వేల మెగావాట్ల కరెంట్ సామర్థ్యం పెరిగిన పరిస్థితి ఉందన్నారు. కరెంట్ కష్టాలు లేకుండా అటు పరిశ్రమలుకానీ, రైతులు కానీ, గృహస్తులు కానీ ఎవరికీ ఏ రకమైన ఇబ్బందులు లేకుండా తయారు చేసిన పరిస్థితి. కానీ దురదృష్టవశాత్తు ఇవాళ రేవంత్ రెడ్డి అనే మహమ్మారి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలు ఎట్లైతే సర్వనాశనం అయ్యాయో.. కరెంట్ కూడా పూర్తిగా సర్వనాశనమైపోతుంది.. విధ్వంసానికి గురవుతుందన్న పరిస్థితిని బీఆర్ఎస్ పార్టీ ఇవాళ బాధతో వ్యక్తీకరిస్తోందన్నారు. తెలిసినవాడికి చెప్పొచ్చు.. తెలియని వాడికి చెప్పొచ్చు.. కానీ తెలిసీ తెలియని వాడికి చెప్పడం కష్టం. అది రేవంత్ రెడ్డి, ఆయన కేబినెట్, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో స్పష్టంగా కనిపిస్తుందన్నారు.

వైసీపీ 'స్థానిక' అభ్యర్థుల ఎంపిక

హైదరాబాద్, అక్టోబర్ 15: స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ ఫోకస్ పెంచింది. ఎన్నికలకు సమయం తక్కువగా ఉండటంతో గెలుపు దిశగా పావులు కదుపుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో మేయర్లుగా గెలిచే ఆస్కారం ఉన్న వారిని అభ్యర్థులుగా ఎంపిక చేసిన అధిష్ఠానం.. తాజాగా వారి పేర్లను ప్రకటించింది. ఏలూరు - గంటా మోహన్ రావు, మచిలీపట్నం - లంకా జ్యోతి, కడప - బండి దీప్తిరెడ్డి, ఒంగోలు - కుప్పం ప్రసాద్, విజయనగరం - కోలగట్ల శ్రావణి, విశాఖపట్నం - వరుదు కల్యాణి, నెల్లూరు - ఆనం విజయ్ కుమార్, కర్నూల్ - ఎం.సుశీల, విజయవాడ - రాయని భాగ్యలక్ష్మి, పులివెందుల - వైఎస్ ప్రమీలమ్మ, బద్వేల్ - వెంకటసాయికృష్ణ, చీరాల - ఇస్తర్ల షెర్లి, తెనాలి - మద్దాలి శేషాచలం, కొండపల్లి - నల్లమోతు తేజస్వి, రామచంద్రాపురం - నాగేశ్వరరావు, కొవ్వూరు - మన్నె పద్మ, తుని - పిల్ల రామతులసి, యలమంచిలి - బి. తులసి, నర్సీపట్నం - చింతకాయల అనిత, పలాస - తలసు శ్రీపద్మ, ఇచ్ఛాపురం - రాజ్యలక్ష్మి, మదనపల్లె - జింక చలపతి, ప్రొద్దుటూరు - పి. నర్సింహారెడ్డి, వైసీపీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థులుగా ప్రకటించింది.

నగర పంచాయతీలకు కూడా...

అలాగే ఆరు నగర పంచాయతీలకు కూడా వైఎస్సార్సీపీ అధిష్ఠానం అభ్యర్థుల్ని ప్రకటించింది. ఏలేశ్వరం నగర పంచాయతీ అభ్యర్థిగా బి. ఆశాలత, ఉయ్యూరు నగర పంచాయతీ అభ్యర్థిగా పి. దివ్య, గురజాల వైసీపీ నగర పంచాయతీ అభ్యర్థిగా పోలు వీరారెడ్డి, కనిగిరి నగర పంచాయతీ అభ్యర్థిగా పులి శాంతిరెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ అభ్యర్థిగా షేక్ షకీలా బేగం, కమలాపురం నగర పంచాయతీ అభ్యర్థిగా మర్జుల కవితలను ప్రకటించింది.

1 నుంచి ఫోన్ స్క్రీన్‌పై కాలర్ ఐడీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ అధికారిక, వెరిపై చేసిన కాలర్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ ద్వారా.. ఎవరికైనా ఫోన్ కాల్ రాగానే, వారి ఫోన్ స్క్రీన్ పై నంబర్తో పాటు ఆ వ్యక్తి లేదా సంస్థ అసలు పేరు స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవేళ కాంటాక్ట్ నంబర్ సేవ్ చేయకపోయినా, టెలికాం ఆపరేటర్ల డేటాబేస్ లేదా జీఎస్టీ (జీఎస్టీ), ట్రేడ్మార్క్ రికార్డుల ఆధారంగా రిజిస్టర్డ్ పేరు ఆటోమేటిక్గా డిస్ ప్లే అవుతుంది. అంతర్జాతీయ కాల్స్ వస్తే స్క్రీన్ పై 'అంతర్జాతీయ కాల్' అని ప్రత్యేకంగా సూచిస్తుంది. కాల్ ముగిసిన వెంటనే పైవసీని కాపాడేలా 'సెక్యూరిటీ-బై-డిజైన్' టెక్నాలజీ ద్వారా నంబర్ వివరాలు మాయమవుతాయి. తద్వారా దేశంలోని మొబైల్ యూజర్లకు ఫేక్ కాల్స్ బెడద తప్పుతుందని నిపుణులు భావిస్తున్నారు.

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక.. బతుకమ్మ

హైదరాబాద్, అక్టోబరు 15, 2026: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు , స్త్రీశక్తికి, సౌభాగ్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల్లో ప్రకతి పట్ల ఆరాధనాభావాన్ని, సాంస్కతిక వారసత్వం పట్ల గౌరవాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా అన్న

కొన్నినెలల్లో మరింతగా ఎల్‌నినో ప్రభావం

- భూగర్భ జలమట్టాలు పడిపోవడంపై ఆందోళన
- సింగూరు, మంజీరా జలాశయాల నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ప్రస్తుతం తీవ్రంగా ఉందని, 2027 ఫిబ్రవరి నాటికి, అది మరితం గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలపై గణనీయమైన ప్రభావం పడిందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగాయని చెప్పారు. ఈ మేరకు సింగూరు జలాశయాన్ని గురువారం సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, సాగులో ఉన్న పంటల పరిస్థితిని అంచనా వేయడానికి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితులపై మంత్రివర్గ తాజా సమావేశంలో సైతం విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. రానున్న 15 నుంచి 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పంటలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీరు అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. అందువల్ల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సీఎస్ సూచించారు. హైదరాబాద్తో పాటు సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా రూపొందించిన ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే 15 రోజుల నీటి లభ్యతను అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు పంటలపై చూపే ప్రభావాన్ని వ్యవసాయ, విద్యుత్, సాగునీటి శాఖలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో రైతులు, స్థానిక ప్రజలను కలిసి వారి అవసరాలను తెలుసుకోవాలని, ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

భక్తుల కొంగుబంగారం.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి

చిట్కుల్ శ్రీ తుల్జా భవాని అమ్మవారు!
భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు
నవరాత్రుల్లో నిత్య అన్నదానం
భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు
ఆలయవ్యవస్థాపకులు కే.జనార్దన్ చారి

పటాన్‌చెరు, అక్టోబర్ 15 (మనం న్యూస్): భక్తుల పాలిట కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా చిట్కుల్ శ్రీ తుల్జా భవాని మాత భక్తుల పూజలు అందుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ ఆదర్శ్ కాలనీలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు.

2018లో స్వయంభువుగా వెలసిన అమ్మవారు..

చిట్కుల్ ఆదర్శ్ కాలనీలో 2018లో వేపచెట్టు కింద శ్రీ తుల్జా భవాని మాత స్వయంభువుగా వెలసినట్లు భక్తులు విశ్వసిస్తున్నారు. అప్పటి నుంచి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ వ్యవస్థాపకులు కే. జనార్దన్ చారి ఆధ్వర్యంలో 2022 నుంచి ప్రతి సంవత్సరం దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు.. చండీ హోమం

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు చండీ హోమం చేపడుతున్నారు. నవరాత్రుల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆలయం చుట్టూ 11 ప్రదక్షిణలు చేస్తే తమ కోరికలు నెరవేరుతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు.

ప్రతి వారం 500 మందికి అన్నదానం..

ఆలయంలో అన్నదాన కార్యక్రమం విశేషంగా కొనసాగుతోంది. ప్రారంభంలో ప్రతి శుక్రవారం ఐదుగురు భక్తులతో మొదలైన అన్నదానం, ప్రస్తుతం ప్రతి వారం సుమారు 500 మంది భక్తులకు సేవలందించే స్థాయికి చేరింది. నవరాత్రి ఉత్సవాల సమయంలోనూ నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు.

నవరాత్రి దీక్షలో విజయలక్ష్మి అమ్మవారు..

2022 నుంచి విజయలక్ష్మి అమ్మవారు దసరా నవరాత్రుల సందర్భంగా ఆలయంలో నవరాత్రి దీక్షను కొనసాగించడం ప్రత్యేకతగా నిలుస్తోంది. అమ్మవారిపై భక్తితో దీక్ష చేపట్టి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం: ఆలయ వ్యవస్థాపకులు జనార్దన్ చారి

ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు కే. జనార్దన్ చారి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం దసరా నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, చండీ హోమంతో పాటు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తుల ఆదరణతో ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని జనార్దన్ చారి పేర్కొన్నారు.

రైతు బీమా ఏది?

ఆ బీమా ఎప్పుడిస్తరు?: హరీశ్ రావు

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో రాష్ట్రవ్యాప్తంగా 3000 మంది రైతులు చనిపోయారని సమాచారముందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. ఈ విషయమై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అయితే, తన నియోజకవర్గం ఒక్క సిద్ధిపేటలోనే 22 మంది రైతులు చనిపోయారన్నారు.. ఈ ఆగస్టు 15 నుండి ఇప్పటి వరకు 22 మంది రైతులు చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈ 3 వేల కుటుంబాలు రైతు బీమా అందకపోవడంతో నేడు రోడ్డుమీద పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ప్రభుత్వం మేల్కోవాలని సూచించారు.. ఈ 3 వేల కుటుంబాలకు కూడా రైతు బీమా డబ్బులు వెంటనే చెల్లించి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని ఒక వేళ ప్రభుత్వం దిగి రాకపోతే.. ఈ రైతు కుటుంబాలను తీసుకొచ్చి నీ ఇంటి ముందు ధర్నా చేయాల్సి వస్తదని, సెక్రటేరియట్‌ను ముట్టడించాల్సి వస్తదని సీఎం రేవంత్ రెడ్డిని, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం డబ్బులు వెంటనే ఇచ్చి రైతు బీమా పథకాన్ని కొనసాగించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఆన్నారు. లేదంటే వారి కుటుంబ సభ్యులందరినీ తీసుకొచ్చి మీ ఇల్లు ముట్టడిస్తామని హరీశ్‌రావు ఈ సందర్భంగా హెచ్చరించారు. అయితే, బీఆర్ఎస్ పార్టీ పక్షాన రాష్ట్రవ్యాప్తంగా రైతు బీమా పథకానికి దూరమైన 3 వేల మంది కుటుంబాలను ఆదుకోవాలని.. అందరికీ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించి తక్షణమే ఎల్ఐసీకి ప్రీమియం కట్టి రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

సర్కార్ వైఫల్యంతోనే కరెంట్ కోతలు

సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్ రావు ఫైర్
సీఎం అధికారులపై నెపం నెడుతున్నరు?

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు చేతిలో మీ ఉద్యోగం ఊస్టింగ్ తప్పదని, అది ఊడగొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం రేవంత్‌ను గట్టిగా హెచ్చరించారు.

ఇబ్బడి ముబ్బడి హామీలు, అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేతగానీ తనంతోనే తెలంగాణ రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు. నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులపైకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. ఎల్‌నినోను కొవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపైనా హరీశ్ రావు స్పందించారు. వీటన్నింటికంటే మీ పాలనే పెద్ద విపత్తు అని ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించాలని హితవు పలికారు.

తెలంగాణలో మరో భారీ స్కామ్

రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు స్కామ్
తెలంగాణను దోచే బొగ్గు స్కామ్‌ను అపాలంటూ సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో వేలుగు మూసిన కాంగ్రెస్ సర్కార్ రూ. 3 వేల కోట్ల విదేశీ బొగ్గు స్కామ్ ఆపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్.. సీఎం రేవంత్ రెడ్డికి గురువారంనాడు బహిరంగ లేఖ రాశారు. విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో రూ. 3 వేల కోట్ల భారీ స్కాముకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. అయితే, భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో ముందే ముఖ్యమంత్రి చీకటి ఒప్పందం చేసుకొని.. కావాలనే కృత్రిమ బొగ్గు కొరత, కరెంట్ సంక్షోభం సృష్టించి అదను చూసి కంపెనీని రంగంలోకి దింపారని ఆరోపించారు. భోత్రా లాజిస్టిక్స్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న అన్ని రహస్య అగ్రిమెంట్లు బయటపెట్టాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఏ ప్రాతిపదికన సదరు కంపెనీని ఎంపిక చేశారో సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. ఈ మొత్తం కుంభకోణంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్ విదేశీ బొగ్గు దిగుమతి పేరిట సింగరేణికి మరణశాసనం రాస్తున్నారన్నారు. కాంగ్రెస్-బీజేపీ కలిసి చేస్తున్న ఈ కుట్రలను బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించబోదని ఆయన హెచ్చరించారు. విదేశీ బొగ్గు దిగుమతుల విషయంలో ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారో ముఖ్యమంత్రి రేవంత్ ప్రజలకు స్పష్టం చేయాలన్నారు.

సీఎంవోలో యథేచ్ఛగా కమీషన్ దందా

రేవంత్ సర్కార్‌పై మండిపడ్డ కేటీఆర్
ప్రతి ప్రాజెక్టులో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోన్న సీఎంవో
ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భారీ అవినీతిలో కురుకు పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలవికానీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చాక.. రాష్ట్రంలో చేపడుతున్న ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇది రేవంత్ సర్కార్ అవినీతి పాలనలకు పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. అది చేస్తాం ఇది చేస్తాం అంటూ అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, కేవలం ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, సీఎంవో, వారి అనుచరులు ఎవరికి వారు, వారి సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు. తాను ఉత్తుత్తి ఆరోపణలు చేయడం లేదన్నారు.

తాజాగా ఆయన చేసిన తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఇటీవల ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉంటే, తెలంగాణకు చెందిన మరో సంస్థ సుశే ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను సైతం ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని, కేటీఆర్ తనదైన శైలీలో ప్రభుత్వాన్ని కడిగి పారేశారు. అయితే, ఇక్కడ ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారన్నారు. ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిందన్నారు. అక్రమార్జనే ధ్యేయంగా కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే వారు దృష్టి సారించారని కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. వ్యవస్థ ఇలాగే తెలంగాణ రాష్ట్రం మరింత అప్పుల్లో కురుకుపోయే ప్రమాదం ఉందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ప్రజలు సైతం ఈ దుష్ట ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు సైతం దగ్గరలోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

అన్నోజిగూడ ఓఆర్ఆర్ సమీపంలో కారు దగ్ధం

ఒక్కసారిగా చెలరేగిన మంటలు..
కారు దిగి పరుగులు పెట్టిన ప్రయాణికులు



హైదరాబాద్, మనం ప్రతినిధి : హైదరాబాద్ శివారు ప్రాంతం అన్నోజిగూడ ఓఆర్ఆర్ సమీపంలో పెను ప్రమాదం తప్పింది. మేడ్చల్ జిల్లా అన్నోజిగూడ ఫ్లైఓవర్‌పై వేగంగా వెళ్తున్న ఓ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన ప్రయాణికులు వెంటనే కారు నుంచి కిందకు దిగి పారిపోవడంతో నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. ప్రత్యక్షసాక్షులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. పూర్తి వివరాల్లోకి వేళితే, వరంగల్‌కు చెందిన నలుగురు వ్యక్తులు ఓ రెనాల్ట్ పెట్రోల్ కారులో ప్రయాణిస్తున్నారు. పోచారం ఐటీ కారిడార్ పరిధిలోని అన్నోజిగూడ ఫ్లైఓవర్ వద్దకు రాగానే, కారు ఇంజిన్ భాగం నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. వెంటనే దీనిని గమనించిన ప్రయాణికులు కారును నిలిపివేసి కిందకు దిగిపోయారు. దీంతో చూస్తుండగానే మంటలు కారు అంతటా వ్యాపించి, వాహనం పూర్తిగా దగ్ధమైంది. ప్రయాణికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సైతం అక్కడికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాంకేతిక లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

భరోసా కేంద్రాన్ని సందర్శించిన ప్రధాన న్యాయమూర్తి

భూపాలపల్లి అక్టోబర్ 15 మనం ప్రతినిధి: జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్ కుమార్ గురువారం నాడు సందర్శించారు. భరోసా కేంద్రంలో నమోదవుతున్న కేసుల వివరాలను కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోర్టు పరిపాలనాధికారి పారిజాతం, ఎస్.ఐ స్వప్నకుమారి, కోఆర్డినేటర్ రమాదేవి, లీగల్ కౌన్సిలర్ రజిత, సూపరింటెండెంట్ రఘు రామ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులపై అవినీతి కేసులు క్లోజ్

ఏసీబీ విజ్ఞప్తికి నాంపల్లి కోర్టు ఆమోదం.. 22 కేసులు మూసివేత

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో పోలీసు అధికారులకు సంబంధించిన రెండు అవినీతి కేసుల మూసివేత నివేదికలను నాంపల్లి ఏసీబీ కోర్టు ఇటీవల ఆమోదించింది. 2019లో నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఎస్పీ స్థాయి అధికారిపై ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. మరో కేసులో పబ్ యజమాని నుంచి లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలతో ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, హోంగార్డుపై కేసు నమోదైంది. అయితే, 2023 నుంచి సుమారు 22 ప్రభుత్వ అధికారుల అవినీతి కేసులు మూసివేయటం చర్చనీయాంశంగా మారింది. ఈ మూసివేసిన కేసుల్లో ఒకటి ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించినది కాగా.. మరొకటి పబ్ యజమాని నుంచి లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలకు సంబంధించినది. ఈ రెండు కేసుల్లోనూ నిందితులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు బదులుగా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఏసీబీ కోర్టును ఆశ్రయించింది.

మరింత ఆధునికంగా ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్

హైదరాబాద్, అక్టోబర్ 15 మనం న్యూస్: వినియోగదారుల అభిప్రాయాలకు అనుగుణంగా ఉత్పత్తులు, సేవలను మెరుగుపరుస్తున్నట్లు ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్ ప్రకటించింది. వినియోగదారుల సమీక్షలు, పరికరాల పనితీరుపై స్పందనలు, సేవల అనంతరం అందే సూచనల ఆధారంగా సాఫ్ట్‌వేర్ నవీకరణలు, సాంకేతిక పరీక్షలు, వినియోగదారుల సహాయ సేవలను బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించింది. నోవా 2 నియో 5జీ బ్యాటరీ పనితీరు, సులభ వినియోగానికి, నోవా 2 పవర్ 5జీ రూపకల్పనకు, నోవా 2 అల్టా 5జీ కెమెరా, తెర నాణ్యతకు ప్రశంసలు పొందాయని తెలిపింది. పలువురు వినియోగదారులు సూచించిన కెమెరా స్థిరత్వం, అనుసంధాన సమస్యలు, పరికర పనితీరుపై దృష్టి సారించి లక్ష్యిత సాఫ్ట్‌వేర్ నవీకరణలు అందిస్తున్నట్లు పేర్కొంది. నోవా 2 అల్టా 5జీకి కెమెరా పనితీరు మెరుగుపరిచే నవీకరణలు అందించినట్లు వెల్లడించింది. ప్రాజెక్ట్ ఓపెన్ రివ్యూ ద్వారా ఉత్పత్తుల విడుదలకు ముందే సమీక్షకులు, సాంకేతిక నిపుణులు, పాత్రికేయులు, సృష్టికర్తల నుంచి వెయ్యికి పైగా నమోదు దరఖాస్తులు అందినట్లు తెలిపింది. బ్రాండ్ మార్కెటింగ్, వృద్ధి విభాగాధిపతి ఆర్చి గొగోయ్ మాట్లాడుతూ, వినియోగదారుల అభిప్రాయాలను కార్యాచరణలోకి మార్చడమే తమ లక్ష్యమన్నారు. సేవా సమస్యలను సాధారణంగా మూడు నుంచి నాలుగు రోజుల్లో పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ వెల్లడించింది. సమస్య స్వభావం, విడిభాగాల లభ్యతను బట్టి పరిష్కార సమయం మారుతుందని పేర్కొంది.

వైద్యాలయమా? మృత్యు కేంద్రమా?

మెడికవర్ అరాచకాలపై నిగ్గుతేలుతున్న నిజాలు!
కార్పొరేట్ ముసుగులో సాగుతున్న నిరాటంక నరమేధం

హైదరాబాద్, అక్టోబర్ 15 (మనం న్యూస్): 'సేవ' అనే అత్యంత పవిత్రమైన, పది మందికి ప్రాణం పోసే పదాన్ని ఒక పెద్ద బూచీలా అడ్డుపెట్టుకుని, నిండు ప్రాణాలను కేవలం అంగడి సరుకులుగా, వ్యాపార వస్తువులుగా మలుస్తున్న కార్పొరేట్ వైద్య మాఫియా రాక్షస క్రీడ నేడు మన సమాజానికి పెను శాపంగా పరిణమించి యావత్ వ్యవస్థను వేళ్లూనుకుని పట్టి పీడిస్తోంది. సికింద్రాబాద్‌లోని 'మెడికవర్' ఆసుపత్రి కేంద్రంగా వెలుగుచూస్తున్న వరుస ఘటనలు, వైద్య నిపుణుల నిర్లక్ష్య వైఖరి యావత్ రాష్ట్రాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తూ ప్రజాక్షేత్రంలో అగ్గిలా మండుతున్నాయి. కేవలం లక్షలు, కోట్లు సంపాదించడమే పరమావధిగా సాగుతున్న ఈ కార్పొరేట్ వైద్య విధానం, సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తీరుపై ఇప్పుడు తీవ్రమైన ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఏ దవాఖాన గడప తొక్కితే సంపూర్ణ ఆరోగ్యంతో బతికి బయటకు వస్తాడనుకుంటామో, సరిగ్గా అదే ఆసుపత్రి నేడు నిస్సహాయులైన రోగులకు మృత్యుకూపంగా మారుతుండటం యావత్ నాగరిక సమాజం తలదించుకుని సిగ్గుపడాల్సిన తీవ్రమైన విషయంగా పరిణమించింది.

బలవుతున్న నూరేండ్ల జీవితాలు..

చిన్నపాటి అనారోగ్య సమస్యతో నమ్మకంతో ఆసుపత్రి గడప తొక్కిన ఒక చురుకైన న్యాయవాద యువతి, కేవలం వైద్యుల తీవ్ర నిర్లక్ష్యం, బాధ్యతారహిత్యం,తప్పుదోవ పట్టించే చికిత్స కారణంగా అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం మాత్రమే కాదు, ఈ సమాజం ఎప్పటికీ క్షమించరాని ఘోరమైన నేరం. రేపటి సమాజానికి వెలుగునివ్వాల్సిన, కుటుంబం కార్పొరేట్ వైద్యుల చేతిలో దారుణంగా బలైపోతుంటే యావత్ మేధావి వర్గం కలచిపోయి నిశ్చేష్టమైపోతోంది. పూర్తిగా పోయి, శవంగా మారుతున్నాడంటే అక్కడ ఏ స్థాయి దోపిడీ, ఎంతటి నాసిరకం వైద్యం అందుతుందో వేరే చెప్పనక్కర్లేదు. బ్రతికి వస్తుందనుకున్న కూతురు విగతజీవిగా మారుతుంటే, ఆ తల్లిదండ్రులు పడుతున్న గుండెకోత, రోదనలు చూసేవారి గుండెల్ని పిండేస్తున్నాయి. ప్రాణం విలువ కనీసం తెలియని ఈ దవాఖానల యాజమాన్యాలకు ధనమే దైవంగా మారిపోయి, మనుషుల ప్రాణాలను గడ్డిపోచలతో సమానంగా చూస్తున్న దుస్థితి నేడు మన కళ్ల ముందే అత్యంత క్రూరంగా ఆవిష్కృతమవుతోంది.

సిగ్గుమాలిన అహంకార ధోరణి...

ఒక నిండు ప్రాణం పోవడానికి కారణమైన ఆసుపత్రి యాజమాన్యం, కనీస మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సింది పోయి అత్యంత వివాదాస్పద రీతిలో స్పందిస్తున్న తీరు తీవ్రంగా గర్హించదగ్గది. రోగి పరిస్థితి విషమించడానికి గల అసలు కారణాలను నిష్పక్షపాతంగా వివరించాల్సింది పోయి, తాము చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి అడ్డగోలు వాదనలు, దొంగ దస్తావేజులు తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రపూరిత ప్రయత్నం చేస్తున్నారు. బాధితుల తరపు కుటుంబ సభ్యులు, న్యాయవాదులు లేదా ప్రజా సంఘాల ప్రతినిధులు నిర్భయంగా వాస్తవాలు నిలదీయడానికి వెళితే, వారిని అధికార బలంతో, బెదిరింపులకు గురిచేసేలా నీచమైన రీతిలో వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రి లోపల స్పష్టమైన వైఫల్యం జరిగిందని తిరుగులేని సాక్ష్యాధారాలతో తేలిపోయినా, దాన్ని అంగీకరించే బదులు దబాయింపు ధోరణి అవలంబించడం వారి అహంకారానికి, చట్టానికి తాము అతీతులమనే అహంభావ భ్రమలకు పరాకాష్ఠగా మారుతోంది. తప్పును దిద్దుకోవడానికి బదులుగా బెదిరింపులకు దిగే ఈ అహంభావంపై చట్టపరమైన కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రక్షణ వలయాల వెనుక నీచ రాజకీయాలు...

ఇటువంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న హంతక కార్పొరేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగాలు కొన్ని సందర్భాల్లో అత్యంత కని కట్టుగా, పక్షపాత ధోరణితో వ్యవహరించడం అత్యంత విచారకరం. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజలు, యువజన సంఘాలు ఆందోళనకు దిగితే, ఆసుపత్రి లోపల జరిగిన తప్పుల

ఎందుకో?

కొన్నిసార్లు పకపకా నవ్వాలనిపిస్తుంది -
నవ్వుల పూలు విరబూయాలని,
నలుదిక్కులా ఆనందం చిందేలా
నా మనసే వసంతం కావాలని!
కొన్నిసార్లు గగనాన విహరించాలనిపిస్తుంది -
ఆకాశపు అంచుల్ని తాకాలని,
గాలిపటమై గాలితో పోటీపడుతూ
కలల లోకంలో విహరించాలని!
కొన్నిసార్లు ఎదురుతిరగాలనిపిస్తుంది -
ఎదలోని ఆవేశం ఎగిసిపడాలని,
అన్యాయపు గోడలను కూలదోస్తూ
ఆత్మగౌరవపు జెండా ఎగరేయాలని!
కొన్నిసార్లు తలవంచాలనిపిస్తుంది -
తప్పులను తలచుకొని తల్లడిల్లుతూ,
అహంకారాన్ని అణచి వినయంతో
ఆత్మపరిశీలన చేసుకోవాలని!
కొన్నిసార్లు పారిపోవాలనిపిస్తుంది -

బాధల బంధాలు వెంటాడుతుంటే,
బరువెక్కిన బ్రతుకు బాటల నుంచి
దూరతీరాలకు చేరుకోవాలని!
కొన్నిసార్లు మాటలాడాలనిపిస్తుంది -
మనసులోని మధురిమలన్నీ పంచాలని,
మౌనంగా మిగిలిన మమతలన్నీ
మాటల ముత్యాలుగా మార్చాలని!
కొన్నిసార్లు మౌనం వహించాలనిపిస్తుంది -
మాటల మంటలు మనసును దహిస్తుంటే,
వాదనల వలయాల నుంచి విడివడి
ప్రశాంత తీరాన నిలవాలని!
కొన్నిసార్లు రాయాలనిపిస్తుంది -
రాయని భావాల రెక్కలు విప్పాలని,
కన్నీటి చుక్కల్ని కవితలుగా మార్చి
కాగితంపై హృదయాన్ని పరచాలని!
కొన్నిసార్లు ఏడ్వాలనిపిస్తుంది -
ఎదలోని వేదనంతా కరిగిపోవాలని,
కన్నీటి ధారలో కలతలన్నీ కొట్టుకుపోయి
కలతలేని మనసు మిగలాలని!
కొన్నిసార్లు ఇలా... కొన్నిసార్లు అలా...
ఇదే కదా మనసు చేసే గారడీ!
మనసన్నది మాయల మలుపుల బాట,
మార్పులే దాని నిత్య జీవితపాట!

- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

ఓటు తుడిచివేతపై విపక్షాల ఆగ్రహం

ఓటరు జాబితా అనేది కేవలం కాగితంపై ముద్రితమైన పేర్ల నిశ్చేతన సంకలనం కాదు. అది ప్రజాస్వామ్య మహాసౌధానికి ప్రాణాధారమైన పౌర సార్వభౌమత్వ పత్రం. స్వతంత్ర భారతంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగం ప్రసాదించిన పరమ పవిత్రమైన గళం-ఓటు హక్కు. అటువంటి ప్రాథమిక హక్కును ప్రభావితం చేసేలా భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (స్పెషల్ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) ప్రక్రియ ఇప్పుడు దేశ రాజకీయ యవనికపై తీవ్రమైన ఘర్షణకు, ప్రతిష్టంభనకు కారణమైంది. ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన అట్టడుగు వర్గాల ఓట్లను భారీగా తొలగిస్తున్నారంటూ విపక్ష ఇండియా కూటమి భగ్గుమంటుంటే, నకిలీ నమోదులను, మరణించినవారి పేర్లను తొలగించి జాబితాలను పారదర్శకంగా మార్చే విధినిర్వహణే ఇదని కేంద్ర ఎన్నికల సంఘం సమర్థించుకుంటోంది. ఈ పరస్పర విరుద్ధ వాదనల నడుమ రాజకీయ సమరం వీధుల నుంచి రాజ్యాంగ అధినేత్రి నిలయమైన రాష్ట్రపతి భవన్ ముంగిటకు చేరింది.

ఈ సంక్షోభం ఒక్కసారిగా ఉద్భవించింది కాదు. దీని వెనుక అనేక పరిణామాలు, వివాదాస్పద నిర్ణయాలు దాగి ఉన్నాయి. ముఖ్యంగా సెప్టెంబరు 25న వెలువడిన పరిశోధనాత్మక కథనాలు, కమిషన్ అంతర్గత వ్యవహారాలపై వచ్చిన కథనాలు విపక్షాల్లో తీవ్ర అలజడిని రేపాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది పేదలు, వలస కార్మికులు, నిమ్న వర్గాల ప్రజలు, చిరునామాలు మారిన సామాన్యుల పేర్లు నిబంధనల సాకుతో ఓటరు జాబితాల నుంచి గల్లంతవుతున్నాయని విపక్షాలు వాదిస్తున్నాయి. దీనికితోడు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వైఖరి నిష్పాక్షికంగా లేదంటూ ఆయన తక్షణమే రాజీనామా చేయాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా సెప్టెంబరు 30న ప్రతిపక్ష పార్టీలు సమాలోచనలు జరిపి, అక్టోబరు 2న గాంధీ జయంతి మొదలుకొని అక్టోబరు 8 వరకు దేశవ్యాప్త సేవ్ డెమోక్రసీ నిరసనలకు పిలుపునిచ్చాయి.

ఈ పోరాట క్రమంలో దేశ రాజధాని ఢిల్లీ వీధులు అట్టుడికిపోయాయి. అక్టోబరు 6న పార్లమెంటు ప్రాంగణం నుంచి నిర్వాచన్ సదన్ (ఎన్నికల సంఘ ప్రధాన కార్యాలయం) వైపు వందలాది మంది విపక్ష ఎంపీలు శాంతియుతంగా తలపెట్టిన మార్చ్‌ను ఢిల్లీ పోలీసులు దారిలోనే అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఆకాశవాణి భవన్ వద్ద ఎంపీలు బైఠాయించి సుదీర్ఘ నిరసన చేపట్టారు. అక్టోబరు 7న జంతర్ మంతర్ సమీపంలో ఆందోళనకు దిగిన ఇండియా కూటమి అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రాలతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని నిర్బంధించారు.

దేశ వాణిజ్య రాజధాని ముంబైతో పాటు పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో పౌరసమాజం, ప్రజాసంఘాలు, విద్యార్థి లోకం పెద్దయెత్తున రోడ్లపైకి వచ్చి ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రశ్నించాయి. అక్టోబరు 8న దేశవ్యాప్తంగా కాంగ్రెస్, మిత్రపక్షాలు అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేశాయి.

వీధి పోరాటాల అనంతరం ఇండియా కూటమి తమ కార్యాచరణను రాజ్యాంగబద్ధ మార్గాల వైపు మళ్లించింది. భారత ప్రథమ పౌరులు, రాజ్యాంగ పరిరక్షకురాలైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఎన్నికల సంఘం ఏకపక్ష వైఖరిని, ఎస్ఐఆర్ లోపాలను వివరించేందుకు సమయం కోరింది. దాదాపు పది మంది కీలక నేతలతో కూడిన ప్రతినిధి బృందం శుక్రవారం నాడు రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం సమర్పించేందుకు సిద్ధమైంది. గతంలో సీపీఎం రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ పంపిన లేఖపై స్పందించిన రాష్ట్రపతి భవన్, ఆ అంశాన్ని పరిశీలించాలని కేంద్ర న్యాయ, శాసన వ్యవహారాల శాఖకు పంపిన ఉదంతాన్ని ప్రతిపక్షాలు తమ నైతిక విజయంగా ప్రస్తావిస్తున్నాయి. అయితే, భారత రాజ్యాంగంలోని అధికరణ 324 ప్రకారం ఎన్నికల సంఘం ఒక స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థ. సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే విధంగానే పార్లమెంటు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీతో మహాభియోగ తీర్మానం ఆమోదం పొందితే తప్ప సీఈసీని పదవి నుంచితప్పించడం సాధ్యం కాదు. కాబట్టి రాష్ట్రపతితో జరిగే ఈ భేటీ పరిపాలనాపరంగా తక్షణ నిర్ణయాలకు దారితీయకపోయినా, నైతికంగా అధికార పక్షంపై, ఎన్నికల సంఘంపై తీవ్రమైన ఒత్తిడిని పెంచే రాజకీయ అస్త్రంగా మారుతుందనడంలో సందేహం లేదు.

ఓటరు జాబితా సమగ్ర సవరణ అనేది ఒక నిరంతర అవసరమే కావచ్చు. ఒకే వ్యక్తి పలు ప్రాంతాల్లో ఓటు కలిగి ఉండటం, చనిపోయినవారి పేర్లు తొలగించకపోవడం ప్రజాస్వామ్య ఎన్నికల విశ్వసనీయతను దెబ్బతీస్తాయి. కానీ, ఆ ప్రక్షాళన నెపంతో సహజ న్యాయ సూత్రాలకు తిలోదకాలు ఇవ్వడం అత్యంత ప్రమాదకరం.

ఓటరు జాబితా నుంచి ఒక పేరును తొలగించే ముందు సదరు పౌరుడికి ముందస్తు సమాచారం ఇవ్వడం, వివరణ కోరడం, అభ్యంతరాలను నివృత్తి చేసేందుకు నిర్ణీత గడువు కల్పించడం చట్టబద్ధమైన బాధ్యత. సాంకేతిక లోపాలతోనో, క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యంతోనో ఒక అర్హుడైన పేదవాడి పేరు గల్లంతైతే, ఆ పౌరుడు తన ప్రజాస్వామిక అస్తిత్వాన్ని, పాలకులను ఎన్నుకునే హక్కును కోల్పోతాడు. విపక్షాలు లేవెత్తుతున్న మౌలిక ఆందోళన ఇదే. అధికార పక్షం, ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను కేవలం రాజకీయ ప్రేరేపితమైనవిగా కొట్టిపారేయకుండా, తొలగించిన ప్రతి ఓటుకు సంబంధించిన వివరాలను, కారణాలను పబ్లిక్ డొమైన్లో ఉంచి పారదర్శకతను నిరూపించుకోవాలి.

ఈ సంక్షోభం కేవలం అధికార, విపక్షాల మధ్య సాగే తాత్కాలిక రాజకీయ ఆధిపత్య పోరు కాదు.ఇది రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్రతకు, స్వయంప్రతిపత్తికి ఎదురైన కఠిన పరీక్ష. ఒక ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల నిర్వహణ సంస్థ నిస్సందేహంగా, నిష్పాక్షికంగా, ఎలాంటి బాహ్య ఒత్తిళ్లకు తలొగ్గకుండా వ్యవహరిస్తుందన్న ప్రజల ప్రగాఢ విశ్వాసమే ఆ దేశానికి అసలైన రక్షాకవచం. అదే సమయంలో, విపక్షాలు కూడా ప్రజాస్వామ్య నిరసనల పేరుతో సామాన్య ప్రజల దైనందిన జీవనానికి, రవాణా వ్యవస్థకు విఘాతం కలగకుండా నిగ్రహం పాటించాలి.

ఆరోపణలను అర్థరహిత నినాదాలుగా మార్చకుండా నిక్కచ్చిగా గణాంకాలతో, ఆధారాలతో రుజువు చేయాలి. పార్లమెంటరీ చర్చలు, న్యాయ సమీక్ష, రాజ్యాంగ వేదికలే సమస్య పరిష్కారానికి నిజమైన రాచమార్గాలు. ప్రజాస్వామ్య వేదికపై పౌరుడే నిజమైన సార్వభౌముడు. ప్రతి అర్హుడైన పౌరుని ఓటు హక్కు భద్రంగా ఉన్నప్పుడే, ఆ పౌర సార్వభౌమత్వం విలువలు మరింత అఖండంగా నిలదొక్కుకుంటాయి..

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ఆకలి లేని రేపటి కోసం...సంరక్షణే మార్గం

మానవ మనుగడకు అత్యంత ప్రాథమికమైనది ఆహారం. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అని మన ప్రాచీన సంస్కృతి చాటి చెప్పినట్లుగానే, జీవకోటి శ్వాసించాలన్నా, సమాజం పురోగమించాలన్నా ఆహార భద్రతే మూలాధారం. ప్రపంచ వ్యాప్తంగా ఆహార భద్రత ప్రాముఖ్యతను వివరిస్తూ, ఆకలి, పోషకాహార లోపం వంటి సమస్యలపై చైతన్యం నింపేందుకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 16న 'ప్రపంచ ఆహార దినోత్సవం' జరుపు కుంటాము. 1945లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆహార మరియు వ్యవసాయ సంస్థ' (FAO) స్థాపన దినోత్సవానికి గుర్తుగా ఈ రోజును నిర్వహిస్తున్నారు.

నేటి ఆధునిక యుగంలో శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంతో పురోగమించినప్పటికీ, ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఆకలి నిర్మూలన. ఒకవైపు మితిమీరిన ఆహార వృథా, మరోవైపు పూట గడవని దారిద్ర్యం. గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ప్రతి రోజూ ఆకలితో నిద్రపోతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు పోషకాహార లోపంతో అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇది కేవలం ఒక వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు. దేశ సమగ్ర అభివృద్ధిని, మానవ వనరుల ఉత్పాదకతను తీవ్రంగా దెబ్బ తీసే సామాజిక విపత్తు.

నేడు ఆహార ఉత్పత్తి మరియు పంపిణీ వ్యవస్థలు అనేక తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న అకాల వర్షాలు, కరువులు మరియు తుఫానులు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. దీనికి తోడు నేల సారహీనత, భూగర్భ జలాలు అడుగంటిపోవడం మరియు యుద్ధాలు-భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల ఆహార ధాన్యాల సరఫరా వ్యవస్థలు చిన్నభిన్నమవుతున్నాయి. మరోవైపు, ఉత్పత్తి అయిన ఆహారంలో దాదాపు మూడో వంతు నిల్వ సదుపాయాలు లేకపోవడం వల్ల, లేదా వినియోగదారుల అజాగ్రత్త వల్ల వృథా అయిపోతోంది.

ఆకలి రహిత ప్రపంచాన్ని నిర్మించాలంటే మనకు ఆహారాన్ని అందించే 'రైతు' సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే వంగడాలను ప్రాచుర్యంలోకి తీసుకురావడం, సేంద్రీయ మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం నేటి తక్షణ అవసరం. చుక్క నీటినీ వృథా చేయకుండా బిందు మరియు తుంపర సేద్యం వంటి ఆధునిక నీటి యాజమాన్య పద్ధతులను అవలంబించాలి. అలాగే, సాంకేతికతను ఉపయోగించి పంట దిగుబడులను పెంచుతూనే, నేల కాలుష్యాన్ని అరికట్టే దిశగా అడుగులు వేయాలి.

ఆకలి నిర్మూలన అనేది కేవలం ప్రభుత్వాలు లేదా స్వచ్ఛంద సంస్థల బాధ్యత మాత్రమే కాదు; అది ప్రతి పౌరుడి బాధ్యత. ఆహారాన్ని వృథా చేయకపోవడం మనం ఇంట్లోనే ప్రారంభించగల మొదటి మార్పు. ఇంట్లో, వేడుకలలో లేదా హోటళ్లలో అవసరమైనంత మాత్రమే ఆహారాన్ని సిద్ధం చేసుకోవాలి. ప్రపంచీకరణ యుగంలో కూడా ఆహార ధాన్యాల పంపిణీలో అసమానతలు తీవ్రంగా ఉన్నాయి. యుద్ధాలు, అంతర్జాతీయ వాణిజ్య ఆంక్షలు మరియు ద్రవ్యోల్బణం కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆహార ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

మానవ మనుగడకు, నైతిక పురోగతికి ఆహార భద్రతే ప్రధాన పునాది. నేటి ఆధునిక యుగంలో ఆహార లభ్యత అనేది కేవలం ఎంత విస్తీర్ణంలో

పంటలు పండిస్తున్నామనే దానిపైనే కాకుండా, ఆ ఆహారాన్ని ప్రజలందరికీ సమానంగా అందించే ఆర్థిక, విధానపరమైన మార్గాలపై కూడా ఆధారపడి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకూ పెరుగుతున్న జనాభా, మారుతున్న జీవన శైలి మరియు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య ఆహార భద్రతను సాధించాలంటే సాంకేతిక, పర్యావరణ, మరియు పాలనా రంగాలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉంది.

అత్యంత ప్రధానమైన అడ్డంకి పంపిణీలోని అసమానతలు. ప్రపంచంలో ఒకవైపు విస్తారమైన ఆహార ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ, సరఫరా వ్యవస్థల వైఫల్యం,యుద్ధాలు మరియు ఆర్థిక ద్రవ్యోల్బణం వల్ల కోట్లాది మంది ప్రజలు సరైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. ధనిక సమాజాలలో ఆహారం అధికంగా వృథా అవుతుంటే, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కొనుగోలు శక్తి లేక లక్షలాది కుటుంబాలు పోషకాహార లోపంతో అలమటిస్తున్నాయి. ఇది కేవలం వ్యవసాయ రంగానికి సంబంధించిన లోపం కాదు; ఇది అంతర్జాతీయ ఆర్థిక అసమానతల ప్రతిరూపం.

పర్యావరణ కోణంలో చూస్తే, మన ఆహార ఉత్పత్తి వ్యవస్థలు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నాయి. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలలో వ్యవసాయం, పశుపోషణ మరియు ఆహార రవాణా రంగాలు గణనీయమైన వాటాను కలిగి ఉన్నాయి. రసాయనాల మితిమీరిన వినియోగం వల్ల నేల సారం క్షీణించి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. అధిక దిగుబడినిచ్చే కొన్ని నిర్దిష్ట రకాల పంటలపైనే శ్రద్ధ చూపడం వల్ల సంప్రదాయ, స్థానిక పంటలు కనుమరుగై జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతోంది.

ఈ సవాళ్లను అధిగమించడంలో అగ్రిటెక్ విప్లవం కొత్త ఆశలను చిగురింపజేస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్లు మరియు సెన్సార్ల సహాయంతో పచ్చిక సేద్యం చేసి నీరు, ఎరువుల వృథాను అరికట్టవచ్చు. కోల్ స్టోరేజీల విస్తరణ మరియు సరుకు రవాణాలో సమర్థవంతమైన మార్పులు తీసుకురావడం ద్వారా పంటకోత అనంతర నష్టాలను, మార్గ మధ్యంలో జరిగే వృథాను అట్టడుగు స్థాయికి తగ్గించవచ్చు.

వివిధ దేశాలు తమ భౌగోళిక వాతావరణం, సాంకేతిక పురోగతి మరియు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా వైవిధ్యమైన ఆహార విధానాలను అవలంబిస్తున్నాయి. అమెరికా, నెదర్లాండ్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు అగ్రిటెక్, ప్రిసిషన్ ఫార్మింగ్ మరియు నిరంతర ఆవిష్కరణలపై దృష్టి సారిస్తున్నాయి. భూమి వైశాల్యం తక్కువగా ఉన్నప్పటికీ నెదర్లాండ్స్ గ్రీన్‌హౌస్ టెక్నాలజీ, వర్టికల్ ఫార్మింగ్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఆహార ఎగుమతుల్లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచింది. యూరోపియన్ యూనియన్ దేశాలు రసాయనాల వాడకాన్ని తగ్గించి, సుస్థిర పర్యావరణ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తుంటే, సింగపూర్ వంటి దేశాలు స్థానిక ఆహార లభ్యతను పెంచేందుకు ఇండోర్ ఫార్మింగ్ మరియు వర్టికల్ ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహిస్తున్నాయి. ఆఫ్రికన్, ఆసియా దేశాలు సామాజిక భద్రత, ధరల స్థిరీకరణ మరియు చిన్న తరహా రైతుల మద్దతు కేంద్రంగా ఆహార విధానాలను రూపొందిస్తున్నాయి. భారతదేశంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార భద్రతా చట్టం (NFSA) ద్వారా ఉచిత లేదా చవకైన ఆహార ధాన్యాల పంపిణీ, కనీస మద్దతు ధర మరియు ప్రజా పంపిణీ వ్యవస్థల పై ఆధారపడుతుంటే, బ్రెజిల్ వంటి దేశాలు 'జీరో హంగర్' కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు ప్రత్యక్ష నగదు బదిలీ మరియు ఉచిత బడి భోజనాన్ని అనుసంధానించాయి. ఆఫ్రికన్ దేశాలు 'క్లైమేట్-స్మార్ట్ అగ్రికల్చర్' ద్వారా కరువును తట్టుకునే విత్తనాలు నీటి సంరక్షణ పద్ధతులను అమలు చేస్తూ ఆహార భద్రతను సాధించేందుకు కృషి చేస్తున్నాయి.

ఎవరినీ వెనుకబడిపోనివ్వవద్దు అనే సంకల్పంతో ముందడుగు వేసినప్పుడే ప్రపంచ ఆహార దినోత్సవానికి నిజమైన సార్థకత చేకూరుతుంది. ఆహారం అనేది మానవ హక్కు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహారం అందుబాటులో ఉన్నప్పుడే సుస్థిర అభివృద్ధి సాధించబడుతుంది. కాబట్టి, ఆహారాన్ని గౌరవిద్దాం, వృథాను అరికడదాం, ఆకలి లేని ఆనందమయ ప్రపంచాన్ని నిర్మించడంలో మనవంతు పాత్ర పోషిద్దాం!

అక్టోబర్ 16 ప్రపంచ ఆహార దినోత్సవం
- సుధాకర్.ఏ.వి
9000674747

మళ్ళీ రాజుకొంటోంది..

నిజం నిప్పై మళ్ళీ రాజకుంటోంది..!
నినాదాల హోరెత్తిన పాతబాట కొత్త కవాతుతో
దేశం దశ దిశ దిద్దబోతోంది
ప్లకార్డు మారినా పరంపర కొనసాగుతోంది
గుండెకాయ లాంటి ఎన్నికల వ్యవస్థ
మరమ్మత్తుకి నడుం కట్టిన
అసమాన యువపోరాటకెరటం
అరెస్టులు ఆంక్షలు తట్టుకొని
బ్యారికేడ్లు అడ్డుగోడలు చీల్చుకొని
ఆకాశమంత ఎత్తు ఎగిసిపడుతోంది..!
ఆయువు వాయువు ఓటు హక్కు!
ఆ హక్కుని తొక్కేస్తోన్న రాజ్యం దౌర్జన్యాన్ని
రాజ్యాంగస్ఫూర్తితో ప్రశ్నించేందుకు ప్రభవించిన
కుల మత లింగ భేదం లేని నవయుగం
పరిధి దాటని నదిలా పరవళ్లు తొక్కుతోంది..!
నాడు విచ్ఛిన్న వెలుగురేకలు వాడిపోకుండా
రాత్రీ పగలు అలుపు లేని నినాదకెరటాలతో
యువతరంగం పెనునిద్దర వదిలించేందుకు
దేశ హృదయతీరాన్ని తట్టి లేపుతూనే వుంది!
నిజాన్ని, సామాన్యుడ్ని గెలిపించేందుకు
నడుం కట్టిన మువ్వన్నెల జెండాలిప్పుడు
మరో స్వతంత్రపోరాటాన్ని భుజాన మోస్తూ
కాంతులు చిమ్ముతున్నాయ్
రాజ్యం రక్కసి చేతుల్లో..
దారం తెగిన పతంగిలా చిక్కిన ప్రజాస్వామ్యాన్ని
నిలువెల్లా విడిపించేందుకు
ఈ నిత్య పోరాటజ్యోతి వెలుగుతూనే ఉండాలి!

- భీమవరపు పురుషోత్తమ్
9949800253

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

మారుతున్న బతుకమ్మ పండుగ స్వరూపం..

తెలంగాణ నేల ప్రకృతిని సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపంగా దర్శించి, పూలనే దేవతలుగా కొలిచే అపురూప సాంస్కృతిక జీవన సౌందర్యం బతుకమ్మ పండుగ. స్త్రీత్వంలోని నైసర్గిక సృజనాత్మకతను, శ్రమజీవుల వేదనను, కుటుంబ అనుబంధాల మాధుర్యాన్ని, సమాజ సమష్టి చైతన్యాన్ని ఏకసూత్రంతో బంధించే అరుదైన సాంస్కృతిక మహోత్సవమిది. తీరొక్క పూలను గోపురంలా పేర్చి గౌరమ్మను కొలవడం, లయాత్మక చప్పట్ల తాళాల నడుమ గొంతు కలిపి బతుకు గాథలను ఆలపించడం, మాతృభూమి ఒడిలో ఆత్మీయతలను నెమరువేసుకోవడమే ఈ మహాపర్వపు మౌలిక అంతరార్థం. కాలగమనంలో చోటు చేసుకున్న పెనుమార్పులు, వినియోగ సంస్కృతిని పెంచిన కృత్రిమ జాడ్యాలు, ఆడంబరాల వెనుక పరుగెత్తే యాంత్రిక జీవనం వల్ల ఈ వేడుకలోని సనాతన సంప్రదాయాలు క్రమంగా తెరమరుగవుతున్నాయి. తెలంగాణ సమాజంలో నేడు చోటు చేసుకుంటున్న మార్పులను నిశితంగా పరిశీలిస్తే, సాంస్కృతిక అస్తిత్వ పరిరక్షణ ఎంతటి పెను సవాలుగా మారిందో స్పష్టమవుతోంది. పండుగలో మార్పులు రావడం కాలక్రమంలో సహజ పరిణామమే అయినా, దాని జీవధార అయిన అంతరంగిక ఆత్మను, పర్యావరణ స్పృహను కోల్పోవడం సమాజ మనుగడకే తీరని నష్టం.

శరదృతువు ఆరంభాన శరన్నవరాత్రుల వేళ, భాద్రపద బహుళ మహాలయ అమావాస్య నాటి 'ఎంగిలిపూల బతుకమ్మ'తో మొదలై ఆశ్వయుజ శుద్ధ దుర్గాష్టమి నాటి 'సద్దుల బతుకమ్మ' వరకు తొమ్మిది రోజుల పాటు సాగే ఈ ఉత్సవ శోభ వర్ణనా తీతం. ఉపాధి కోసం దూరతీరాలకు, మహానగరాలకు, గల్ఫ్ దేశాలకు వలసవెళ్లిన బిడ్డలంతా తమ మూలాలను వెతుక్కుంటూ సొంత గూటికి చేరే పవిత్ర వారధి ఈ పండుగ. అత్తవారింట్లో ఉన్న ఆడబిడ్డలు పుట్టింటికి చేరి, బాల్యస్మృతులను నెమరువేసుకుంటూ తోబుట్టువులతో గడిపే అపురూప వేళ ఇది. తెలంగాణలోని బీడు భూములైనా, చేలగట్లు, చెరువుల పరిసరాలు, గుట్టల వెంబడి పల్లెజనం స్వయంగా నడచి వెళ్లి పూలను సేకరించేవారు. 'గునుగూ పూచే గుబురుల నిండా.. తంగేడు పూచే తరగల నిండా' అంటూ పాడుకుంటూ పసుపు వర్ణపు తంగేడు, తెల్లని గునుగు, కాట్లకుక్క, గుమ్మడి, రుద్రాక్ష, సీతమ్మ జడలు, కట్లపూలు, బంతి, చేమంతులను కోసుకొచ్చేవారు. ఈ పూల సేకరణ కేవలం ఒక ఆచారం కాదు. ఏ పువ్వుకు ఎలాంటి ఔషధ గుణముందో, తంగేడులోని క్రిమినాశక శక్తి ఏమిటో, గుమ్మడి పువ్వుతో గౌరమ్మను ఎందుకు అర్చించాలో పెద్దలు చెబుతుంటే పిల్లలు ఆ జీవవైవిధ్య విజ్ఞానాన్ని సహజంగానే ఒంటబట్టించుకునేవారు. మోదుగాకులు, ఇస్తరాకులు, ఇత్తడి తాంబాలాలపై గుండ్రటి వలయాలుగా, ప్రకృతి వర్ణమాలలా పూలను వరుసలవారీగా శిఖరంలా అమర్చడంలో మహిళల విశిష్ట కళా నైపుణ్యం ప్రతిఫలించేది.

ఈ తొమ్మిది రోజుల మహోత్సవంలో రోజుకొక విశిష్ట నైవేద్య సమర్పణ పవిత్ర ఆచారంగా నిలిచింది. వర్షాకాలం ముగిసి శీతాకాలం మొదలయ్యే సంధి కాలంలో వాతావరణ మార్పుల వల్ల సంక్రమించే రుగ్మతలను హరించే అద్భుత ఆయుర్వేద పోషకాహారాలు. ఇరుగు పొరుగుతో ఈ సద్దులను పంచు కోవడం వల్ల సమాజంలో హెచ్చుతగ్గులు సమసి పోయి, సమష్టి జీవన సౌభాగ్యం వెల్లివిరిసేది. సాయం సంధ్యా వేళల్లో పట్టువస్త్రాలు ధరించిన మహిళలు నెత్తిమీద బతుకమ్మలను ఎత్తుకొని చెరువు కట్టలు, ఊరి రచ్చబండలు, గోదావరి వంటి పుణ్యనదీ తీరాలకు బారులుతీరి వెళ్లే దృశ్యం కనులవిందు చేసేది. ఆలయప్రాంగణాల్లో వందలాది బతుకమ్మలను మధ్యలో ఉంచి, వాటి చుట్టూ స్త్రీలు లయాత్మక వలయాలుగా తిరుగుతూ 'శ్రీలక్ష్మి నీ మహిమలు గౌరమ్మ.. చిత్రమై తోచునమ్మా గౌరమ్మ', 'ఒక్కేసి పువ్వేసి చందమామా..ఒక్క జాము ఆయె చందమామా','చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ' అంటూ గొంతు కలిపి ఆలపించేవారు. ఆ జానపద గేయాల్లో రామాయణ, భారతాల పౌరాణిక ఘట్టాలతో పాటు, అత్తాకోడళ్ల అలకలు, పుట్టింటి తీపి జ్ఞాపకాలు, శ్రామిక స్త్రీల కష్టసుఖాలు, తెలంగాణ ప్రజా జీవన తాత్వికత ప్రతిధ్వనించేవి. రాతకోతల్లో భద్రపరచని ఈ అమూల్యమైన మౌఖిక సాహిత్యం తరం నుంచి తరానికి అలవోకగా సంక్రమించేది. పూజల అనంతరం మహిళలు పసుపు గౌరమ్మను భక్తితో నుదుట దిద్దుకుని, బతుకమ్మలను నిదానంగా జలాల్లో నిమజ్జనం చేసేవారు. ప్రకృతిని ఆరాధించి, తిరిగి ఆ ప్రకృతికే స్వచ్ఛతను చేకూర్చే పరమ పవిత్ర పర్యావరణ చక్రమిది.

కానీ గత రెండు దశాబ్దాలుగా తీవ్ర వినియోగ తత్వం ప్రబలి, పండుగ నిర్వహణలో విపరీతమైన మార్పులు వచ్చాయి. సహజ పూల బతుకమ్మలకు బదులు ప్లాస్టిక్ బతుకమ్మలు ఊరూవాడా ప్రవేశించాయి. కొందరు నిమజ్జనం పేరిట జలవనరుల వద్దకు వెళ్లి, కేవలం ఆచారంగా నీటిని తాకించి ఆ ప్లాస్టిక్ బతుకమ్మను మళ్లీ ఇంటికి తెచ్చి అటకపై భద్రపరుచు కుంటున్నారు. దీనివల్ల పూలను పేర్చే సృజనాత్మకత, మట్టితోనూ చెట్లతోనూ ముడిపడిన భావోద్వేగ అనుబంధం పూర్తిగా నిర్వీర్యమైపోతున్నాయి.

మరీ ముఖ్యంగా, తరతరాల బతుకమ్మ పాటల స్థానాన్ని విపరీతమైన డీజేల హోరు, కర్ణకఠోర సౌండ్ సిస్టమ్స్ ఆక్రమించాయి. దీనికితోడు రసాయన రంగులు అద్దిన ప్లాస్టిక్ పూలు, థర్మాకోల్ వ్యర్థాలను నీటిలో పార వేయడం వల్ల పవిత్ర జలవనరులు విషతుల్యమై, జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

ఈ సాంస్కృతిక సంక్షోభాన్ని అధిగమించాలంటే కేవలం ఆవేదన వ్యక్తం చేస్తే సరిపోదు. విస్తృత సామాజిక సంకల్పం, సమగ్ర కార్యాచరణ తక్షణావసరం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు ప్రాచీన బతుకమ్మ పాటల సాహిత్యం, వాటి అంతరార్థంపై ప్రత

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, అక్టోబర్ 15 (మనం ప్రతినిధి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

గురువారం ధర్మపురిలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్తో కలిసి నూతన ఆరోగ్య ఉప కేంద్రం, చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్, తాగునీటి పైపులైన్లను మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ

పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యం అందని పరిస్థితి ఉండకూడదనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తోందన్నారు. వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లే అవసరాన్ని తగ్గించి, ప్రాథమిక వైద్య సేవలను గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు.

ధర్మపురిలో నూతన ఆరోగ్య ఉప కేంద్రం అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలకు ప్రాథమిక చికిత్సలు, ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. మహిళలు, గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించేందుకు ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

పిల్లల ఎదుగుదలకు పార్కులు.. ప్రజల ఆరోగ్యానికి ఓపెన్ జిమ్లు

పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు చిల్డ్రన్ పార్కులు దోహదపడతాయని మంత్రి తెలిపారు. పిల్లలు ఆటపాటలతో ఆనందంగా గడిపేందుకు, ఆరోగ్యకరమైన వాతావరణంలో ఎదిగేందుకు పార్కులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పార్కులు, ఓపెన్ జిమ్లను పరిశుభ్రంగా, సురక్షితంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ప్రజలు నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, యువతతో పాటు అన్ని వయస్సుల వారు ఓపెన్ జిమ్లను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ

ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి స్పష్టం చేశారు. తాగునీటి పైపులైన్ల ప్రారంభంతో స్థానికంగా నీటి సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు. సరఫరాలో అంతరాయాలు లేకుండా, పైపులైన్ల నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ

ధర్మపురిలో నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఆరోగ్య ఉప కేంద్రం, చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్, తాగునీటి పైపులైన్ల ద్వారా ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుతాయని తెలిపారు. ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్య సేవలు సకాలంలో అందేలా సిబ్బంది విధులు నిర్వహించాలని, గ్రామస్థులకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పార్క్, ఓపెన్ జిమ్లను పరిశుభ్రంగా నిర్వహించడంతో పాటు, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీఎంహెచ్ఓ సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మండల తహసీల్దార్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

మంథని, అక్టోబర్15(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని,బతుకమ్మ నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ తమ్మ చెరువు కట్ట పరిసరా ప్రాంతలను పరిశీలించారు.అదేవిధంగా దసరా పండుగ సందర్భంగా జమ్మి చెట్టు గద్దె ప్రదేశమును,ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను కూడా ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి,పాలకవర్గ సభ్యులు ఎల్లంకి వంశీధర్,నాయకులు జంబోజు సమ్మయ్యతో కలిసి బతుకమ్మ నిమజ్జన స్థలాన్ని,పరిసర ప్రాంతాలను సందర్శించి,భక్తులకు అవసరమైన సౌకర్యాలు, చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ,బతుకమ్మ నిమజ్జనానికి వచ్చే మహిళలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేపడతామని తెలిపారు.నిమజ్జన ప్రదేశంలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య చర్యలు చేపడతామని పేర్కొన్నారు.తమ్మ చెరువు కట్ట పరిసరాల్లో అవసరమైన సుందరీకరణ పనులు చేపట్టి,పండుగను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకునేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.అలాగే దసరా పండుగ సందర్భంగా ప్రజలు సంప్రదాయబద్ధంగా జమ్మి పూజలు నిర్వహించుకునేందుకు వీలుగా జమ్మి చెట్టు గద్దె ప్రదేశాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా ప్రాంతాల్లో పరిశుభ్రత,ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి,పనుల పురోగతిని సమీక్షించారు.నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా,నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బతుకమ్మ,దసరా పండుగలను మంథని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో,భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరుపుకునేలా మున్సిపాలిటీ తరపున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడతామని చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల సహకారం,భగవంతుని కృపతో నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

జగిత్యాల అక్టోబర్ 15(మనం న్యూస్): జగిత్యాల పట్టణంలో శ్రీ దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శ్రీ దుర్గా గాయత్రి సేవా సమితి ఆధ్వర్యం లో గాయత్రి మాత ఆలయం లో,మహా దుర్గా సేవా సమితి ఆధ్వర్యం లో, జయ దుర్గా సేవా సమితి ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలకు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

జగిత్యాల నియోజకవర్గంలో భగవంతుని కృపతో, ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.

ఎల్నినో ప్రభావం ఉన్నప్పటికీ సమృద్ధిగా వర్షాలు కురవడంతో ప్రస్తుతం పంటలు చేతికి వచ్చే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఎల్నినో తీవ్రత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు.

భగవంతుని కృపతో రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారి సమృద్ధిగా వర్షాలు కురవాలని, ఎండ తీవ్రత తగ్గి డిసెంబర్ వరకు చల్లటి వాతావరణం కొనసాగాలని ఆకాంక్షించారు.

జగిత్యాల నియోజకవర్గంలోని అన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేయించి, ఆలయాల అభివృద్ధికి కృషి చేయటం జరిగింది అని తెలిపారు. కులమత బేధాలు లేకుండా అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.

వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం

ఎఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి పాక్స్ చైర్మెన్ కొలుగూరి దామోదర్ రావు కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, సమిండ్ల శ్రీనివాస్ అడువాల లక్ష్మణ్ , కౌన్సిలర్ లు చెట్టే గంగాధర్ దయల చంద్రకళ శంకర్ అరవ లక్ష్మీ రాజు ,చీటి లక్ష్మీనారాయణ,బాల ముకుందం , నక్కల రవీందర్ రెడ్డి,నాయకులు శరత్ రావు, గంగాధర్, సుశీల్, జిల్లా యూత్ ఉప అధ్యక్షులు సాయి, భార్గవ్,అక్షయ్ లు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలి

రిపోర్టర్లపై థర్డ్ డిగ్రీని ఖండించిన జర్నలిస్ట్ నేత ఎన్నం కిషన్ రెడ్డి

ఎస్ఐ పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

జగిత్యాల, అక్టోబర్ 15 (మనం న్యూస్): వివిధ వర్గాలకు, సంస్థలను రక్షించడానికి ఉన్నటువంటి రక్షణ చట్టాలను జర్నలిస్టులకు సైతం వర్తింపజేయాలనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జర్నలిస్ట్ నాయకులు ఇడిమాండ్ చేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ ఇద్దరు రిపోర్టర్లు శేఖర్, సంపత్ లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి డబ్ల్యూ జే ఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

పోలీసుల అధికార దుర్వినియోగం, లంచాల వసూళ్లపై వార్తలు రాసినందుకే కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దారుణమని ఆయన పేర్కొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ, ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభంగా ఉన్న విలేకరుల పట్ల సదరు ఎస్ఐ వ్యవహరించిన తీరు క్షమించరానిదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేవలం ఎస్ఐని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయడం పరిష్కారం కాదని, పోలీసు ఉన్నతాధికారులు ఈ ఘటనపై లోతైన విచారణ జరిపి, బాధ్యుడైన ఎస్ఐపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కిషన్ రెడ్డి కోరారు.

విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణం

- మాజీ ఎమ్మెల్యే గా గండ్ర వెంకట రమణారెడ్డి

భూపాలపల్లిఅక్టోబర్ 15 మనం న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ ముందుచూపు లేని నిర్ణయాలు,విద్యుత్ ఉత్పత్తి మరియు సరఫరా వ్యవస్థపై సరైన ప్రణాళిక లేకపోవడమే ప్రధాన కారణాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి విమర్శించారు.

జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ

విద్యుత్ కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంట పొలాలు ఎండిపోతున్నాయని, మోటార్లు తిరగకపోవడం తో సాగునీటి సరఫరా నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి తగ్గడానికి ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు కారణమయ్యాయనే అంశాన్ని ప్రభుత్వం సమీక్షించాలని కోరారు.

జెన్కో, ట్రాన్స్కో, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, సింగరేణి మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గడం, ఓవర్బర్డెన్ (ఓబీ) టెండర్లలో రాజకీయ జోక్యం, అవినీతి ఆరోపణలు వంటి అంశాలు బొగ్గు సరఫరాపై ప్రభావం చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బొగ్గు సరఫరా సక్రమంగా లేకపోతే థర్మల్ విద్యుత్ ఉత్పత్తి తగ్గుతుందని, దాని ప్రభావం రాష్ట్ర విద్యుత్ వ్యవస్థపై పడుతుందని తెలిపారు. ఈ అంశాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.

గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా అందిందని, అప్పుల్లో విద్యుత్ సరఫరా విషయంలో రైతులు ఇంతటి ఇబ్బందులు ఎదుర్కోలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం మోటార్లు పనిచేయకపోవడం, ఫ్యూజులు కాలిపోవడం, ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతినడం వంటి సమస్యలతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన విద్యుత్ను పూర్తిస్థాయిలో అందించాలని కోరారు. అవసరమైతే ఇతర రంగాల్లో విద్యుత్ వినియోగాన్ని సమీక్షించి, వ్యవసాయ అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల పంటలను కాపాడటం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన బాధ్యత అని పేర్కొన్నారు

రైతుల సమస్యలు పరిష్కారం కాకపోతే, వారి పక్షాన మరోసారి ఉద్యమానికి దిగుతామని, అవసరమైతే రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ప్రజలు, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన స్పష్టం చేశారు.

వెంకటాపూర్ సబ్ స్టేషన్లో 8 ఎంవీఏ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభం

మంథని,అక్టోబర్15(మనం న్యూస్): మంథని డివిజన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్లో 5 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్ఫార్మర్ను 8 ఎంవీఏకు పెంచి గురువారం విజయవంతంగా ఛార్జింగ్ చేసినట్లు మంథని డీఈ వి.ప్రభాకర్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ మంథని సబ్డివిజన్, ఏక్లాస్పూర్ ఆపరేషన్ సెక్షన్ పరిధిలోకి వస్తుంది.పెరిగిన విద్యుత్ లోడ్కు అనుగుణంగా ట్రాన్స్ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పరిసర ప్రాంతాల వినియోగదారులకు మెరుగైన,నాణ్యమైన,నమ్మకమైన విద్యుత్ సరఫరాఅందించడంతో పాటు ఓవర్లోడ్ సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏడీఈ ఆపరేషన్,మంథని,ఏడీ ట్రాన్స్ఫార్మర్స పెద్దపల్లి,ఏ ఆపరేషన ఏక్లాస్పూర్,ఏఈ ట్రాన్స్ఫార్మర్స్, పెద్దపల్లి,సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

- మహిళలకు గాజులు కానుకగా అందజేత

జగిత్యాల, అక్టోబర్ 15(మనం న్యూస్): జగిత్యాల పట్టణంలోని 40వ వార్డులో బుధవారం సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అడువాల జ్యోతి లక్ష్మణ్ మహిళలకు గాజులను కానుకగా అందజేసి, వారితో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని పేర్కొంటూ, మన పండుగలు, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, కాలనీవాసులు పాల్గొని బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

ఎస్.వి మార్ట్ ఎలక్ట్రానిక్స్, సూపర్ మార్కెట్కు రూ.50 వేల జరిమానా

మంథనిఅక్టోబర్15(మనం న్యూస్) : మంథని మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ శాఖ నుంచి తప్పనిసరిగా పొందాల్సిన వ్యాపార లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న ఎస్వీ మాట్ ఎలక్ట్రానిక్స్,సూపర్ మార్కెట్ షాపుకు మున్సిపల్ శాఖ అధికారులు ఈగురువారంరూ.



50,000(యాభై వేల రూపాయలు) జరిమానా విధించారు.సదరు షాపును గత రెండు సంవత్సరాలుగా వ్యాపార లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ విషయమై పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఇప్పటివరకు లైసెన్స్ పొందకపోవడంతో ఈ రోజు రూ.50,000 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్ మాట్లాడుతూమంథని మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి వ్యాపారస్తుడు తప్పనిసరిగా మున్సిపల్ శాఖ నుంచి వ్యాపార లైసెన్స్ పొందాలని తెలిపారు.లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించే వారిపై ఫీల్ వెరిఫికేషన్ నిర్వహించి, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కాగా మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారస్తులందరూ తమ వ్యాపారాలకు అవసరమైన లైసెన్సులను తప్పనిసరిగా పొందాలని,మున్సిపల్ నిబంధనలను పాటిస్తూ వ్యాపారాలు నిర్వహించాలని కమిషనర్ మనోహర్ సూచించారు.

సర్వోత్తమరెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటేయాలి

ములుగు, అక్టోబర్ 15,మనం ప్రతినిధి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామ్రెడ్డి సర్వోత్తమరెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ కోరారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల యువత సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించే నాయకత్వం అవసరమన్నారు. ములుగు జిల్లాలో అనేకమంది యువత కష్టపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, వారికి ఉపాధి అవకాశాలు, పోటీ పరీక్షలకు ప్రోత్సాహం, ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మంత్రి సీతక్క మారుమూల ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమం, మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారని అశోక్ తెలిపారు. గ్రామీణ యువత తమ ప్రతిభను నిరూపించుకునేలా అవకాశాలు కల్పించాలన్నారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగుల ఇబ్బందులను శాసనమండలిలో బలంగా వినిపించే వ్యక్తికి మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమరెడ్డి ఉన్నత విద్యావంతుడని, తన తండ్రి దామోదరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. దామోదరరెడ్డి పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పట్టభద్రుల భవిష్యత్తు, గ్రామీణ యువత ఆకాంక్షలకు ప్రాధాన్యమిచ్చేలా సర్వోత్తమరెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పైడాకుల అశోక్ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు టైబల్ విద్యార్థులు

కాటారం, అక్టోబర్ 15 మనం న్యూస్: కాటారం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 15, 16, 17 తేదీల్లో సరూర్నగర్ హైదరాబాద్ లో జరుగుతున్న 45వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఖోఖో పోటీల్లో కాటారం పాఠశాల విద్యార్థులు వై.నిఖిల్, పి.పూర్ణచందర్, ఆర్.అరవింద్ లు పెద్దపల్లి జిల్లా తరపున పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో నిర్వహకులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పెద్దపల్లి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి లక్ష్మణ్, వేల్పుల కుమార్ తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ సోమోజీ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. పీఈటీలు మంతెన శ్రీనివాస్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా తరపున విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. క్రమశిక్షణతో, జట్టు సమన్వయంతో ఆడతారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ మాధవి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

దుర్గామాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

భూపాలపల్లిఅక్టోబర్ 15 మనం న్యూస్: భూపాలపల్లి సింగరేణి ఏరియా రెస్క్యూ,1 ఇన్క్లైన్, 6 ఇన్క్లైన్తో పాటు మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గురువారం నాడు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుందూరుపల్లి గ్రామంలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సోదరులు, సోదరీమణుల తో కలిసి ఉత్సాహంగా నృత్యం చేస్తూ వేడుకల్లో సందడి చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు,పార్టీ కార్యకర్తలు,గిరిజన ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గౌరీ దేవిగా విద్యా సరస్వతి అమ్మవారి దర్శనం

- నేడు మూల మహోత్సవం

వర్గల్, అక్టోబర్15 (మనం న్యూస్): ప్రసిద్ధ విద్యా క్షేత్రమైన వర్గల్ శ్రీ విద్యా సరస్వతి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు శ్రీ గౌరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.పార్వతీ దేవి అవతారమైన గౌరీ దేవి.. సౌభాగ్యం, ధైర్యం, శక్తికి ప్రతీక అని అర్చకులు తెలిపారు. తెల్లవారుజాము నుండే అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, చండీ పారాయణం, ప్రత్యేక పూజలునిర్వహించారు.గౌరీ అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు హైదరాబాద్, సిద్దిపేట, గజ్వేల్ తో పాటు చుట్టుపక్కల మండలాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాద్ తో పాటు అన్నప్రసాదాలను అందజేశారు. నేడు శుక్రవారం మూల నక్షత్రం పురస్కరించుకొని అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర్ శర్మ సిద్ధాంతి తెలిపారు. ఈ మూల నక్షత్ర మహోత్సవం(అమ్మవారి పుట్టినరోజు) సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో రానున్నడంతో ఆలయం వద్ద ప్రత్యేకత క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు విఐపి లకు పాసులను అందజేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు కేంద్రంగా పటాన్ చెరు

- ప్రతి విద్యార్థి దినచర్యలో క్రీడలు భాగం కావాలి
- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్ చెరులో అట్టహాసంగా ప్రారంభమైన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 బాలుర బాలికల రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు

పటాన్ చెరు, అక్టోబర్ 15 (మనం న్యూస్): పటాన్ చెరు నియోజకవర్గ కేంద్రాన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థి దైనందిన జీవితంలో క్రీడలు భాగం కావాలని, క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల అలవడతాయని పేర్కొన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నిర్వహిస్తున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలను గురువారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణితో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన 200 మందికి పైగా క్రీడాకారులు పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. హాజరైన క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. క్రీడాకారులకు అవసరమైన మైదానాలు, వసతులు, ఇతర సౌకర్యాలను కల్పిస్తూ పటాన్చెరును క్రీడ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. క్రీడలు, క్రీడాకారులకు తన సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు సైతం ఆతిథ్యం ఇవ్వబోతున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు పోలీసుల బందోబస్తు ఏదీ?

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల నిర్వహణకు తగిన పోలీసు బందోబస్తు కల్పించడంలో పటాన్ చెరు పోలీసులు ఘోరంగా విఫలమయ్యారని ఎమ్మెల్యే జిఎంఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్లు, నిర్వాహకులు హాజరయ్యే ఇలాంటి ప్రతిష్ఠాత్మక పోటీలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. క్రీడా కార్యక్రమాల పట్ల పోలీసులు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. క్రీడాకారులకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన సమయంలో బందోబస్తు విషయంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర డీజీపీతో పాటు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు హాజరైన క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను తన సొంత నిధులతో ఏర్పాటు చేయడం ద్వారా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి క్రీడల పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ నాయక్, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, పృథ్వీరాజ్, అశోక్, వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా వ్యవస్థ అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం పెరగాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రామచంద్రాపురంలో రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన

రామచంద్రాపురం, అక్టోబర్ 15(మనం న్యూస్): పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విద్యా వ్యవస్థల అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని కాశిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 32 లక్షల రూపాయల నిధులతో నిర్మించ తలపెట్టిన నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే నిధులతోపాటు పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి బాటలో ముందుకు తీసుకుని వెళుతున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరిన్ని ప్రభుత్వ విద్య సంస్థలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం మరింత పెరగాలని కోరారు. నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి రౌండ్ టేబుల్ స్వచ్ఛంద సంస్థ మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, రౌండ్ టేబుల్ ఇండియా సైబరాబాద్ వన్ చైర్మన్ ప్రశాంత్, సీనియర్ నాయకులు పరమేష్, ఐలేష్, రాజు, సంస్థ ప్రతినిధులు లక్ష్య జైన్, నిర్మల్ గుప్తా, ఆనంద సాగర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలి

- పంటల రక్షణకు రానున్న 15-20 రోజులు కీలకం
- నీటి సంరక్షణ, ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి
- సీఎస్ సంజయ్ జాజు

సంగారెడ్డి, అక్టోబర్ 15 మనం న్యూస్ ప్రతినిధి: ఎల్నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో చోటు చేసుకుంటున్న మార్పులు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రస్తుత పంటలను కాపాడేందుకు వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఎల్నినో ప్రభావంతో నీటి లభ్యత, వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గురువారం సీఎస్ సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. అనంతరం పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లో ట్రాన్స్కో సీఎండీ జితేష్ వి. పాటిల్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, నీటిపారుదల, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సింగూరు జలాశయంలో నీటిమట్టం, జిల్లాలో తాగునీటి లభ్యత, వర్షపాతం, పంటల సాగు పరిస్థితులు, తాగునీటి సరఫరాకు రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళికల గురించి సీఎస్కు వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో అవసరమైనప్పుడు నీటి రవాణా ఏర్పాట్లు చేయడంతో పాటు అవసరమైన బోర్వెల్లను హైరింగ్ చేసుకోవడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న 15-20 రోజులు పంటల రక్షణకు అత్యంత కీలకమైనందున వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితులను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. ట్రాన్స్కోర్మర్లపై అధిక విద్యుత్ భారం పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి, స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పశుగ్రాసం కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వీబీజీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులు, నీటి నిల్వ కుంటల నిర్మాణం వంటి పనులను గుర్తించి చేపట్టాలని, అవసరమైన పనుల జాబితాను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం చౌటకూర్ గ్రామంలో కొలు రైతు గొల్ల మహేష్ ఏడు ఎకరాల్లో సాగు చేస్తున్న పత్తి పంటను సీఎస్ పరిశీలించారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని రైతు వివరించారు. వర్షపాతం లోటు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల స్వల్పకాలిక కూరగాయ పంటలను సాగు చేయాలని సీఎస్ సూచించారు. ట్రాన్స్కో సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టాలు తగ్గి విద్యుత్ మోటార్లు, ట్రాన్స్ఫార్మర్లపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ఆకుకూరలు, కూరగాయలను పండించడంతో పాటు కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం వంటి అనుబంధ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందేలా సంబంధిత శాఖల అధికారులు తగిన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, నీటిపారుదల, ఆర్డబ్ల్యూఎస్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధన్వాడలో చండీ హోమం

- పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు

కొత్తూరు, అక్టోబర్ 15 మనం న్యూస్: కొత్తూరు మండలం ధన్వాడ గ్రామంలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం చండీ హోమం అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం జరిపించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. శ్రీనుబాబు ప్రజలకు ముందస్తుగా సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితులు కాంగ్రెస్ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ములుగు, క్షీరసాగర్ గ్రామాల్లో మహిళా రైతుల దినోత్సవ వేడుకలు

ములుగు, అక్టోబర్ 15(మనంన్యూస్): శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం , పీజీఐహెచ్ఎస్ ఆధ్వర్యంలో ఆర్ఎడబ్ల్యూఈపీ విద్యార్థుల భాగస్వామ్యంతో ములుగు, క్షీరసాగర్ గ్రామాల్లో మహిళా రైతుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మహిళా రైతుల సేవలను గుర్తించడం, వారి సాధికారత, ఆరోగ్యం, పోషకాహారం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం. క్షీరసాగర్ గ్రామంలో ఆఫీసర్ ఇన్చార్జ్ డా. విజయ మహిళా రైతుల వ్యవసాయ సేవలను ప్రశంసిస్తూ, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ఉద్యాన పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ , జీవ నియంత్రణ పద్ధతులు, వేప ఆధారిత ఉత్పత్తులు, జిగురు అట్టలు, ఫెరోమోన్ ట్రాప్స్ వినియోగంపై అవగాహన కల్పించారు.

రసాయనిక పురుగుమందుల అధిక వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత పద్ధతులను అవలంబించాలని సూచించారు. ములుగు గ్రామంలో ఆర్ఎడబ్ల్యూఈపీ విద్యార్థులు మహిళా రైతుల వ్యవసాయ కార్యకలాపాలు, వారి శ్రమ, కుటుంబ పోషణలో పాత్రను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డా. వి. సుచిత్ర మాట్లాడుతూ,

ప్రధానమంత్రి చేతుల మీదుగా అవార్డులు పొందిన విజయవంతమైన గ్రామీణ మహిళల ఉదాహరణలను వివరిస్తూ, మహిళా రైతులు స్ఫూర్తి పొందాలని సూచించారు. మహిళలు డిజిటల్ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణను వినియోగించుకుంటూ, పంటల ఎంపిక, సాగు ప్రణాళిక, మార్కెటింగ్ వంటి అంశాల్లో నిర్ణయాధికారులుగా ఎదగాలని, వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా రాణించాలని పిలుపునిచ్చారు. అలాగే, సమతుల్య పోషకాహారం తీసుకుంటూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ములుగు, క్షీరసాగర్ గ్రామంలో మహిళా రైతులను శాలువాలతో సత్కరించి, పోషకాహార ప్రాముఖ్యతను తెలియజేస్తూ అరటిపండ్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎడబ్ల్యూఈపీ ఇన్చార్జి సింధుజ, శరణ్య, రాణి, టీచింగ్ అసోసియేట్, శ్రీశైలం, ఎఫ్పీవో ప్రతినిధి హాజరయ్యారు. క్షీరసాగర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ బాలరెడ్డి, మమత, ఉపసర్పంచ్ నల్ల పర్శరాం మరియు వర్డ్ మెంబెర్స్, ద్రాక్రా గ్రూప్ మెంబెర్స , విద్యార్థులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

కాటారం, అక్టోబర్ 15(మనం న్యూస్): జిల్లా ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు కాటారం పరిధిలో గురువారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ కరుణశ్రీ తెలిపారు. వరంగల్ డిప్యూటీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాలతో గుడుంబా స్థావరాలైన గంగారం తండా, గట్లకుంట తండాలపై దాడులు చేశామని ఆమె పేర్కొన్నారు. ఈ దాడుల్లో 4 కేసులు నమోదు చేసి ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, 650 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో వరంగల్ ఏసీ ఎన్ఫోర్స్మెంట్ సీఐ భారతి బృందం, డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సీఐ రాకేష్ బృందం, జిల్లా ఎస్పు సాయికుమార్ బృందం, భూపాలపల్లి, కాటారం ఎస్హెచ్ఓ బృందాలు, ఎస్పు సందీప్ కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

- చట్టం ప్రకారం కార్మికులకు బోనస్ ఇవ్వాలి
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

సంగారెడ్డి, అక్టోబర్ 15 మనం న్యూస్ ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికుల శ్రమ దోపిడికి యాజమాన్యాలు పాల్పడుతున్నయాని, జీవో నెంబర్ 6 ప్రకారం కనీస వేతనాలను యాజమాన్యాలు అమలు చేయాలని, చట్టం ప్రకారం బోనస్ ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 42000/- పెంచాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు.. బుధవారం నా డు పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ లో సిఐటియు ఆధ్వర్యంలో ఇస్నాపూర్ ఎక్స్ రోడ్ వరకు పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ పాదయాత్రలో ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాలను సవరిస్తూ జీవో నెంబరు.6ను రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా విడుదల చేసిందని తెలిపారు ఈ పెరిగిన వేతనాలను 2026 జూన్ ఒకటో తేదీ నుండి అమలు చేయాలని ఉన్నప్పటికీ అమలు చేయకుండా కార్మికులను శ్రమదోపిడికి యాజమాన్యాలు పాల్పడుతున్నాయని అన్నారు. సిఐటియు యూనియన్లు ఉన్న పరిశ్రమల్లో పెరిగిన కనీస వేతనాలు అమలు చేయించడం జరుగుతుందని అన్నారు. ఇంకా అనేక పరిశ్రమల్లో అమలు కావడంలేదని, అమలు చేయించవలసిన కార్మిక శాఖ ప్రభుత్వ అధికార యంత్రం ఏమాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు. కనీస వేతనాలకు కంటే ఎక్కువ ఉన్నా సరే వాటి పైన 10 శాతం వేతనాలు పెంచాలని జీవోలో ఉందని అన్నారు. కనీస వేతనాలను శాస్త్రీయంగా సవరించకపోగా ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించిందని అన్నారు. కుటుంబ అవసరాలు, జీవన వ్యయం, వినియోగదారుల ధరల సూచీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకో లేదని అన్నారు. కనీస వేతనాలను శాస్త్రీయంగా సవరించి రూ.42,000/-లుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు జీవో నెం.6 ప్రకారం కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని, దసరా పండుగకు బోనస్ చట్టం ప్రకారం ఇవ్వాలని, చట్టబద్ధమైన ఈఎస్ఐ పిఎఫ్ ఓటి డబుల్ ఇయల్స్ సెలవులు వంటివి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులు సంఘటితంగా పోరాడి సాధించుకోవాలనే అన్నారు. అక్టోబర్ 25న పారిశ్రామిక కార్మికులతో చలో హైదరాబాద్, డిసెంబర్ 1 2 3 తేదీలలో ఢిల్లీ ఆక్యుపై నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఆందోళన పోరాటాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని హెల్పునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. పాండురంగారెడ్డి, కిర్బి యూనియన్ జనరల్ సెక్రెటరీ వివిస్ రాజు, శాండ్విక్ జనరల్ సెక్రెటరీ ప్రదీప్, నాయకులు తలారి శ్రీనివాస్ రాజు వెంకటేష్ మల్లేష్ సుధాకర్ శ్యామ్ ఎడుకొండల్ విట్టల్ సోమన్న రాజురెడ్డి శంకర్ బిలాల్ వెంకట్రావు సత్తిబాబు నారాయణ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ది పింక్ క్వశ్చన్ క్యాంపెయిన్

హైదరాబాద్, అక్టోబర్ 15(మనంన్యూస్): ఈ రొమ్ము క్యాన్సర్ అవేర్నెస్ నెలలో, ఏఐజీ హాస్పిటల్స్ 'ది పింక్ క్వశ్చన్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది ప్రజలు సాధారణంగా సంకోచంతో చెప్పని రొమ్ము ఆరోగ్య సంబంధిత ప్రశ్నలను అనామకంగా అడగడానికి సురక్షిత వేదికను అందించేలా రూపొందించబడింది.'ది పింక్ క్వశ్చన్' ప్రజలకు ఏమి తెలుసుకోవాలో చెప్పడం కంటే, వారు ఏమి తెలుసుకోవాలనుకుంటున్నారో అడగడం ద్వారా ఈ అంతరాన్ని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సంకోచం, సామాజిక ముద్ర, విమర్శ భయం లేదా అనిశ్చితి వంటి కారణాలు కొంతమందిని నమ్మకమైన వైద్య సలహా తీసుకోకుండా అడ్డుకుంటాయని గుర్తించి, ఈ కార్యక్రమం అక్టోబర్ నెలంతా హాస్పిటల్స్ అనామక ప్రశ్న పెట్టెను మరియు ఆన్లైన్ సమర్పణ ఫారమ్ను అందిస్తోంది. ఈ కార్యక్రమం గురించి మాట్లాడుతూ, డా. ప్రజ్ఞ చిగురుపాటి, కన్సల్టెంట్ బ్రెస్ట్ ఆంకోప్లాస్టిక్ సర్జన్, ఏఐజీ హాస్పిటల్స్ ఇలా అన్నారు. కొన్నిసార్లు మెరుగైన రొమ్ము ఆరోగ్యం వైపు మొదటి అడుగు కేవలం ఒక ప్రశ్న అడగడమే. ఏ సందేహం కూడా అడగకుండా లేదా సమాధానం లేకుండా ఉండకూడదు. 'ది పింక్ క్వశ్చన్' ద్వారా ఈ సంభాషణల చుట్టూ ఉన్న సంకోచాన్ని తొలగించి, ప్రజలు తమ సందేహాలను సౌకర్యంగా వ్యక్తం చేసి నమ్మకమైన వైద్య మార్గదర్శకత్వం పొందేలా చేయాలని మేము కోరుకుంటున్నాము. ప్రతి ప్రశ్నను అవగాహన, అవగాహన మరియు సమయోచిత సంరక్షణకు అవకాశంగా మార్చాలని తమ లక్ష్యమన్నారు.

దశదినకర్మలకు హాజరై బాధిత కుటుంబానికి పరామర్శ

మంగపేట, అక్టోబర్ 15, మనం ప్రతినిధి: మండలంలోని రాజుపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గరికపాటి సాంబశివరావు దశదినకర్మలకు శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగరమేష్ హాజరయ్యారు. సాంబశివరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు యడ్లపల్లి నరసింహారావు బంధువైన సాంబశివరావు మృతి పట్ల నాగరమేష్ సంతాపం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి, కోడె రాము, హుస్సేన్, వెంకట్రావు, కొమరం పుల్లారావు, సాంబుల్, సంతోష్, సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో మార్పు తేవడమే జనసేన ధ్యేయం

- బీసీలకు జనసేన న్యాయం
- మీడియా సమావేశంలో నల్ల సురేష్ రెడ్డి

మధిర, అక్టోబర్ 15(మనం న్యూస్): తెలంగాణ ప్రజల్లో మార్పు తేవడమే జనసేన ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్ల సురేష్ రెడ్డి పేర్కొన్నరు. మధిర ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జనసేన మధిర నియోజకవర్గ పిఓసి మెంబర్ పార్టీ డేవిడ్ అధ్యక్షత గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్ల సురేష్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రాబోయే కాలంలో జనసేన పార్టీ బలంగా ఉంటుందని డబ్బుకు దాసోహం కాదని జనసేన పార్టీ ప్రజల పార్టీ అని అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఏ పార్టీ చేయనిది జనసేన పార్టీ చేసిందని, ముఖ్యంగా బీసీలకు న్యాయం చేస్తుందని, ఖమ్మం నల్గొండ వరంగల్ జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గడల శ్రీనివాస్ గెలుపే దిశగా పయనిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి మండలానికి బిఎల్పీలు ఉన్నారని కాంక్షిస్తూ తెలంగాణలో జనసేన బలంగా ఉంటుందని ఆయన సందర్భంగా వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని టిఆర్ఎస్ తీసుకొచ్చిందని బీసీలకు తగిన న్యాయం చేయలేదని ఆయన తెలియజేశారు. ఈ మీడియా సమావేశంలో పగడాల పవన్ కుమార్, తోట దీపక్, రమేష్, కుమార్, సజ్జనపు భరత్, పూచ్చ నాగబాబు పాల్గొన్నారు.

మల్లెపూల వాగుకు గోదావరి జలాలు మళ్లింపు

జలసిరులు కురిపించే ప్రజానాయకుడు మంత్రి తుమ్మల
ముమ్మరంగా మొదలైన సీతారామ కాలువ పనులు
హర్షం వ్యక్తం చేస్తున్న దమ్మపేట మండల రైతులు

దమ్మపేట, అక్టోబర్ 15(మనం న్యూస్)ః మంత్రి తుమ్మల కృషితో సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువుకు గోదావరి జలాలు అందించాల్సిన సీతారామ ప్రాజెక్టు పరిధి కాలవ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సుమారు 1.7 కిలోమీటర్ల మేర కాల్వ నిర్మాణానికి 74 ఎకరాలు భూమి అవసరం కాదా 52 ఎకరాలు సంబంధించి రైతులు కోర్టును ఆశ్రయించినారు. దీంతో ఆరు నెలలుగా పనులకు బ్రేక్ పడింది. పరిహారం విషయంలో పలుమార్లు చర్చించి ప్రభుత్వం నుంచి హామీ ఇప్పించి కేసులో ఉపసంహరణకు ప్రయత్నించడంతో మళ్లీ పనుల్లో కదలిక వచ్చింది. దీంతో దమ్మపేట మండలం నాగుపల్లి 40.3 కిలోమీటర్ల వద్ద నిలిచిపోయిన సీతారామ కాలవ పనులు బుధవారం మొదలయ్యాయి. ఒకే సారి 9 ప్రొక్లైన్లతో రెండు వైపులా నుంచి పనులు ఏ పడుతుండగా. ఒక నెలలోగా కాలవ నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. 40.3 కిలోమీటర్ల వద్ద సాగుతున్న కాలువ నిర్మాణ పనులు 400 క్యూసెక్కులు 24 గంటలు పడుతుందని బేతపల్లి చెరువుకు 400 క్యూసెక్కుల గోదావరి జలాలు విడుదల చేస్తే 42 కిలోమీటర్ల ప్రయాణించి 24 గంటల్లో చేరుకునేలా కాలువను డిజైన్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీ జీ కొత్తూరు. పంపు హౌస్ వద్ద నీరు విడుదల చేస్తే ములకలపల్లి మండలం వీ కే రామవరం (పూసు గూడెం) కమలాపురం పంప్ హౌస్ మీదుగా తొట్టి పంపు డెలివరీ సిస్టం నుంచి యాతాలకుంట టెన్నల్ బుగ్గపాడు నాగపల్లి వద్ద బేతుపల్లి బ్రాంచ్ కెనాల్ క్రాస్ రెగ్యులేటరీ శ్రీరాంపురం చెరువు అలుగు పోసుకొని ముసలి బంధం ఆసన్న గూడెం మల్లెపూల వాగు మీదుగా గోదావరి జలాలు బేతపల్లి చెరువుకు చేరతాయి. ఇప్పటికే మార్గమధ్యలో అవసరమైన రెగ్యులేటరీ తూము నిర్మాణం కూడా పూర్తయింది.

సత్తుపల్లి వేంసూరు మండలాలకు గోదావరి జలాలు

గోదావరి జలాలు బేతుపల్లి చెరువుకు చేరితే సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో జలకళ సంతరించుకుంటోంది. బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలవ ద్వారా వేంసూరు మండలం లోని.46 చెరువులకు గాను పదివేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు కుడి ఎడమ కాలువలతో రామనగరం, తాళ్లమడ, బేతుపల్లి, కిష్టాపురం, నారాయణపురం, తుంబూరు, గ్రామాల్లో అధికారికంగా 48 ఎకరాలకు అనధికారికంగా మరో 6000 ఎకరాలకు సాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఓ సీతారామ కాలువతో గోదావరి జలాలతో చెవులు నింపుతూ మరోవైపు వేతుపల్లి ద్వారా సాగునీరు డిశ్చార్జ్ చేసేలా డిజైన్ చేశారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ప్రత్యక్ష పర్యవేక్షణ

డిసెంబర్ వరకు మాత్రమే గోదావరిలో నీరు అందుబాటులో ఉండే అవకాశం ఉంది దీంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చొరవ తీసుకొని రైతులకు మెరుగైన పరిహారం అందించాలని సీఎం రేవంత్ రెడ్డితో చర్చించారు. ఫలితంగా రైతులకు కోర్టు కేసులు ఉపసంహరణకు అంగీకరించటంతో 1.7 కిలోమీటర్ల మేర కాలవ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి ఈ క్రమంలో నవంబర్ నెలాఖరుకల్లా కాలవ నిర్మాణం పూర్తి చేసి గోదావరి జలాలను బేతుపల్లి చెరువుకు తరలించే లక్ష్యంతో ఉన్నట్లు చెబుతున్నారు. గోదావరి జరాలు చేరితే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలే పెరగడమే గాక ఆయకట్టులో పంటల సాగు సాఫీగా సాగుతుంది.

కన్యకా పరమేశ్వరి అమ్మవారి నవరాత్రులు నామమాత్రమేనా?

గత వైభవం ఏమైంది.. పూజా కార్యక్రమాలు ఎందుకు తగ్గాయి?
ప్రత్యేక ఆలయ కమిటీ ఏర్పాటు చేయాలి..
ఉదయం 5 గంటలకే ఆలయం తెరవాలని భక్తుల డిమాండ్

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 15(మనం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గతంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల వైభవం ఇప్పుడు కనిపించడం లేదని స్థానిక ఆర్యవైశ్య కుటుంబాలు, మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నామని చెబుతున్నప్పటికీ, గతంలో మాదిరిగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత వైభవం ఏమైంది?

గతంలో దారా రామ నరసింహారావు కమిటీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రకాల అలంకరణలు, శ్రీచక్ర పూజలు, కుంకుమార్చనలు నిర్వహించేవారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అనంతరం వందనపు సూర్యప్రకాశరావు హయాంలోనూ ఉత్సవాలు వైభవంగా జరిగాయని పేర్కొంటున్నారు. అయితే, 2016 నుంచి గతంలో మాదిరిగా పూజా కార్యక్రమాలు జరగడం లేదని ఆరోపిస్తున్నారు.

ఉదయం 5 గంటలకే ఆలయం తెరవాలి

ప్రస్తుతం ఉదయం 7 గంటల తర్వాతే ఆలయం తెరుస్తున్నారని, దీంతో తెల్లవారుజామున అమ్మవారిని దర్శించుకోవాలనుకునే భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. నవరాత్రి తొమ్మిది రోజుల పాటు ఉదయం 5 గంటలకే ఆలయం తెరిచి అభిషేకాలు, శ్రీచక్ర పూజలు, కుంకుమార్చనలు నిర్వహించాలని కోరుతున్నారు. విజయదశమి రోజున కూడా ప్రత్యేక పూజలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి

అమ్మవారి ఆలయానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయకుండా అన్నదాన సత్రం కమిటీ సభ్యులే నిర్వహణ బాధ్యతలు చేపడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ, భక్తులు, మహిళలు, సమాజ పెద్దల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు సూచిస్తున్నారు. నవరాత్రుల పేరుతో గొప్పలు చెప్పుకోవడం కంటే, సంప్రదాయ పూజా కార్యక్రమాలను ఆచరణలో నిర్వహించడమే ముఖ్యమని వారు పేర్కొంటున్నారు. గతంలో ఉన్న ఆధ్యాత్మిక వైభవాన్ని తిరిగి తీసుకురావడంతో పాటు, ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి భక్తుల మనోభావాలకు గౌరవం ఇవ్వాలని కోరుతున్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్
నియోజకవర్గ ఇన్చార్జిలతో డిసిసి అధ్యక్షుడు సమీక్ష

ఖమ్మం, అక్టోబర్ 15 (మనం న్యూస్): పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులకు డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లాలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇంచార్జీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇంచార్జీలు శాసనమండలి మాజీ సభ్యులు బాలసాని లక్ష్మినారాయణ, పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గిద్దంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టి పి సి సి ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, జిల్లా కాంగ్రెస్ కమిటి అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి లతో కలిసి మాట్లాడారు. ఈ నెల 16, 17 తేదీల్లో స్థానికసంస్థల సభ్యుల అనుమతితో నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలాల వారీగా కమిటీలు - పాత కమిటీలు అన్నీ పరిశీలించి నూతన కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో కమిటీలు, నియామకాలు - బూత్ కమిటీల ద్వారా సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. బి ఎల్.ఏ ల ద్వారా నమోదు - ఎలక్టోరల్ పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో మండలాల వారీగా జిల్లా రిపోర్టులను అధిష్టానానికి తెలియజేయాలన్నారు. ప్రతి మండలంలో పట్టభద్రుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలనీ, ఈజీ రిజిస్ట్రేషన్ ఎంట్రీలపై ఎప్పటికప్పుడు రివ్యూ పెట్టి నమోదును వేగవంతం చేయాలనీ సూచించారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రతి నియోజకవర్గానికి మంత్రులు, ఎమ్మెల్యేలను కో-ఆర్డినేటర్లుగా నియమించారని, వారి ఆధ్వర్యంలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువత, పట్టభద్రుల కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా స్వయం ఉపాధి, 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, స్కిల్ డెవలప్మెంట్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, మహాలక్ష్మి, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను ప్రతి పట్టభద్రుడికి తెలియజేసి, ప్రభుత్వానికి అండగా నిలిచేలా ఓటరు నమోదు చేయించాలని కోరారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష

- లాటరీ పద్ధతిలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి
- 22న కలెక్టరేట్ వద్ద సర్పంచులతో కలిసి ఆందోళన
- విపక్షాల నిర్ణయం

ఖమ్మం, అక్టోబర్ 15 (మనం న్యూస్): ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష చూపుతున్నారని నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని విపక్షాలు ఆరోపించాయి. లబ్ధిదారుల జాబితా తయారు చేసి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశాయి. సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ (ఎంఎల్)మాస్స్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల -సంయుక్త సమావేశం గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరైంది కాదని, కండువా కప్పుకున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని సమావేశంలో పాల్గొన్న నేతలు ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నియమ నిబంధనలను పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ కార్యకర్తలు ఇచ్చిన జాబితానే యథాతథంగా ఆమోదిస్తున్నారని అధికారులు ఆ జాబితాలో అనర్హులు ఉన్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ నెల 22న సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో ఆందోళన నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈసమావేశంలో ఎంఎల్సి తాతా మధుసూదన్, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జెడ్పి మాజీ చైర్మన్ లింగాల కమలాజు, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, వివిధ పక్షాల నేతలు యర్రా బాబు, బెల్లం వేణు, ఆవుల అశోక్, శింగు నర్సింహారావు, పర్సా రాంచందర్రావు, బానోత్ కొండ, శివరామకృష్ణ, తాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్లో రక్షణ చర్యలు ముఖ్యం

హై వోల్టేజీ పనుల్లో జాగ్రత్తలు పాటించాలి
డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ(ఎలక్ట్రికల్) కె.మహేశ్వర్ రెడ్డి
132 కేవీ సబ్ స్టేషన్లో విద్యుత్ భద్రతా తనిఖీ

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 15(మనం న్యూస్): సబ్ స్టేషన్లలో హై వోల్టేజీ పనుల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) కె.మహేశ్వర్ రెడ్డి సూచించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేట్ పరిధిలోని 132 కేవీ సబ్స్టేషన్ను గురువారం డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ ఎలక్ట్రికల్ కె.మహేశ్వర్ రెడ్డి సందర్శించి విద్యుత్ భద్రతా ప్రమాణాల అమలుపై తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ హై వోల్టేజీ విద్యుత్ పరికరాల వద్ద పనిచేసే సమయంలో తగిన రక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు షట్డౌన్ విధానాన్ని కచ్చితంగా పాటించాలని సరైన ఐసోలేషన్ ఎర్తింగ్ అనుమతి పత్రాల ప్రక్రియలను అనుసరించిన తర్వాతే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఎత్తయిన ప్రదేశాల్లో పనిచేసేటప్పుడు నాణ్యమైన సేఫ్టీ బెల్ట్ లేదా ఫుల్ బాడీ హార్నెస్ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. విద్యుత్ పనుల సమయంలో రక్షణాత్మక హ్యాండ్ గ్లోవ్స్, ఎలక్ట్రికల్ ఇన్సులేటింగ్ షూస్ తగిన ఆర్క్ ఫ్లాష్ ప్రొటెక్షన్ కిట్ వంటి వ్యక్తిగత రక్షణ పరికరాలను వినియోగించాలని తెలిపారు.

సబ్స్టేషన్లో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిర్దేశిత భద్రతా నియమాలు ఆపరేటింగ్ విధానాలను కచ్చితంగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రమాదరహిత వాతావరణంలో విధులు నిర్వహిస్తూ సబ్స్టేషన్ను భద్రతా ప్రమాణాల్లో ప్రథమ శ్రేణిలో నిలపాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ(ఎలక్ట్రికల్)కె.మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ భద్రతా తనిఖీలో డిడిఎంఎస్ షేక్ నాగుల్ మీరా, డిడిఎంఎస్ దేవ్ కిషన్ శర్మ, జనరల్ మేనేజర్(ఈ అండ్ఎం) సెంట్రల్ వర్క్ షాప్ కె.రామ్మోహన్, జనరల్ మేనేజర్(ఈ అండ్ఎం) వర్క్ షాప్ అండ్ ఎనర్జీ మేనేజ్మెంట్ వై.విజయ శేఖర్ బాబు, సబ్స్టేషన్ డిజిఎం కె.వేలాద్రి, ఎస్ఈ(ఈ అండ్ ఎం) వి.నరేంద్ర కుమార్, డివైఎస్ఈ ఎం.డి. ఫరూక్, జేఈ(ఈ అండ్ఎం) కోట శ్రీనివాసరావు, సూపర్వైజర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేలో తప్పులకు తావు లేదు..

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు!
- బట్టుపల్లిలో భూ రీ సర్వే పనులపై కలెక్టర్ అంకిత్ క్షేత్రస్థాయి పరిశీలన..
- కరకగూడెం పీహెచ్సీలో ఆకస్మిక తనిఖీ
- మెడికల్ ఆఫీసర్కు ఛార్జ్ మెమో..
- ఇద్దరు అవుట్సోర్సింగ్ జీఎన్ఎంల తొలగింపునకు ఆదేశాలు

కరకగూడెం, అక్టోబర్ 15 (మనం న్యూస్): భూ రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించి, రైతుల భూముల హక్కులకు భంగం కలగకుండా భూ హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గురువారం కరకగూడెం మండలంలో పర్యటించిన కలెక్టర్ తొలుత బట్టుపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది హాజరు, వైద్య సేవలు, రోగులకు అందుతున్న సౌకర్యాలను సమీక్షించారు.

భూ రీ సర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం..

బట్టుపల్లి రెవెన్యూ పరిధిలో సుమారు 1,160 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న భూ రీ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక డీజీపీఎస్, జీఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాల సహాయంతో భూముల సరిహద్దులను ఖచ్చితంగా గుర్తిస్తూ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. సర్వే నంబర్ల వారీగా భూముల హద్దులను పరిశీలించి, అటవీ భూములు, రైతుల పట్టా భూముల మధ్య ఉన్న సరిహద్దు రాళ్లను గుర్తిస్తూ సాంకేతిక పరికరాల ద్వారా వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి వారి పట్టా పుస్తకాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో చేపడుతున్న కొలతలను రెవెన్యూ రికార్డులు, పట్టా వివరాలతో సరిపోల్చిన అనంతరమే భూముల హక్కులు, సరిహద్దులను నిర్ధారించాలని సూచించారు. కొండ ప్రాంతాలు, దట్టమైన చెట్ల కారణంగా కొన్ని చోట్ల శాటిలైట్ సిగ్నల్ సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి సరిహద్దు బిందువులను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, భూ రీ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా, పారదర్శకంగా పనులు నిర్వహించాలని స్పష్టం చేశారు. రైతుల భూముల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా రెవెన్యూ రికార్డులు, పట్టా వివరాలు, క్షేత్రస్థాయి కొలతలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. అటవీ భూములు, పట్టా భూముల మధ్య సరిహద్దుల నిర్ధారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రైతులకు ఎదురయ్యే సందేహాలు, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. రెవెన్యూ, సర్వే, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, భూముల హద్దులపై స్పష్టత తీసుకువచ్చి భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పీహెచ్సీలో ఆకస్మిక తనిఖీ.. సిబ్బంది తీరుపై కలెక్టర్ ఆగ్రహం..

అనంతరం కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్ ముందుగా సిబ్బంది హాజరు రిజిస్టర్ను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ రవితేజ అందుబాటులో లేకపోవడానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై సిబ్బంది పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్కు ఛార్జ్ మెమో జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మెడికల్ ఆఫీసర్ గైర్హాజరుపై సరైన సమాచారం ఇవ్వకుండా తప్పుడు సమాధానాలు అందించారని పేర్కొంటూ, ఇద్దరు అవుట్సోర్సింగ్ జీఎన్ఎంలను విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్యులు, సిబ్బంది ప్రధాన బాధ్యత అని తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రోగులకు వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కాంతయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కిరణ్, జిపిఓ, సర్వేయర్ సందీప్, బట్టుపల్లి సర్పంచ్ తోలేం రమాదేవి, రెవెన్యూ సిబ్బంది, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మనం Manam Mahabubnagar
మహబూబ్ నగర్

ఎల్నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ

గిరిజన కుటుంబాలకు 125 రోజుల ఉపాధి కల్పించాలి
ఐదు నెలల పాటు ప్రతి జాబ్కార్డుకు నెలకు రూ.7,500 వేతనం లక్ష్యం
గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించాలి: మంత్రి సీతక్క

ములుగు, అక్టోబర్ 15,మనం ప్రతినిధి: ఎల్నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. ముఖ్యంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని సూచించారు. రాబోయే ఐదు నెలల్లో ప్రతి జాబ్కార్డుకు నెలకు కనీసం రూ.7,500 వేతనం అందేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. బేగంపేటలో గురువారం వీబీజీ రామ్ జీ ద్వారా ఎల్నినో, కరువు నివారణ చర్యలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో మంత్రి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి, ఉపాధి సమస్యలు, పశుగ్రాసం కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో నీటి సంరక్షణ, ఉపాధి కల్పన, పశుగ్రాసం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సీతక్క తెలిపారు. ఈసారి వేసవి తరహా పరిస్థితులు ఎక్కువకాలం కొనసాగే అవకాశం ఉన్నందున తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

గిరిజన కుటుంబాలకు ఉపాధి భరోసా

ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం ప్రధానంగా ఒకే పంటకు పరిమితమవుతోందని, దీంతో గిరిజన కుటుంబాలకు ఏడాది పొడవునా ఆదాయం కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలకమని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి జాబ్కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి గిరిజన నివాస ప్రాంతంలో కనీసం ఒక మేట్ను నియమించాలని సూచించారు. కూలీలకు వేతనాలు సకాలంలో అందేలా పర్యవేక్షించాలన్నారు. ఉపాధి హామీ పనులతో కూలీలకు పని కల్పించడమే కాకుండా గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే శాశ్వత ఆస్తులను నిర్మించాలని చెప్పారు. చెరువుల్లో పూడికతీత, ఊట చెరువులు, పెర్కొలేషన్ ట్యాంకులు, కాలువలు, ఫీడర్ ఛానళ్లు, కందకాల తవ్వకం, గ్రామీణ రహదారుల అభివృద్ధి వంటి పనులను స్థానిక అవసరాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. వీటితో భూగర్భ జలాల పెంపుదలతో పాటు వ్యవసాయానికి అవసరమైన నీటి వనరులను అభివృద్ధి చేయవచ్చన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించాలి

అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించాలని సీతక్క సూచించారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే అడ్డంకులను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. పశువులకు నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, చెక్డ్యాంల నిర్మాణం, నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ, ఐటీడీఏలు, పేదరిక నిర్మూలన సంస్థలు సమన్వయంతో పనిచేసి కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు.

చిట్టచివరి వ్యక్తి అభివృద్ధే లక్ష్యం

గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టే కార్యక్రమాల ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. మారుమూల గిరిజన గ్రామాలు సైతం ఇతర ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చెందేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. చిట్టచివరి గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధి చెందడమే నిజమైన సమగ్ర అభివృద్ధి అని స్పష్టం చేశారు. ఎల్నినో ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, ప్రతి గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి పేద కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీతక్క ఆదేశించారు.

చెస్ చోంపియన్ అక్షయ్ చౌహాన్‌ను అభినందించిన ఎస్టీ అసోసియేషన్ కంపెనీ జనరల్ సెక్రెటరీ

వరంగల్, అక్టోబర్ 15(మనంన్యూస్)ః ఎపీడీసీఎల్ ఎఎఈ శశికాంత్ నాయక్ కుమారుడు లావుడ్య అక్షయ్ చౌహాన్, 2వక్లాస్ మలేషియా లో జరిగిన కామంవెల్త్ స్కూల్ చెస్ చోంపొంషిప్ లో బంగారు పతకం సాధించి స్వదేశానికి తిరిగి వచ్చిన తరువాత వారిని ఎస్టీ అసోసియేషన్ కంపెనీ జనరల్ సెక్రెటరీ అజ్మీరా శ్రీరామ్ నాయక్ గారు అభినందించి సత్కరించి ఆశీర్వదించడం జరిగింది... అదేవిధంగా రాబోయే రోజుల్లో అక్షయ్ చౌహాన్ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకొని బంజారా జాతికి, రాష్ట్రానికి మరియు దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని ఆకాంక్షించడం జరిగింది

తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి

జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి డి. సంజీవరావు

ములుగు,అక్టోబర్ 15,మనం ప్రతినిధి: ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి డి. సంజీవరావు తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా స్వల్పకాలిక పంటలతో సాగు ప్రణాళిక రూపొందించుకుని, కూరగాయల సాగుపై ఆసక్తి కనబరచాలని ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 116 ఎకరాల్లో రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. మార్కెట్లో కూరగాయల ధరలు, వినియోగదారుల అవసరాలు, స్థానిక పరిస్థితులను అర్థం చేసుకుంటూ పంటలను ఎంపిక చేసుకుంటే మెరుగైన లాభాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. పంట చేతికొచ్చే సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని సాగు చేపట్టాలని సూచించారు. వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ సాగు పనులు చేపట్టాలని తెలిపారు. పంటల ఎంపిక, నాణ్యమైన విత్తనాలు, నీటి యాజమాన్యం, సస్యరక్షణ విషయంలో ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ కూరగాయల సాగు చేపట్టాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సర్వోత్తమరెడ్డి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

గ్రామీణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం: మంత్రి సీతక్క

ములుగు, అక్టోబర్ 15, మనం ప్రతినిధి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామ్రెడ్డి సర్వోత్తమరెడ్డి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సభలో ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కీలకమని పేర్కొన్నారు. ప్రతి పట్టభద్రుడిని కలిసి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు కోరాలని సూచించారు. కార్యకర్తల నిరంతర శ్రమ, అంకితభావంతోనే పార్టీ బలోపేతం సాధ్యమవుతుందని సీతక్క అన్నారు. ఎన్నికల్లో సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ములుగు జిల్లా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలతో కూడుకున్నందున ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి తెలిపారు. యువత ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులను తగ్గించేందుకు స్థానికంగానే అవకాశాలు పెంచాలని అన్నారు. ఇప్పటికే పలు జాబ్మేళాలు నిర్వహించామని, ఐటీ రంగంతో పాటు ఆయిల్పామ్, ఇతర పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యమని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి రామ్రెడ్డి సర్వోత్తమరెడ్డి ఉన్నత విద్యావంతుడని, పట్టభద్రులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించాల్సిన అవసరం ఉందని సీతక్క అన్నారు. ఆయన తండ్రి దామోదర్రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తుచేస్తూ, పార్టీ అభ్యర్థి గెలుపు కోసం శ్రేణులంతా కృషి చేయాలని కోరారు. పట్టభద్రుల సమస్యలు, గ్రామీణ యువత ఆకాంక్షలకు ప్రాధాన్యమిస్తూ ఎన్నికల ప్రచారాన్ని సమన్వయంతో నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. ఐకమత్యం, క్రమశిక్షణతో పనిచేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమరెడ్డి విజయానికి కృషి చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

లాభాల బోనసులో విశ్రాంతి కార్మికులకు కూడా వాటా ఇవ్వాలి

వరంగల్, అక్టోబర్ 15(మనంన్యూస్)ః 30 నుండి 40 సంవత్సరాలు పనిచేసి సంస్థకు ఎనలేని సేవ చేసి రిటైర్ అయిన వారికి సంస్థ తప్పక సహాయం చేయవలసిందని కోరుతున్నామని సింగరేణి విశ్రాంతి కార్మికులు సంక్షేమ సంఘం అధ్యక్షులు ప్రకాష్ చారి ప్రధాన కార్యదర్శి. చిదరాల సత్యనారాయణ కోశాధికారి నలబాల దామోదర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం డి హసన్ మరియు వి రవీందర్ గుప్తలు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాల బోనసు లో విశ్రాంతి కార్మికులకు కూడా వాటా ఇవ్వాలని, ఆరోగ్య బీమాను విశ్రాంతి కార్మికులకు 25 లక్షలకు పెంచాలన్నారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ లో 727.6 కోట్లు అవకతవకలపై సిబిఐ లో విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకొని విశ్రాంతి కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నామని, వరంగల్ లోని కొత్తగా నిర్మించిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో కూడా సింగరేణి విశ్రాంతి కార్మికులకు వైద్యము కొరకు ప్రత్యేక విభాగము కేటాయించాలన్నారు. 1998 నుండి ఇప్పటివరకు పెన్షన్ పెరుగుదల గురించి రివైజ్ చేయలేదు మరియు ఎలాంటి ఈ పెరగడం లేదు కావున పెన్షన్ పెంచుతూ డి ఎ తో కూడిన పెన్షన్ ఇవ్వాలని కోరారు. రూ. 350 ,500, 1000.తీసుకుంటున్న విశ్రాంతి కార్మికుల జీవనము ఎలా కొనసాగాలి ఎలా కొనసాగించాలని ఆలో చించండి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పైడాకుల అశ్రోతప్పుడు ప్రచారం చేస్తే

చట్టపరమైన చర్యలు

బ్లాక్మెయిలింగ్కు పాల్పడితే సహించేది లేదు

ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ హెచ్చరిక

ములుగు, అక్టోబర్ 15,మనం ప్రతినిధి: ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశ్రో నిరాధార ఆరోపణలు చేస్తూ, ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు కథనాలు ప్రచురిస్తే సహించేది లేదని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ హెచ్చరించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం బ్లాక్మెయిలింగ్కు పాల్పడినట్లు ఆధారాలతో తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలకు ముందుకెళ్తామని స్పష్టం చేశారు. పైడాకుల అశోక్ ప్రజలతో మమేకమవుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఇస్సార్ ఖాన్ పేర్కొన్నారు. అలాంటి నాయకుడిపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూడటం సరికాదన్నారు. ఆరోపణలు చేసే ముందు వాటికి తగిన ఆధారాలు ఉండాలని సూచించారు. పత్రికా స్వేచ్ఛను కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తుందని, అయితే ఆ స్వేచ్ఛను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సమంజసం కాదని అన్నారు. వార్తలు ప్రచురించే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలని, సంబంధిత వ్యక్తుల వివరణ తీసుకోవాలని సూచించారు. తప్పుడు కథనాలతో వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే నాయకులపై నిరాధార ప్రచారాలతో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఇస్సార్ ఖాన్ అన్నారు. వాస్తవాలకు విరుద్ధంగా ప్రచారం చేస్తూ వ్యక్తిగత ప్రతిష్ఠకు నష్టం కలిగించే ప్రయత్నాలను చట్టపరంగా ఎదుర్కొంటామని తెలిపారు.

యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ములుగు,అక్టోబర్ 15,మనం ప్రతినిధి: ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు టాస్క్ ములుగు ప్రాంతీయ కేంద్రం లో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. రిటైల్ రంగంతో పాటు బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో ఉపాధి అవకాశాలను పొందేందుకు ఉద్దేశించిన రెండు వేర్వేరు శిక్షణ కార్యక్రమాలకు అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 31వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ల్యాండ్మార్క్ గ్రూప్ ఫౌండేషన్ సహకారంతో హెడ్ హెల్ హై ఫౌండేషన్ అమలు చేస్తున్న 'మేక్ ఇండియా కేపబుల్' కార్యక్రమంలో భాగంగా యువతకు ఉచిత ఉద్యోగ సన్నద్ధత శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ శిక్షణలో 30 రోజుల పాటు తరగతి గదిలో బోధన, ఆచరణాత్మక అభ్యాసం ఉంటాయని తెలిపారు. అనంతరం ఏడు రోజుల పాటు పని ప్రదేశంలో ప్రత్యక్ష శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అర్హులైన అభ్యర్థులకు హైదరాబాద్లోని రిటైల్ రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు సహకారం అందించనున్నట్లు వివరించారు. శిక్షణ తరగతుల ప్రారంభ తేదీలు, ప్రవేశ ప్రక్రియ, ఇతర పూర్తి వివరాల కోసం టాస్క్ సెంటర్ కోఆర్డినేటర్ మురళి కృష్ణ 9490500282, 9618449360 నంబర్లలను సంప్రదించాలని తెలిపారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు ఈ శిక్షణ కార్యక్రమాల వివరాలను అర్హులైన యువతకు తెలియజేసి, గడువులోగా పేర్లు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

ఏటూరునాగారంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు

ఏటూరునాగారం, అక్టోబరు 15 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏటూరునాగారం కొమరం భీం గ్రౌండ్లో బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడి సందడి చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి హాజరై మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఉద్యోగులంతా కలిసికట్టుగా జరుపుకోవడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో ములుగు జిల్లా సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అన్నవరం రవికాంత్, రాష్ట్ర కార్యదర్శి గుల్లగట్టు సంజీవ్, మహిళా అధ్యక్షురాలు వంగాల వనజ, ఉపాధ్యక్షురాలు ఈసం అనసూయ, గౌరవ అధ్యక్షురాలు బొట్టే శకుంతల, స్పోర్ట్స్ ఆఫీసర్ శ్యామల, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచర్ల వీరభద్రం, పి.అర్చన, జీసీడీఓ సుగుణ, హేమలత, జమున, రాణి, ఇంద్రావతి, అన్నపూర్ణ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



నలగొండ -అక్టోబర్ 15 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ వేడుకలను నల్గొండ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బతుకమ్మ వేడుకలలో భాగంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో అక్టోబర్ 13 నుండి అక్టోబర్ 18 వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 13:మహిళా శిశు సంక్షేమ శాఖ , మార్కెటింగ్, పరిశ్రమల శాఖ, మెప్మా శాఖలు బతుకమ్మ వేడుకలు నిర్వహించాయని, అక్టోబర్ 14 న మునిసిపల్, ట్రాన్స్కో, మత్స్య శాఖ, బి సి, ఎస్ సి, ఎస్ టి, మైనారిటీ సంక్షేమ శాఖలు,సహకార, పౌర సరఫరాల శాఖ, టి యన్ జీ ఓ , సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు .అక్టోబర్ 15 న వ్యవసాయ , సెరికల్చర్, ఉద్యాన, చేనేత ,జౌళి , పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నామని, అక్టోబర్ 16న వైద్య ఆరోగ్య జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి, యువజన సంక్షేమ శాఖ, మెప్మా, కార్మిక శాఖ, బార్ అసోసియేషన్, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ మరియు ఇతర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో, బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 17 న డి ఆర్ డి ఏ, జిల్లా పంచాయతీ ,ప్రణాళిక శాఖ , ఆర్టీసీ,మెప్మా, దేవాదాయ శాఖ,రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో అలాగే చివరి రోజై న అక్టోబర్ 18 న సద్దుల బతుకమ్మ ను అటవీ శాఖ, పోలీస్, ఎక్సైజ్, ఫైర్, రవాణా మెప్మా, విద్యా శాఖ మరియు అన్ని ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ వేడుకలలో సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బంది తప్పనిసరిగా హాజరై ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

మహిళా శక్తితో ఆర్థిక స్వావలంబన

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవతో ముందడుగు
- ఉద్యోగ ప్రయత్నాల్లో నిరాశను అధిగమించి విజయపథంలో రాధిక, ప్రియాంక

కలెక్టర్ చొరవతో మహిళలకు ప్రోత్సాహం

జనగామ, అక్టోబర్ 15 (మనం ప్రతినిధి): ఉద్యోగం రాలేదని నిరాశ చెందకుండా.. అందివచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా జనగామ జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు ముందడుగు వేస్తున్నారు. మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల నిర్వహణ ద్వారా కేవలం నాలుగు నెలల్లోనే ఇప్పగూడెం గ్రామానికి చెందిన రాధిక రూ.40 లక్షలు, రామవరం గ్రామానికి చెందిన ప్రియాంక రూ.20 లక్షల టర్నోవర్ సాధించారు. ఇద్దరూ కలిపి రూ.60 లక్షల వ్యాపార లావాదేవీలు నిర్వహించడం గ్రామీణ మహిళల ఆర్థిక ప్రగతికి నిదర్శనంగా నిలుస్తోంది. ఉద్యోగ ప్రయత్నాల్లో నిరాశ.. స్వయం ఉపాధితో విజయం!స్టేషన్ ఘన్పూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన రాధిక గతంలో పలు ఉద్యోగాల కోసం ప్రయత్నించారు. 2018లో స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్గా ఉద్యోగం సాధించినప్పటికీ, తన చిన్న కుమారుడి అనారోగ్య కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అనంతరం 2024లో డీఎస్సీ పరీక్ష రాసి స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ) ఉద్యోగానికి ప్రయత్నించగా, కేవలం అర మార్కు తేడాతో అవకాశాన్ని కోల్పోయారు. తన పట్టుదల, వ్యాపార నిర్వహణతో కేవలం నాలుగు నెలల్లోనే రూ.40 లక్షల టర్నోవర్ సాధించారు. కుటుంబానికి అండగా ప్రియాంక.. రూ.20 లక్షల టర్నోవర్,కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన ప్రియాంక సైతం మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని నిర్వహిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. కేంద్రాన్ని ప్రారంభించిన నాలుగు నెలల్లోనే రూ.20 లక్షల టర్నోవర్ సాధించారు. ఈ కేంద్రం ద్వారా లభిస్తున్న ఆదాయం కుటుంబ పోషణకు తోడ్పడటంతో పాటు, ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడేందుకు దోహదపడుతోందని ఆమె పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పాటు, సంబంధిత అధికారుల ప్రోత్సాహం ఈ ఇద్దరి విజయానికి తోడ్పడింది. తమకు అవకాశం కల్పించి, ముందుకు సాగేందుకు సహకరించిన అధికారులకు, ముఖ్యంగా జిల్లా కలెక్టర్కు రాధిక, ప్రియాంక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ రంగానికి సంబంధించిన సేవలందిస్తూ ఆదాయం పొందే అవకాశం కలుగుతోంది. ఉద్యోగమే ఉపాధికి ఏకైక మార్గం కాదని, సరైన అవకాశం, ప్రోత్సాహం, పట్టుదల ఉంటే స్వయం ఉపాధితోనూ విజయాలు

వెట్టిచాకిరి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

ములుగు, అక్టోబర్ 15,మనం ప్రతినిధి: వెట్టిచాకిరి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి అన్నారు. గురువారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కార్మిక శాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంస్థ సమన్వయంతో వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరి, బలవంతపు శ్రమ నుంచి కార్మికులకు విముక్తి కల్పించేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు.

కార్మికులు తమ హక్కులను తెలుసుకోవాలని, వారి రక్షణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇటుక బట్టీలు, చేపలు, రొయ్యల పెంపక కేంద్రాలు, గనులు, రాతి క్వారీలు, వ్యవసాయ క్షేత్రాలు, ఇతర అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు ఈ ప్రచార వాహనం ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వెట్టిచాకిరి బాధితులు, అటువంటి పరిస్థితులను గుర్తించిన ప్రజలు టోల్ఫ్రీ నంబర్ 080-69434343ను సంప్రదించి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక కళాజాత బృందం వెట్టిచాకిరి నిర్మూలనపై ప్రదర్శించిన అవగాహన నాటిక కలెక్టరేట్ సిబ్బందిని ఆకట్టుకుంది. కార్మికులు ఎదుర్కొనే ఇబ్బందులు, వారి హక్కుల పరిరక్షణ ఆవశ్యకతను కళాకారులు నాటిక రూపంలో వివరించారు.

అనంతరం వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన పోస్టర్ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారి వినోద, జిల్లా పౌర సంబంధాల అధికారి రఫిక్, కలెక్టరేట్ పరిపాలనాధికారి అల్లం రాజకుమార్, పర్యవేక్షకులు మంజుల, మహేష్ బాబు, కలెక్టరేట్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో మధ్యంతర ఎన్నికల కాక

● ట్రంప్ కార్డు పడేనా

వాషింగ్టన్, అక్టోబర్ 15 : అంతర్జాతీయ పరిణామాలతో భారమైన జీవన వ్యయాలకు తోడు... అమెరికాలో ఎన్నికల కాక మొదలైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భవిష్యత్తు పాలనా కాలం ఎలా ఉండబోతోందో వచ్చే నెల 3వ తేదీన జరిగే మధ్యంతర ఎన్నికలు తేల్చబోతున్నాయి. పెరిగిన ధరలతో సతమతమవుతున్న అమెరికన్లు తమ తీర్పు ఎలా ఇవ్వబోతున్నారు? ట్రంప్ సారథ్యంలోని రిపబ్లికన్లకు షాకిస్తారా? లేక అండగా నిలుస్తారా?

అమెరికాలో అధ్యక్షుడి పదవీకాలం నాలుగేళ్లు. ఆ కాలానికి మధ్యలో రెండేళ్లకు జరిగే ఎన్నికలను మధ్యంతర ఎన్నికలంటారు. వీటితో అధ్యక్షుడి ఎన్నికకు ఏం సంబంధం లేదు. అమెరికా పార్లమెంటుతో పాటు... వివిధ రాష్ట్రాలు, స్థానిక సంస్థల్లోని కొన్ని పదవులకు ఈ మధ్యంతరంలో ఎన్నికలవుతాయి. కానీ ప్రతినిధుల సభ, సెనెట్‌కు జరిగే ఎన్నికలే అత్యంత కీలకమైనవి.

ప్రతినిధుల సభలో మొత్తం 435 సీట్లకు ప్రతి రెండేళ్లకోసారి ఎన్నికలు జరుగుతాయి. రాష్ట్రానికి 2 సీట్ల చొప్పున 100 సీట్లుండే సెనెట్‌లో సభ్యుల పదవీకాలం ఆరేళ్లు. అందుకే రెండేళ్లకోసారి 33శాతం సీట్లకు ఎన్నికలవుతాయి. ఈసారి 35 సీట్లకు ఎన్నికలు జరుగుతున్నాయి.

ప్రస్తుతం రెండు సభల్లో రిపబ్లికన్లకే మెజారిటీ ఉంది. ప్రతినిధుల సభలో రిపబ్లికన్లు 218 సీట్లతో అత్తెసరు మెజారిటీతో ఉన్నారు. డెమోక్రాట్లకు 214 సీట్లున్నాయి. ఒక స్వతంత్ర అభ్యర్థి ఉన్నారు. రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి.

రిపబ్లికన్లు, డెమోక్రాట్లకు ఓటర్లలో స్థానికంగా బలమైన మద్దతు కారణంగా ఎవరి స్థానాలను వారు సులువుగా గెలుచుకోగలుగుతారు. కేవలం 21 జిల్లాల్లోనే గట్టి పోటీ ఉంది. వీటిపైనే పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. ఈ 21జిల్లాలలో ప్రస్తుతం 15 రిపబ్లికన్ల ఆధీనంలో, 6 డెమోక్రాట్ల చేతిలో ఉన్నాయి.

ఆరిజోనా, కాలిఫోర్నియా, కొలరాడో, ఫ్లోరిడా, అయోవా, మిషిగన్, న్యూయార్క్, నార్త్ కరోలినా, ఒహాయో, పెన్సిల్వేనియా, టెక్సాస్, వర్జీనియా, విస్కాన్సిన్ రాష్ట్రాలలో గట్టి పోటీ ఉంది.

100 సీట్లు ఉన్న సెనెట్‌లో ప్రస్తుతం రిపబ్లికన్లకు 53 సీట్లున్నాయి. డెమోక్రాట్లకు 45 ఉన్నాయి.

డెమోక్రాట్ల చేతిలో ఉన్న 34, రిపబ్లికన్ల చేతిలో ఉన్న 31 సీట్లకు ఎన్నికలు జరగవు.

ఎన్నికలు జరిగే 35లో 7 సీట్లలోనే గట్టి పోటీ ఉంది. ఇందులో 6 రిపబ్లికన్ల చేతిలో ఒకటి డెమోక్రాట్ల చేతిలో ఉన్నాయి. ఈ 7 సీట్లలో నాలుగింటిని డెమోక్రాట్‌లు గెలుచుకోవాల్సి ఉంది. దీంతోపాటు గెలిచే అవకాశం ఉన్నవి, మొగ్గున్న సీట్లను ఆ పార్టీ గెలుచుకోవాల్సి ఉంటుంది.

సాధారణంగా మధ్యంతర ప్రతినిధుల సభ ఎన్నికల్లో అధ్యక్షుడిపై వ్యతిరేకత కనిపిస్తుంటుంది. 1934 నుంచి ఫలితాలను గమనిస్తే... అధ్యక్షుడి పార్టీ సగటున ప్రతిపక్షానికి 27 సీట్లను కోల్పోయింది. మొత్తం 23 ఎన్నికల్లో కేవలం 3సార్లే అధ్యక్షుడి పార్టీ మెజారిటీ సాధించింది.

రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు ట్రంప్‌నకు 50 శాతానికి కొద్దిగా అటుఇటుగా మద్దతు లభించింది. ఇప్పుడాయనకు ప్రజల్లో మద్దతు 37 శాతంగానే ఉందని సర్వేలు పేర్కొంటున్నాయి.

డెమోక్రాట్లు ఒక సభలోగానీ, రెండు సభల్లోగానీ ఆధిక్యం సాధిస్తే.. ట్రంప్ విధానాలను సవాలు చేయవచ్చు. ట్రంప్ దూకుడుకు కళ్లెం వేయొచ్చు.

అయితే రెండు సభలపై ఆధిక్యం సాధించినా ట్రంప్‌ను అంత సులభంగా అధ్యక్ష పదవి నుంచి డెమోక్రాట్లు తొలగించలేరు. ఆయనను అభిశంసించే అవకాశముంది. కానీ పదవి నుంచి తొలగించే అధికారం ఉండదు. ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు ఆధిక్యం సాధిస్తే.. స్పీకర్ పదవి దక్కుతుంది. అప్పుడు ఏ బిల్లులు సభలో రావాలో ఆ పార్టీ నిర్ణయిస్తుంది. సెనెట్లో గెలిస్తే కమిటీల చైర్మన్ల పదవులను చేపట్టే అవకాశం ఉంది. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి అంశమూ కాంగ్రెస్‌కు వెళ్లే అవకాశం ఉంటుంది. రెండు సభల్లో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే నాయకత్వంపై పట్టు లభిస్తుంది. అప్పుడు తనకు వ్యతిరేకంగా పని చేసే కాంగ్రెస్‌తో ట్రంప్ కలిసి పని చేయాల్సి ఉంటుంది.

ఉక్రెయిన్‌కు స్టార్‌లింక్ మొండిచేయి?

వేగాన్ని కోల్పోయిన ఉక్రెయిన్ డ్రోన్లు

కీవ్, అక్టోబర్ 15 : రష్యాతో ఒప్పందం కుదుర్చుకొని... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన షాక్ నుంచి తేరుకోకముందే... ఎలాన్ మస్క్ కూడా ఉక్రెయిన్‌ను దెబ్బకొట్టారు. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ వాడుతున్న స్టార్‌లింక్ కమ్యూనికేషన్ పరికరాల వినియోగంపై మస్క్ ఆకస్మిక నియంత్రణలు విధించారు. దేశానికి చెందిన కొన్ని డ్రోన్లు వేగాన్ని కోల్పోయాయని ఉక్రెయిన్ పేర్కొంది. మరోవైపు కీవ్‌ను లక్ష్యంగా చేసుకున్న రష్యా క్షిపణుల గురించి పశ్చిమ భాగస్వామ్య దేశాల నుంచి ఎటువంటి ముందస్తు హెచ్చరికలు అందలేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ వెల్లడించారు. మాస్కో నుంచి డీజిల్ దిగుమతుల కోసం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో భవిష్యత్తులో అమెరికా నుంచి అందే సహకారం తగ్గిపోవచ్చని ఉక్రెయిన్ అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఒడంబడిక నేపథ్యంలోనే తమ దేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల వినియోగంపై ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ నియంత్రణలు విధించిందని వారు పేర్కొంటున్నారు.

పుతిన్ కోసమే స్టార్ 'లింక్ తెగిందా'..

● అమెరికా ప్రభుత్వం చేతిలో కీ..!

వాషింగ్టన్, అక్టోబర్ 15 : శాటిలైట్ ఆధారిత స్టార్‌లింక్ సేవల భారత్ ప్రవేశ జాప్యంపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్ర అసహనానికి గురవుతున్నారు. పర్వత ప్రాంతాలు, దట్టమైన అడవుల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా కూడా ఇంటర్నెట్ సేవలు అందుతాయని ఆయన చెప్తున్నప్పటికీ.. నియంత్రణ ఎవరి చేతుల్లో ఉంటుందన్నది ఇక్కడ కీలకం. ఆ సేవలను దేశంలోకి అనుమతిస్తే ఇప్పుడు ఉక్రెయిన్ పట్టిన గతే పడుతుందా..? మన అవసరాలను అమెరికా నియంత్రిస్తుందా..? అనే భయాలు కలుగుతున్నాయి.

ఇటీవల ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చింది. అలాంటి సమయంలో రష్యాతో డీజిల్ ఒప్పందం కుదుర్చుకొని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్‌కు షాకిచ్చారు. అంతలోనే యుద్ధరంగంలో ఉక్రెయిన్ డ్రోన్లు వేగాన్ని కోల్పోయాయి. అమెరికా మద్దతు సన్నగిల్లడంతో రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ వాడుతున్న స్టార్‌లింక్ కమ్యూనికేషన్ పరికరాలపై మస్క్ నియంత్రణలు విధించినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్పేస్ ఎక్స్ సీఈఓ స్పందించారు. ఉక్రెయిన్‌లో ఆంక్షలు విధించింది స్టార్‌షీల్డ్‌పై అని.. స్టార్‌లింక్‌పై కాదని చెప్పారు.

'స్టార్‌షీల్డ్ వ్యవస్థలు అమెరికా ప్రభుత్వ నియంత్రణలో ఉంటాయి. వేగం, వినియోగంపై పరిమితులను అమెరికా సైన్యం నిర్ణయిస్తుంది. అంతిమ నిర్ణయం అధ్యక్షుడి చేతిలో ఉంది. వాణిజ్య అవసరాలకు ఉపయోగించే స్టార్‌లింక్ సేవలు స్పేస్‌ఎక్స్ చేతిలో ఉన్నాయి. దాడుల వంటి సైనికచర్యల కోసం ఈ సేవలను ఉపయోగించడానికి ఒక వాణిజ్య సంస్థకు వీలుకాదు' అని మస్క్ వివరణ ఇచ్చారు. అలాగే ఉక్రెయిన్‌కు సహాయం చేయాల్సిన చట్టపరమైన బాధ్యత తమకు ఏమీ లేదని, అయితే తాము స్వచ్ఛందంగా ముందుకు వచ్చామని నెటిజన్ అడిగిన పోస్టుకు సమాధానం ఇచ్చారు. స్పేస్‌ఎక్స్ ఆదాయంలో ఉక్రెయిన్ నుంచి వచ్చేది స్వల్పభాగమేనని, రష్యా దాడులు, భౌగోళిక రాజకీయ ఒత్తిళ్ల మధ్య పనిచేయడం కంపెనీకి రిస్క్‌తో కూడుకున్న వ్యవహారమని చెప్పారు.

అక్టోబర్ 14 ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా స్టార్‌షీల్డ్‌పై ఆంక్షలు విధించారని ఉక్రెయిన్ వెల్లడించింది. వేగ పరిమితిని తగ్గించాయని పేర్కొంది. ఆ పరిమితిని దాటి ప్రయాణించే ఏ ఆయుధమైనా నెట్‌వర్క్‌తో అనుసంధానాన్ని కోల్పోయింది. అది ఒక సాంకేతిక సమస్య కావొచ్చని భావిస్తున్నట్లు చెప్పిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ దీనివల్ల సైన్యంలో ప్రాణనష్టానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు కీవ్‌ను లక్ష్యంగా చేసుకున్న రష్యా క్షిపణుల గురించి పశ్చిమ భాగస్వామ్య దేశాల నుంచి ఎటువంటి ముందస్తు హెచ్చరికలు అందలేదని చెప్పారు. యుద్ధంలో తమకు ఎంతో కీలకమైన ఈ నెట్‌వర్క్‌ను ఉక్రెయిన్ దళాలు సమాచార మార్పిడి, డ్రోన్ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్నాయి. ఈ నెట్‌వర్క్ నియంత్రణపై మస్క్ వివరణ ఇచ్చారు కానీ.. అమెరికా ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి స్పందనారాలేదు. భారత ప్రభుత్వంపై మస్క్ ఆరోపణలు చేస్తోన్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

స్టార్‌షీల్డ్.. స్టార్‌లింక్ తేడా ఏంటి..?

స్టార్‌లింక్, స్టార్‌షీల్డ్ రెండూ స్పేస్‌ఎక్స్ ఆధ్వర్యంలో నడిచేవే. రెండింటిలో ఉపయోగించే ఉపగ్రహ నెట్‌వర్క్ ఒకటే అయినా.. పనితీరు, నియంత్రణ విషయంలో తేడాలు ఉన్నాయి. స్టార్‌లింక్ సాధారణ వినియోగదారులు, వ్యాపారాలు, రక్షణ పరమైన సమాచార మార్పిడి కోసం రూపొందించిన ఇంటర్‌నెట్ వ్యవస్థ. దీనిని పూర్తిగా స్పేస్‌ఎక్స్ నియంత్రిస్తోంది. స్టార్‌షీల్డ్ పూర్తిగా సైనిక అవసరాల కోసం తీర్చిదిద్దినది. జాతీయ భద్రత, ప్రభుత్వ నిధూ సంస్థల కోసం దీనిని అమెరికా ప్రభుత్వం వాడుతోంది.

యువ జిమ్నాస్ట్‌ల నగ్న వీడియోలు...

చిత్రీకరించిన కోచ్.. 90 ఏళ్ల జైలు

మిసిసిపీ, అక్టోబర్ 15 : యువ జిమ్నాస్ట్‌ల నగ్న వీడియోలు రహస్యంగా చిత్రీకరించిన కోచ్‌కు అమెరికా న్యాయస్థానం 90 ఏళ్ల జైలు శిక్ష విధించింది. మిసిసిపీ రాష్ట్రంలోని పెర్విస్‌లో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నేరస్థుడు షాన్ గార్డనర్ తన జిమ్నాస్టిక్స్ శిక్షణ కేంద్రంలోని బాత్రూంలో రహస్య కెమెరా ఏర్పాటు చేసి యువతుల వీడియోలు తీసినట్లు దర్యాప్తులో తేలింది.

2017 డిసెంబరు నుంచి 2018 ఏప్రిల్ మధ్య ఈ దారుణాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. దాదాపు పది మంది మైనర్ల వీడియోలను అతడు రికార్డ్ చేసినట్లు తెలిసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం అతడికి సుదీర్ఘ జైలు శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. గార్డనర్ గతంలో ఓ జిమ్నాస్టిక్స్ అండ్ డ్యాన్స్

ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేశాడు. అప్పుడు కూడా అతడు విద్యార్థినులు వేధించినట్లు ఫిర్యాదులు వచ్చాయని పోలీసులు వెల్లడించారు.

కోలుకుంటున్న పోప్ జర్నలిస్టులా.. రీల్స్ చేసేవాళ్లా? తెలియట్లేదు

రోమ్, అక్టోబర్ 15 : ఊపిరితిత్తుల్లో పెరిగిన క్యాన్సర్ కణితిని తొలగించేందుకు శస్త్ర చికిత్స చేయించుకున్న పోప్ లియో-14 కోలుకుంటున్నారు. మంగళవారం శస్త్ర చికిత్స చేయించుకున్న వాటికన్ అధినేత బుధవారంకల్లా నడక, ఊపిరితిత్తుల కసరత్తులు ప్రారంభించారని, క్రమబద్ధంగా ఆహారం తీసుకుంటున్నారని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం ఆయన కోలుకుంటున్న పద్ధతి సజావుగా ఉన్నట్లు ఎక్స్‌రే, రక్త పరీక్షలు తెలియజేస్తున్నాయని వెల్లడించారు. 71 సంవత్సరాల పోప్ అడినో కార్సినోమా అనే సాధారణ ఊపిరితిత్తుల క్యాన్సర్ బారినపడ్డారు. ఈ వ్యాధి ఇతర శరీర భాగాలకు వ్యాప్తి చెందిందా అన్నది గుర్తించేందుకు ఇంకా వైద్య పరీక్షలు నిర్వహించాల్సి వుంది. పోప్ లియో -14కు నిర్వహించిన శస్త్ర చికిత్స విజయవంతం కావడంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు.

● ఢిల్లీ ఆందోళనలపై కేంద్రం

ఢిల్లీ, అక్టోబర్ 15 : సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆందోళనల సమయంలో కొందరు మహిళా జర్నలిస్టులపై వేధింపులు జరిగినట్లు

ఆరోపణలు వచ్చాయి. దీంతో నిరసనల వేళ మహిళా విలేకరులకు రక్షణ కల్పించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మధ్య జర్నలిస్టులెవరో.. రీల్స్ చేసే వాళ్లు ఎవరో తెలియట్లేదని అన్నారు. 'ఆందోళనల సమయంలో చాలా మంది మైక్ పట్టుకుని కన్పిస్తున్నారు. వీడియోలు రికార్డ్ చేసి రీల్స్ అప్లోడ్ చేస్తామని కొందరు చెబుతున్నారు. జర్నలిస్టులమని ఎవరూ అసభ్య ప్రవర్తనకు గురికాకూడదు' అని కేంద్రం తరపున తుషార్ మెహతా పేర్కొన్నారు.

ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. మహిళా జర్నలిస్టులపై పోలీసుల వేధింపుల ఆరోపణలు చాలా తీవ్రమైన అంశమని అభిప్రాయపడింది. దీనిపై విచారణకు కమిటీని ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తామని వెల్లడించింది. కమిటీలో రిటైర్డ్ మహిళా న్యాయమూర్తులు, విశ్రాంత ఐపీఎస్ అధికారులు ఉంటారని చెప్పారు.

మరోసారి తెరపైకి అంకిత కేసు

● ఆయన్ను గవర్నర్‌గా నియమిస్తారా?

● ఇండియా గేట్ వద్ద తల్లిదండ్రుల ఆందోళన.. నిర్బంధం

ఢిల్లీ, అక్టోబర్ 15 : ఒక రిసార్టులో రిసెప్షనిస్టుగా చేరిన నెలరోజులకే అదృశ్యమై కెనాల్లో విగతజీవిగా కనిపించిన అంకితా భండారీ కేసు మరోసారి వార్తల్లో నిలిచింది. తమ కుమార్తె మృతి కేసులో న్యాయం చేయాలంటూ బుధవారం అంకిత తల్లిదండ్రులు ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద నిరసనలు చేపట్టగా.. గురువారం తెల్లవారుజామున పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నిరసనలకు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే. బీజేపీ నేత దుష్యంత్ కుమార్ గౌతమ్ ను సిక్కిం గవర్నర్ గా నియమించడమే ఈ నిరసనలకు కారణం.

ఉత్తరాఖండ్‌లోని పౌడీ గఢ్వాల్ జిల్లా డోబ్-శ్రీకోట్ గ్రామానికి చెందిన అంకితా భండారీ (19) రుషికేశ్ సమీపంలోని ఒక రిసార్టులో 2022 ఆగస్టులో రిసెప్షనిస్టుగా చేరింది. ఆ రిసార్టును అప్పటి బీజేపీ సీనియర్ నేత వినోద్ ఆర్య కుమారుడు పులకిత్ ఆర్య నిర్వహించేవాడు. విధుల్లో చేరిన నెల రోజులకే అంకిత కనిపించకుండా పోయింది. రిసార్టుకు వచ్చే వీఐపీ అతిథుల కోసం 'ప్రత్యేక సేవలు' చేయడానికి నిరాకరించడం ఆమె ప్రాణాల మీదకు తెచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ 'ప్రత్యేక సేవల' విషయంలో పులకిత్ తో పాటు అతడి ఇద్దరు సహాయకులు ఆమెపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అది చివరకు ఘర్షణకు దారి తీసింది. అంకితను బలవంతంగా ఒక వాహనంలో తీసుకువెళ్లి, రుషికేశ్ సమీపంలోని చిల్లా కెనాల్లో పడేశారు. తర్వాత ఏమీ తెలియనట్లు వెనక్కు వచ్చేశారు. రిసార్టులో జరుగుతున్నదంతా అంకిత తన స్నేహితుడికి ముందే చెప్పి ఉండటంతో.. ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అతడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరు రోజుల తర్వాత కాలువలో అంకిత మృతదేహాన్ని గుర్తించారు. ఈ కేసులో ముగ్గురు దోషులకు న్యాయస్థానం జీవితఖైదు విధించింది.

ఆ వీఐపీ దుష్యంత్ అని మృతురాలి తండ్రి గతంలో ఆరోపించారు. అంకిత హత్య కేసులో ప్రస్తుతం సీబీఐ (ఇఆఐ) దర్యాప్తు కొనసాగుతోంది. ఇలాంటి సమయంలో దుష్యంత్ గౌతమ్ ను సిక్కిం గవర్నర్గా నియమించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఈ కేసు నుంచి రాజ్యాంగ రక్షణ కల్పించిందని, దర్యాప్తును నీరుగార్చిందని ఆమె కుటుంబం, విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఆ నియామకాన్ని వ్యతిరేకిస్తూ అంకిత కుటుంబ సభ్యులు ఇండియా గేట్ వద్ద నిరసనకు దిగారు. వారిని తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత వారిని తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. తల్లిదండ్రులతో పాటు పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో పవన్ ఖేడా, జోతిమణి, ఇమ్రాన్ ప్రతాప్ గఢీ ఉన్నారు. వారంతా స్టేషన్లోనే నిరసన చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి గవర్నర్ అయితే.. మృతురాలి తల్లిదండ్రులను జైలుకు పంపుతారా? విపక్ష నేతలు ప్రశ్నించారు.

న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు

సుప్రీం వరకు పాదయాత్రలా?

రాహుల్ గాంధీపై ధర్మాసనం ఆగ్రహం

ఢిల్లీ, అక్టోబర్ 15 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలతో కలిసి రాహుల్ సుప్రీంకోర్టు వరకు పాదయాత్రగా వెళ్లి, అక్కడ నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిని తీవ్రంగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం.. ఆయన వివరణ ఇవ్వాల్సిందేనని ఆదేశించింది. ఇలాంటి చర్యల ద్వారా న్యాయవ్యవస్థను బెదిరించలేరని మందలించింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండును మరింత బలంగా వినిపిస్తూ.. 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరిట సోమవారం ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు వరకు మార్చ్ చేపట్టారు. వీరికి మద్దతుగా వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం సర్ ప్రక్రియపై ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నిస్తూ సుప్రీంలో పిటిషన్ వేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేంద్రం, ఎన్నికల సంఘానికి న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. అయితే, నోటీసులు ఇవ్వడమంటే.. రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని ధర్మాసనం ఈ సందర్భంగా పేర్కొంది.

'రాజకీయ పాదయాత్రలు న్యాయస్థానం వరకు రావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇలాంటివి జరగకూడదు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు. ఇవన్నీ కోర్టుపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలే. ఇలాంటి బలహీన చర్యలను ఎవరూ పట్టించుకోరు' అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే పాదయాత్రకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల విచారణలో భాగంగా రాహుల్ గాంధీ, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ కు నోటీసులు ఇచ్చింది. కోర్టు ప్రాంగణంలో నిరసనలకు సంబంధించిన రికార్డింగులను భద్రపర్చాలని పోలీసులను ఆదేశించింది.

ఇమ్రాన్ ఖాన్.. భారత్ నుంచి వెళ్లిపో..

పోలీసుల నోటీసులు

ఢిల్లీ, అక్టోబర్ 15 : ఆమిర్ ఖాన్ మేనల్లుడు, నటుడు ఇమ్రాన్ ఖాన్ కు ముంబయి పోలీసులు నోటీసులు జారీ చేశారు. అమెరికా పౌరసత్వం కలిగిన అతడు.. అక్టోబర్ 28లోగా భారత్ విడిచి వెళ్లాలని పోలీసులు ఆదేశించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సీజేపీ నిరసనల్లో ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్న క్రమంలో తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

ఇటీవల ముంబయిలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలో పాల్గొన్నందుకు ఇమ్రా భాజపా నాయకుడు కిరీట్ సోమయ్య ఫిర్యాదు చేశారు. ఇమ్రాన్ ఖాన్ అమెరికా పౌరుడని, అతడు నిబంధనలు ఉల్లంఘించాడని ఆరోపించారు. విదేశీ పౌరుడైన ఇమ్రాన్ ఖాన్ ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా, వీసా నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ అతడిపై చర్యలు తీసుకోవాలని కిరీట్ డిమాండ్ చేశారు. కాగా.. ఆందోళనల వేళ ఇమ్రాన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని ఆ తర్వాత విడుదల చేశారు. ఇమ్రాన్ ఖాన్ కు నోటీసులు రావడంపై భాజపా నేత కిరీట్ సోమయ్య స్పందించారు. పోలీసులు తీసుకున్న చర్యను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఇమ్రాన్ను ఉద్దేశించి మాట్లాడారు. 'పాకిస్థాన్ నుంచి నిధులు తీసుకున్న అమెరికా పౌరుడు ఇమ్రాన్ ఖాన్.. మన దేశంలో అల్లర్లను వ్యాప్తి చేయడానికి విదేశీశక్తులతో కుట్ర పన్నుతున్నాడు. అందుకే నేను అతడిపై ఫిర్యాదు చేశాను. ఇప్పుడు అతడు అక్టోబర్ 28లోపు కచ్చితంగా భారతదేశం విడిచి వెళ్లాలి' అని అన్నారు.

పనిచేసే వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయి

- నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మంత్రి ఉత్తమ్
- మంత్రి అండగా నిధులు వరదలా వస్తాయి
- వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్ పర్సన్‌గా చలసాని స్పందన రాజీవ్ బాధ్యతల స్వీకరణ
- రాష్ట్ర పెరిక సంఘం కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు

నేరేడుచర్ల, అక్టోబర్ 15 (మనం న్యూస్): పదవులు ఆశించకుండా కష్టపడి పనిచేసే వారికి ఆ పదవులు వెతుక్కుంటూ వస్తాయని చెప్పడానికి నిదర్శనం చలసాని కుటుంబం అని రాష్ట్ర పెరిక సంఘం కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు అన్నారు. నేరేడుచర్ల పాలక వీడు ఉమ్మడి మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కార్యాలయం నందు గురువారం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్ పర్సన్ గా చలసాని స్పందన రాజీవ్, వైస్ చైర్మన్ గా పాలకవీడు మండలం గుడు గుంట్ల పాలెం గ్రామానికి చెందిన మునగాల భాస్కర్ రెడ్డి తో పాటు 11 మంది డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ సెక్రటరీ సన్నీ రికార్డులపై సిగ్నేచర్ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి నేరేడుచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పురపాలక చైర్మన్ అయిన కొనతం చిన్న వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రం ఎల్లినినో ప్రభావంతో ఉన్నప్పటికీ మన ప్రాంత రైతులు నీటి కోసం పడుతున్న ఇబ్బందులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి మన ప్రాంతం రైతుల అభివృద్ధి ధ్యేయంగా ఈనెల 12వ తారీకు సాగర్ నీటిని విడుదల చేయడం జరిగింది. సభాధ్యక్షులు కొనతం చిన్న వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2006వ సంవత్సరంలో రాష్ట్రంలో అతి పెద్ద వయసుకుడిగా నేను మార్కెట్ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టారని పార్టీని నమ్ముకుంటే నేను ఈ స్థాయికి వచ్చానని నేడు పదవి బాధ్యతలు చేపట్టిన చలసాని స్పందన రాజీవ్ చిన్న వయసు వారిని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని మనస్ఫూర్తిగా కోరారు. హుజూర్నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో నేను హుజూర్నగర్ మార్కెట్ చైర్మన్ గా పని చేశానని నిధులు తక్కువగా ఉంటాయని పని ఎక్కువగా ఉంటుందని కానీ మన మంత్రి ఉత్తమ్ అండగా ఉంటే నిధులు వరదల వస్తాయని అవకాశాన్ని అందిపుచ్చుకొని మార్కెట్ అభివృద్ధికి రైతుల శ్రేయస్సు కోసం కష్టపడి చేయాలని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన చైర్మన్ రంగినేని స్పందన రాజీవ్ అన్నారు...ఈ సందర్భంగా చలసాని రాజీవ్ మాట్లాడుతూ.. మా నాయనమ్మ చలసాని జగదాంబ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నో సంవత్సరాలు జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారని ఆమె వారసత్వాన్ని అందిపుచ్చుకొని లక్షరాది రూపాయల సంపాదన సైతం అమెరికాలో వదులుకొని ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో సొంత డబ్బులు ఖర్చు పెట్టుకొని పని చేస్తున్నామని ప్రజల ఆశీస్సులతో నేడు మార్కెట్ చైర్మన్ పదవి దక్కిందని ఉత్తమ్ సార్ అడుగుజాడలలో నడుస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్,కోతి సంపత్ రెడ్డి, అరుణ్ కుమార్ దేశముఖ్, నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి,మోతిలాల్,గోపాల్ నాయక్,నుబ్బారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెల్లంకొండ విజయలక్ష్మి నరసింహారావు,పెండెం శ్రీనివాస్ గౌడ్, బొలిశెట్టి లక్ష్మయ్య, కొనతం మంజులారెడ్డి, తాళ్ల సురేష్ రెడ్డి, నూకల సుగుణమ్మ బైరెడ్డి జితేందర్ రెడ్డి రెడ్డాపంగ నాగయ్య,, రెండు మండలాల సర్పంచులు, ఉప సర్పంచు లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి భరోసా!

- ఐదు మండలాల్లో 62 మంది లబ్ధిదారులకు రూ.71.92 లక్షల చెక్కుల పంపిణీ
- నిరుపేద కుటుంబాలకు అండగా ప్రజా ప్రభుత్వం
- ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ, అక్టోబర్ 15(మనం న్యూస్): పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ద్వారా అర్హులకు ఆర్థిక సహాయం అందిస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. దేవరకొండ, డిండి, నేరేడుగొమ్ము, చందంపేట, కొండమల్లేపల్లి మండలాలకు చెందిన 62 మంది లబ్ధిదారులకు రూ.71,92,000 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆడబిడ్డల వివాహాల కోసం అందించే ఆర్థిక సహాయం నిరుపేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. రైతులు, మహిళలు, పేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిక్కు నాయక్, నెర్మటి సతీష్ రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, దొండేటి మల్లారెడ్డి, మావిల్ల లక్ష్మినారాయణ, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జర్పుల బధ్యా నాయక్, కిన్నెర హరికృష్ణ, కొర్ర రాంసింగ్, రామావత్ లాలునాయక్, కొప్పుల సురేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీలు ఓటరు నమోదు ప్రక్రియకు సహకరించాలి

సూర్యాపేట, అక్టోబర్ 15 (మనం ప్రతినిధి): గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు ఓటర్ నమోదు ప్రక్రియకు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు నమోదు ప్రక్రియ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ పురోగతి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్టోబర్ 15, 16 తేదీలలో నిర్వహించే ప్రత్యేక ప్రచార దినాల్లో ఆయా రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు చురుకుగా పాల్గొని, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6 నింపడంలో సంబంధిత అధికారులకు, ఓటర్లకు సహకరించాలని కోరారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణకు సంబంధించి పెండింగ్లో ఉన్న పనులను నిర్ణీత గడువులోగా, నవంబర్ 5వ తేదీలోపు పూర్తి చేసేలా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సూచించారు. అలాగే, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-18ను ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ విధానంలో సమర్పించవచ్చని తెలిపారు. ఫారం-18 దరఖాస్తుల పరిశీలన, ప్రాసెసింగ్ ప్రక్రియ ఏఈఆర్ఓ స్థాయిలో ఇప్పటికే ప్రారంభమైనందున, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులకు ఈ విషయాన్ని విస్తృతంగా తెలియజేసి, ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు ఎన్నికల అధికారులకు సహకరించి, ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, రాజకీయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పత్తితో మద్దతు ధర జిల్లా కలెక్టర్

2026-27 పత్తి మార్కెటింగ్ సీజన్లో రైతులు నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేసి, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందేలా తగిన జాగ్రత్తలు పాటించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. పత్తి సాగు, కోత, నిల్వ, విక్రయ ప్రక్రియల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే ఆశించిన మద్దతు ధర లభిస్తుందని స్పష్టం చేశారు. నాణ్యతతోనే మంచి మద్దతు ధర.రైతులు తమ పత్తిని మార్కెట్కు తీసుకువచ్చే ముందు తేమ శాతం, పొడవు, మైక్రోనైర్ విలువ వంటి ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోరారు. పత్తిలో తేమ గరిష్ఠంగా 8 శాతం మాత్రమే ఉండేలా బాగా ఆరబెట్టాలని, పత్తిలో ఆకులు, చెత్త ఇతర వ్యర్థ పదార్థాలు కలవకుండా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.పత్తి నాణ్యత ఆధారంగానే కొనుగోలు ధర నిర్ణయించబడుతుందని, రైతులు వ్యవసాయ శాఖ అధికారులు మరియు కొనుగోలు కేంద్రాల సిబ్బంది సూచనలను అనుసరించాలని పేర్కొన్నారు. పత్తిని బాగా ఆరబెట్టి, శుభ్రం చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. విక్రయ సమయానికి ఆధార్ కార్డ్, బ్యాంకు ఖాతా పుస్తకం, భూ రికార్డుల పహాణీ/పట్టాదార్ పాస్ పుస్తకం వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత కోసం అధికారుల సూచనల ప్రకారం నమోదు (రిజిస్ట్రేషన్) ప్రక్రియను పూర్తి చేయాలని, కేంద్రాల్లో జరిగే నాణ్యతా పరీక్షలు, తూకం, చెల్లింపుల ప్రక్రియల్లో ప్రభుత్వ నిబంధనలకు సహకరించాలని కోరారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పత్తి విక్రయాల్లో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు విధానాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కొనుగోలు ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను గానీ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను గానీ సంప్రదించాలని కోరారు. రైతుల సంక్షేమం, నాణ్యమైన పత్తి ఉత్పత్తి మరియు సరైన ధర కల్పించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ బి హరి సింగ్ ఆర్డివోస్ సూర్యాపేట కోదాడ హుజూర్నగర్ వేణు మాధవరావు సూర్యనారాయణ శ్రీనివాసులు ఆర్టీవో పురుషోత్తం రెడ్డి డిఎంఒ దామోదర్, హార్టికల్చర్ ఆఫీసర్ నాగయ్య డీఎస్పీలు, కార్యదర్శులు, మిల్లర్లు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాసారం గుట్టపై అక్రమ మైనింగ్ ఆపాలి



- మైనింగ్ లీజు రద్దు చేసి గ్రామపంచాయతీకి అప్పగించాలి
- నాలుగు రోజులుగా గ్రామస్థుల నిరాహార దీక్ష
- సీపీఐ నేత నూనె రామస్వామి డిమాండ్

దేవరకొండ, అక్టోబర్ 15 (మనం న్యూస్): దేవరకొండ మండలం కాసారం గ్రామంలో మైనింగ్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలు నాలుగు రోజులుగా టెంట్ వేసి నిర్వహిస్తున్న నిరాహార దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. సర్వే నంబర్ 13లోని 183 ఎకరాల పలుగురాయి గుట్టలో మైనింగ్ నిర్వహిస్తున్నారని, ఈ భూముల్లో గ్రామ రైతులకు పట్టాలు కూడా ఉన్నాయని తెలిపారు. నవభారత్ కంపెనీ 1987లో మొదటి దశ పనులు ప్రారంభించి 1997 వరకు కొనసాగించిందని, అనంతరం 1999 నుంచి 2017 వరకు తవ్వకాలు నిర్వహించిందని పేర్కొన్నారు. ఈ తవ్వకాల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆయన ఆరోపించారు.

కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు..

మైనింగ్ నుంచి వెలువడే రాతి పొడి గాలిలో కలవడంతో గ్రామ ప్రజలు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని రామస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి వనరులు కలుషితమవుతున్నాయని, బ్లాస్టింగ్ కారణంగా భూమి కంపించి బోర్లు, బావులు ఎండిపోతున్నాయని ఆరోపించారు. గుట్ట చుట్టూ గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేస్తామని, గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు చేపడతామని కంపెనీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు.

లీజు రద్దు చేయాలి..

ప్రభుత్వం తక్షణమే స్పందించి మైనింగ్ కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపించాలని నూనె రామస్వామి కోరారు. నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకొని మైనింగ్ లీజును రద్దు చేయాలని, గుట్టను గ్రామపంచాయతీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, నీటి వనరులను పరిరక్షించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంఘం దేవరకొండ నియోజకవర్గ నాయకుడు చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి అలమురి మల్లయ్య, గ్రామ సర్పంచ్ ముదిగొండ శామలయ్య, ఉపసర్పంచ్ పోతురాజు మల్లేష్, ముదిగొండ అరుణ, సాలయ్య, ముదిగొండ సరిత, సైదయ్య, సీనయ్య, బాలకృష్ణ, జంగయ్య, పెద్దమ్మ, ప్రేమ్ సాగర్, మస్తాన్, అంజిబాబు, రాములమ్మ, ముత్యాలు, పుష్పమ్మ, కొండమ్మ, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కేంద్రం ప్రారంభం

సూర్యాపేట, అక్టోబర్ 15 (మనం ప్రతినిధి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా గురువారం పట్టణంలోని 48వ వార్డులో సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సహాయ కేంద్రాన్ని ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పేట మున్సిపల్ చైర్పర్సన్ మారిశెట్టి నివేదిత ఈ సందర్భంగా పటేల్ మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడం బాధ్యతగా భావించాలని సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియపై పట్టభద్రులకు అవగాహన కల్పించడంతో పాటు, నమోదు సమయంలో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఇలాంటి సహాయ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పట్టభద్రులంతా ఐక్యంగా ముందుకు వచ్చి ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీ ముదిరెడ్డి రమణ రెడ్డి గారు, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ షఫీ ఉల్లా గారు, వార్డు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మనందరి బాధ్యత

- జిల్లాలోని 45 బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు
- హెచ్చరిక బోర్డులు ప్రారంభించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఎస్పీ కె నరసింహ

సూర్యాపేట, అక్టోబర్ 15 (మనం ప్రతినిధి): రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని అంజనాపురి చౌరస్తా వద్ద రోడ్డు ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లాలో రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల ట్రాఫిక్ నివారణ లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ జిల్లా ఎస్పీ నర్సింహ ఆధ్వర్యంలో అనేక చర్యలు చేపడుతున్నారని అన్నారు. పేట జిల్లా వ్యాప్తంగా రహదారి ప్రమాదాలను అరికట్టడానికి ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడానికి జిల్లా యంత్రాంగం పోలీస్ శాఖ సంయుక్తంగా ముమ్మర చర్యలు చేపడుతున్నాయి వాహనదారులు ఈ ప్రాంతాల గుండా వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూసేందుకు అక్కడ ప్రత్యేకమైన ట్రాఫిక్ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో కూడా స్పష్టంగా కనిపించేలా ఈ బోర్డులపై రేడియం స్టిక్కర్లతో కూడిన ముఖ్యమైన వివరాలను రూపొందించారు. వాహనదారులు మరియు ప్రయాణికులు రహదారులపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా వేగ పరిమితిని దాటకుండా జాగ్రత్త వహించాలని, తమ ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.ఈ నంబర్కు కాల్ చేస్తే వెంటనే పోలీస్ మరియు అత్యవసర సేవలు లభిస్తాయి. అంతేకాకుండా, ప్రమాదం జరిగిన స్థలంలోనే తక్షణ సహాయం కోసం సంబంధిత స్థానిక అధికారుల ఫోన్ నంబర్లను కూడా ఈ హెచ్చరిక బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించారు అన్నారు. అనంతరం ఎస్పీ నరసింహ మాట్లాడుతూ... సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలు జరిగే అవకాశమున్న ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, వాహనదారుల సురక్షిత ప్రయాణం కోసం ప్రత్యేక హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ హెచ్చరిక బోర్డులను ప్రారంభించినట్లు వెల్లడించారు. జిల్లాలోని జాతీయ రహదారులలో ఎక్కడైతే ప్రమాదాలు జరిగే అవకాశముందో (బ్లాక్ స్పాట్స్) అటువంటి 45 ప్రాంతాలను గుర్తించాము. ప్రతి బ్లాక్ స్పాట్కు ఇరువైపులా 100 మీటర్ల పరిధిలో రోడ్డు వినియోగదారుల క్షేమం కోసం ప్రతి స్పాట్ వద్ద రెండు బోర్డుల చొప్పున ఏర్పాటు చేయడం జరిగింది. రాబోయే దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పండుగల సమయంలో రహదారులపై ప్రజల రాకపోకలు, వాహనాల రద్దీ పెద్ద ఎత్తున ఉంటుంది. ప్రయాణికులు హెచ్చరిక బోర్డులను గమనిస్తూ ప్రమాదకర ప్రాంతాలలో వాహనాలను నెమ్మదిగా, జాగ్రత్తగా నడపాలి అన్నారు వాహనదారులు డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులను పాటిస్తూ, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకుండా సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలి. 'అరైవ్ అలైవ్' (సురక్షితంగా గమ్యం చేరుకోవడం) అనే లక్ష్యంతో నెమ్మదిగా ప్రయాణించి, తమను తాము కాపాడుకుంటూ ఇతరులను కూడా ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ కోతలతో రైతుల కన్నీళ్లు!

సింగరేణిని దెబ్బతీస్తూ తెలంగాణను చీకట్లోకి నెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బొగ్గు నిల్వలపై శ్వేతపత్రం విడుదల చేయాలి.. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

కొండమల్లేపల్లి మండలం, అక్టోబర్ 15 (మనం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కొండమల్లేపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలతో ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని, రైతులు అర్ధరాత్రి వేళల్లోనూ పొలాల వద్ద విద్యుత్ కోసం వేచి ఉండాల్సి వస్తోందని అన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల కాలిపోయిన వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయాలని, పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ కోతలకు కారణాలేంటి?

రాష్ట్రంలో విద్యుత్ కోతలకు అసలు కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని రవీంద్ర కుమార్ ప్రశ్నించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో ఎందుకు పనిచేయడం లేదో ప్రజలకు వివరించాలని కోరారు. వాతావరణ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం వల్ల విద్యుత్ అవసరాలు మారుతున్నట్లయితే ముందస్తు ప్రణాళికలు రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులను చేపట్టామని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఈ మౌలిక సదుపాయాలను సమర్థంగా వినియోగించు కోవాలని సూచించారు.

సింగరేణిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

తెలంగాణ విద్యుత్ వ్యవస్థకు సింగరేణి బొగ్గు సరఫరా కీలకమని రవీంద్ర కుమార్ అన్నారు. బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, సరఫరా, ఆర్థిక లావాదేవీలపై ప్రభుత్వం పూర్తి వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరాపై తాజా గణాంకాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు. సింగరేణి వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణకు సంబంధించి ఏవైనా ప్రతిపాదనలు ఉన్నాయా అనే అంశంపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల హక్కులు, సంస్థ ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

విద్యుత్ కోతలతో పంటలు నష్టపోతున్న రైతులకు పరిహారం అందించాలని రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఎన్ని గంటలు సరఫరా చేస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా కోసం గడువుతో కూడిన కార్యాచరణ ప్రకటించాలని అన్నారు. సింగరేణిని పరిరక్షించడం, విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడం, రైతుల పంటలను కాపాడటం ప్రభుత్వ బాధ్యతలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించి రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దాస్రు నాయక్, సర్పంచులు రమావత్ తులసీరామ్, రమావత్ దీప్లా నాయక్, అర్వపల్లి నర్సింహ, గుండెబోయిన ల

సింగరేణి కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

- మెరుగైన వైద్య సేవలు, కొత్త ఉద్యోగాలు
- సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి, అక్టోబర్ 15 మనం న్యూస్: సింగరేణి కార్మికుల సంక్షేమం, భూపాలపల్లి అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు . గురువారం నాడు క్యాంపు కార్యాలయం లో ఆయన విలేకరుల తో మాట్లాడుతూ సింగరేణి కార్మికుల ఆదాయపు పన్నును కంపెనీ ద్వారా చెల్లించే అంశంతో పాటు, డిస్మిస్ అయిన కార్మికులకు తిరిగి ఉద్యోగాలు, కార్మిక కుటుంబాలకు ఇంటి స్థలాలు, ఏరియా ఆసుపత్రిలో సూపర్ స్పెషలిటీ వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో రహదారుల విస్తరణకు రూ.73 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో సింగరేణి కార్మికుల సమస్యలు, పట్టణ అభివృద్ధి అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కార్మికుల హక్కులను కాపాడటంతో పాటు, వారికి మెరుగైన వైద్య సదుపాయాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సింగరేణి కార్మికుల జీతాల నుంచి ప్రతి నెలా ఆదాయపు పన్ను రూపంలో పెద్ద మొత్తంలో డబ్బులు కట్ అవుతున్నాయని, ఆ భారాన్ని కంపెనీ భరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు దసరా బోనస్గా ఈ ఏడాది 1,754 కోట్లు ప్రకటించినట్లు, ఒక్కో కార్మికుడికి సుమారు 1.53 లక్షలు అందించినట్లు వివరించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికుల సంఖ్య తగ్గిందని ఆరోపించిన ఆయన, బొగ్గు గనుల అభివృద్ధి, కొత్త ఓపెన్కాస్ట్ ప్రాజెక్టుల ప్రారంభం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచుతామని తెలిపారు. డిస్మిస్ అయిన కార్మికులకు తిరిగి ఉద్యోగాలు కల్పించే అంశంపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోందని పేర్కొన్నారు. సింగరేణి కార్మిక కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. అర్హతలను బట్టి ఒక్కో కార్మిక కుటుంబానికి 250 గజాల వరకు స్థలం అందించే ప్రతిపాదనను ప్రస్తావించారు. కార్మికుల వైద్య ఖర్చుల కోసం 25 లక్షల వరకు వైద్య సదుపాయాలు కల్పించే అంశాన్ని కూడా వివరించారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో క్యాథ్ల్యాబ్, కార్డియాక్ యూనిట్ ఏర్పాటు చేయడంతో పాటు యూరాలజీ, నెఫ్రాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్ తదితర విభాగాలకు నిపుణులైన వైద్యులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు.

భూపాలపల్లి అభివృద్ధికి 73 కోట్లు

భూపాలపల్లి పట్టణంలో రహదారుల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధికి 73 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ఓసీటు వరకు, అంబేద్కర్ సెంటర్ నుంచి సింగరేణి గ్రౌండ్ వరకు 80 అడుగుల రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రహదారుల విస్తరణకు ప్రజలు సహకరించాలని కోరారు. భూపాలపల్లి జూనియర్ కళాశాల అభివృద్ధికి 3 కోట్ల నిధులు, విద్యార్థుల కోసం అదనపు గదులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కళాశాల విద్యార్థుల రవాణా కోసం రెండు బస్సులను అందించనున్నట్లు పేర్కొన్నారు.

డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి

జిల్లాలో డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులను స్థానిక ప్రాంతాల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు భూమి కేటాయింపు, పారిశ్రామిక ప్రాంతాల సమీపంలోని ప్రజల సమస్యల పరిష్కారం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు.

బీఆర్ఎస్పై విమర్శలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సింగరేణిపై అప్పుల భారం పెరిగిందని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు. కార్మికుల సమస్యలను గత ప్రభుత్వం పరిష్కరించలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని, భూపాలపల్లి అభివృద్ధిని వేగవంతం చేస్తుందని తెలిపారు. మొత్తంగా సింగరేణి కార్మికుల సంక్షేమం, వైద్య సదుపాయాల మెరుగుదల, ఉద్యోగాల కల్పన, రహదారుల విస్తరణ, విద్యా రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని కాంగ్రెస్ నాయకుడు స్పష్టం చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్

జనగామ, అక్టోబర్ 15 (మనం ప్రతినిధి): వరంగల్లో నిర్వహించిన వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో జనగామ మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, సీతక్క, రాజ్యసభ సభ్యులు వేమ్ నరేందర్రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి ఎన్నికల ప్రచార కార్యాచరణ, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పట్టభద్రుల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించండి

బిఆర్ఎస్ జిల్లా యువజన నాయకులు శాస్త్రాల రాజు పిలుపు

టేకుమట్ల, అక్టోబర్ 15 మనం న్యూస్: రాబోయే శాసనమండలి ఎమ్మెల్సీ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికలలో, విద్యార్థుల హక్కుల కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే విద్యావేత్త, ఏనుగుల రాకేష్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు శాస్త్రాల రాజు పట్టభద్రులకు, మేధావులకు, విద్యావంతులకు పిలుపునిచ్చారు. ఏనుగుల రాకేష్ రెడ్డి పదవులు ఉన్నా, లేకున్నా ఎల్లప్పుడూ ప్రజల వైపే నిలబడ్డారు. నిరుద్యోగ యువత, విద్యార్థుల సమస్యలపై అసమానమైన పోరాటం చేస్తూ వారికి అండగా నిలిచారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి, నిరుద్యోగుల గొంతుకగా మండలిలో గళం విప్పడానికి ఆయనలాంటి ఉన్నత విద్యావంతుడు, నిబద్ధత గల నాయకుడు శాసనమండలికి ఎన్నికవ్వడం అత్యంత ఆవశ్యకం. అని ఆయన అన్నారు. విద్యార్థుల

సమస్యలు, ఫీజు రీయింబర్స్మెంట్, నోటిఫికేషన్ల సాధన కోసం నిరంతరం పోరాడటం.

నిజమైన ప్రజానాయకుడు: అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై సమరం చేయగలడని అన్నారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండటం ఆయన లక్ష్య మని అన్నారు.

పకడ్బందీగా బతుకమ్మ ఏర్పాట్లు చేయాలి

- ఆడపడుచుల ఆనందోత్సాహాలను ప్రపంచానికి చాటి చెప్పాలి
- టేకుమట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షు డు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి

టేకుమట్ల, అక్టోబర్ 15, మనం న్యూస్: భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతికగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కాంగ్రెస్ మండల నాయకులను సర్పంచ్ లకు మార్గదర్శకాలు జారీ చేశారు ప్రతి గ్రామంలో చిన్నారులు యువతులు మహిళలు బతుకమ్మ ఆడు ప్రదేశాలలో (మైదానాల)లో ప్రత్యేక పారిశుద్ధ్యం విద్యుత్తు రహదారులు తాగునీరు భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు రంగురంగుల బతుకమ్మలను పేర్చి గౌరమ్మను కొలుస్తూ సంప్రదాయ ఆటపాటలతో ఆడి పాడేందుకు ఆడపడుచులందరూ సిద్ధమయ్యారని తెలిపారు మహిళలు బతుకమ్మ నిమజ్జన సమయంలో ప్రమాదాలు జరగకుండా చిన్నారులు చెరువు ఘాట్ల వద్దకు వెళ్లకుండా చూడాలని రక్షణ చర్యలు చేపట్టాలని చెరువుకుంటల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఆడపడుచులు ఆనందోత్సాహాలను ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పేలా బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా పకడ్బందీగా నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులను సర్పంచ్ లను కార్యకర్తలను కోరారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు ముగింపు

భూపాలపల్లి , అక్టోబర్ 15 (మనంన్యూస్): భూపాలపల్లి జిల్లా గొల్లబుద్ధారం న్యూ సేవాలాల్ తండా లో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన తీజ్ ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను తండా ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సిరికొండ ప్రశాంత్ చారి లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, గ్రామ సర్పంచ్ అజ్మీర జైపాల్ నాయక్, రాజు నాయక్ లావుడియా దాసు నాయక్, రాము నాయక్, బాలు నాయక్, రఘురాం నాయక్, కరణ్ నాయక్, రాజన్న నాయక్, గోపాల్ నాయక్, గోపి నాయక్, రంజిత్ నాయక్, ప్రతాప్ రామన్న, బీకన్ నాయక్, సర్దార్ నాయక్, నందు నాయక్, నంకు నాయక్, చిన్న నాయక్, సత్రం నాయక్, వసరం నాయక్, మీజిత్, రామ్ బాబు, రామ్, గోవర్ధన్, ప్రభు నాయక్, దన్ సింగ్ నాయక్, రవి నాయక్, శ్రీకాంత్, పుల్లారెడ్డి, తిరుపతి,మోహన్ నాయక్, బాబు నాయక్, సునీల్, జయపాల్, ఉదయ్ సింగ్, జల్ సింగ్, సందీప్, సంతోష్, హేమ నాయక్, రాందాస్ నాయక్, రతన్ సింగ్, పరం సింగ్, గోపాల్ సింగ్, జైపాల్ సింగ్, రాహుల్ సింగ్, రాణా ప్రతాప్ సింగ్, ఈశ్వర్, లక్ష్మణ్

నాయక్, కార్తీక్ నాయక్, చంద్రం నాయక్, సురేందర్ నాయక్, సోను నాయక్, అసిలాల్ నాయక్, నవీన్ నాయక్, గోవిందు నాయక్, రాజన్న, భూ సింగ్ ఫుల్ సింగ్, సమ్మయ్య నాయక్, జగన్, రాజన్న, రతన్, లక్ష్మణ్, చిన్న, రజనీకాంత్, రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువత, యూత్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.బంజారా సమాజంలో తీజ్ పండుగకు విశిష్టమైన స్థానం ఉందని, ఈ పండుగ ఐకమత్యం, భక్తిభావం, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని గ్రామస్తులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు గోధుమలు నానబెట్టడం, వాటిని సంప్రదాయబద్ధంగా పెంచడం, ప్రత్యేక పూజలు నిర్వహించడం వంటి కార్యక్రమాలతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది.తరతరాలుగా వస్తున్న బంజారా ఆచార సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఉత్సవాలను నిర్వహించారు. చివరి రోజు కార్యక్రమాల్లో గ్రామస్తులంతా ఉత్సాహంగా పాల్గొని తీజ్ ఉత్సవాలకు ఘనంగా ముగింపు పలికారు.

రాష్ట్ర స్థాయి కోకో పోటీలలో మహాదేవపూర్ విద్యార్థినులు విద్యార్థినిలు

మహదేవ పూర్, అక్టోబర్ 15 మనం న్యూస్: మహాదేవపూర్ మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ బాలికల పాఠశాల లో చదువుతున్నటువంటి విద్యార్థినిలు పెద్ది స్నేహ, పెద్ది మధులత, ఎండి అర్షియా ,కురుసం శ్రీ లక్ష్మీ ప్రసన్న లు హైదరాబాద్ లో జరుగుతున్నటువంటి తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ కో కో పోటీలలో పాల్గొంటున్నారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎన్నిక కావాలని ఆకాంక్షించారు అదేవిధంగా ప్రత్యక్ష శిక్షణ ఇస్తున్నటువంటి వ్యాయామ ఉపాధ్యాయురాలు పూర్ణిమ ను అభినందించారు. మన బాలికల పాఠశాల జిల్లాలోని కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా మంచి పేరు తీసుకొస్తున్నందుకు హ ర్షం వ్యక్తం చేశారు.

పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లా తరపున రాష్ట్రస్థాయి సెలెక్ట్ అవ్వడం ఆనందం వ్యక్తం చేశారు పెద్దపెల్లి జిల్లా కోకో అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మణ్ కి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేల్పుల కుమార్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

పెద్దపెల్లి జిల్లా కో కో నుంచి క్యాంప్ ఇచ్చి వారికి ప్రత్యేక మేలుకువలు నేర్పించి వారితో పాటు, క్రమశిక్షణతో, జట్టు సమన్వయం ఆడుతారని తెలియజేశారు. విద్యార్థుల యొక్క పట్టుదల కృషి ఈ పాఠశాల పేరు ప్రతిష్టలకు కారణమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందించాలి

- ఎస్పీ సంకీర్త్

భూపాలపల్లి, అక్టోబర్ 15 మనం ప్రతినిధి: ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందించడం ప్రతి ఒక్క పోలీస్ బాధ్యత అని జిల్లా ఎస్పీ సంకీర్త్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఘణపురం పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాలను ఆయన గురువారం నాడు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల నిర్వహణ, పరిశుభ్రత, రికార్డులు, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణను పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణ, పనితీరు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్లోని సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించి, నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పెండింగ్

కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ప్ర ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనల నియంత్రణతో పాటు రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు.

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సి సి టి ఎన్ ఎస్ 2.0 ఈ-సాక్ష్య, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఈ తనిఖీల్లో భూపాలపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ సంపత్ రావు, ఘణపురం సీఐ కర్ణాకర్ రావు, ఎస్ఐ అశోక్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల మధ్య ఉంటూ.. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న పైడాకుల అశోక్

ములుగు, అక్టోబర్ 15, మనం ప్రతినిధి: ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ప్రజల సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం, జిల్లా అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారంటూ కాంగ్రెస్ శ్రేణులు కొనియాడాయి. రాహుల్ గాంధీ ఆశయాలు, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రజాపాలన స్ఫూర్తి, మంత్రి సీతక్క మార్గదర్శకత్వంలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని పేర్కొన్నాయి. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేయడంతోపాటు, కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారని తెలిపాయి. పదవి అనేది హోదా కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ప్రశంసించాయి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ములుగు జిల్లా అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పైడాకుల అశోక్ మరింత కృషి చేయాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించాయి.

ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి, అక్టోబర్ 15 (మనం ప్రతినిధి): ఎల్నినో ప్రభావంతో, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. గురువారం ఐడీఓసీలో ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన, విద్యుత్, భూగర్భ జలాలు, డిఆర్డీఏ, పశు సంవర్ధక శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించి సమగ్ర నివేదికలు అందజేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం ఈ సీజన్ లో ఎంత నీరు ఉన్నది, ప్రస్తుతం ఎంత నీరు ఉన్నది నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. రైతులకు సాగునీటి కొరత ఏర్పడకుండా విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పంటలకు అవసరమైన సమయంలో నీరందించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. పంటలకు విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అదే విధంగా జిల్లాలో భూగర్భ జలాల మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, నీటి లభ్యతకు అనుగుణంగా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని సూచించారు.ఎల్నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ మార్పులు, నీటి లభ్యతలో హెచ్చుతగ్గులను ముందుగానే అంచనా వేసి, వ్యవసాయ రంగానికి నష్టం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విబిజి రాంజీ ద్వారా ఫామ్ పాండ్స్ ఏర్పాటుపై మరింత ఫోకస్ పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, వ్యవసాయ ఉద్యానవన శాఖ, పశు సంవర్ధక, విద్యుత్తు, భూగర్భజలాలు, డిపిఓ, ఇరిగేషన్, సీపీఓ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూముల వారి సర్వే వేగవంతం చేయాలి

- కలెక్టర్ రోహిత్ శర్మ

భూపాలపల్లి, అక్టోబర్ 15 మనం ప్రతినిధి: జిల్లాలో భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం నాడు ఆయన గోరికొత్తపల్లి మండలం, చెన్నా పూర్ గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో భూముల సర్వే, డ్రై మరియు వెట్ భూముల గుర్తింపు, గ్రామ హద్దులు, చెరువుల సరిహద్దులు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి మండలంలో రీ-సర్వే పనుల నిర్వహణకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. రోజువారీ సర్వే లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. డ్రై, వెట్ భూముల సర్వే పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. సర్వే సిబ్బందికి ఎదురవుతున్న ఐడీ, లాగిన్ తదితర సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో భాగంగా అవసరమైన ధృవపత్రాలు, నోటీసుల జారీని నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియ పారదర్శకంగా, లోపాలకు తావులేకుండా జరిగేలా అధికారులు, సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతు కల్పనతో రీ సర్వే గురించి మాట్లాడారు. రోజుకు ఎన్ని ఎకరాలు సర్వే చేస్తున్నారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డిఓ పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఆర్డిఓ హరికృష్ణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, తహసీల్దార్ హేమ, సర్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కివీస్‌తో వన్డే సిరీస్.. బుమ్రాకి రెస్ట్?

ప్రస్తుతం టీమ్‌ఇండియా వెస్టిండీస్ తో టీ20 సిరీస్ ను ఆడుతోంది. శనివారం చివరి మ్యాచ్ జరగనుంది. ఇది ముగిసిన తర్వాత.. భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులను ఆడనుంది. ఇప్పటికే టీ20 సిరీస్ కోసం స్క్వాడ్ను బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. మరో రెండు లేదా మూడు రోజుల్లో వన్డే సిరీస్ కోసం జట్టును ప్రకటించే అవకాశం ఉంది. ఈ క్రమంలో జస్ ప్రీత్ బుమ్రాకు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి ఇస్తారనే కథనం బయటకొచ్చింది. అతడి గాయం ఏమైనా తిరగబెట్టిందా? అనే అనుమానం రాకమానదు. కానీ, అలాంటిదేమీ లేదని.. టెస్టు సిరీస్ కోసమే ఈ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

''బుమ్రా ఫూర్తి స్థాయిలో ఫిట్గా ఉన్నాడు. కివీస్ పర్యటన సుదీర్ఘమైంది. ఇక్కడ ఏ సిరీస్కు ప్రాధాన్యత ఇవ్వాలనేది చూస్తాం. మిగతా రెండింటితో పోలిస్తే టెస్టు సిరీస్ ముఖ్యమైంది. వన్డేల నుంచి టెస్టు క్రికెట్ పై వెంటనే ఫోకస్ చేయడం చాలా కష్టమైంది. కేవలం కివీస్ పర్యటనకు మాత్రమే కాదు. వచ్చే ఏడాది బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ కూడా ఉంది. ద్వైపాక్షిక సిరీస్ ల కోసం అతడితో పరిమిత ఓవర్ల క్రికెట్ ఎక్కువగా ఆడించకూడదు. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ చాలా ఇంపార్టెంట్. దానిని దృష్టిలో ఉంచుకొనే ప్రణాళికలు సిద్ధం చేస్తాం'' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. అక్టోబర్ 22 నుంచి టీ20లు ప్రారంభమై.. నవంబర్ 1తో ముగుస్తాయి. ఇక వన్డేలు నవంబర్ 4 నుంచి మొదలై 15వ తేదీ వరకూ జరుగుతాయి. నవంబర్ 19న తొలి టెస్టు, నవంబర్ 27న రెండో టెస్టు ప్రారంభమవుతాయి.

డబ్ల్యూటీసీ ఫైనల్ కు వెళ్లాలంటే?

ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ నాలుగో సీజన్ లో భారత్ ఫైనల్ కు చేరుకోవాలంటే రాబోయే ప్రతి మ్యాచూ కీలకమైందే. కివీస్ ను తమ సొంత గడ్డపై ఎదుర్కోవడం ఏ జట్టుకైనా కష్టమే. ఇప్పుడు ఆ కఠిన పరీక్ష భారత్ ముందుంది. రెండు టెస్టుల సిరీస్ ను కోల్పోకుండా విజేతగా నిలిస్తేనే.. టీమ్‌ఇండియా డబ్ల్యూటీసీ టేబుల్ లో ముందుకొస్తుంది. ప్రస్తుతం భారత్ 51.52 శాతంతో ఐదో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా (80%), దక్షిణాఫ్రికా (75%), న్యూజిలాండ్ (72.22 శాతం), బంగ్లాదేశ్ (55.56 శాతం) ముందున్నాయి. కివీస్పై రెండు టెస్టుల సిరీస్ను 2-0 తేడాతో గెలిస్తే మాత్రం కనీసం మూడో ప్లేస్కు వచ్చేందుకు అవకాశం ఉంది. ఒక్కటి ఓడినా భారత్ ఫైనల్ రేసు నుంచి ఇంకా వెనుకబడిపోవడం ఖాయం. ఆ తర్వాత ఆసీస్ తో బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ కూడా ఉంది. అందుకోసమే బుమ్రా వంటి కీలకమైన బౌలర్ కు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చి.. టెస్టుల్లోనే ఆడించాలనేదే మేనేజ్ మెంట్ ప్రణాళికగా ఉంది. తొలి రెండు స్థానాల్లో ఉన్న జట్లకే ఫైనల్ లో ఆడే అవకాశం ఉంటుంది.

మాకొద్దు ఆ సెలక్టర్ పదవి.. తిరస్కరించిన ఇద్దరు మాజీలు!

బీసీసీఐ నుంచి ఏదైనా పదవి ఆఫర్ వచ్చిందంటే ఎవరైనా ఎగిరి గంతేస్తారు. ప్రపంచంలోనే అత్యంత సంపద కలిగిన క్రికెట్ బోర్డు ఇదే మరి. ఎందుకో గానీ, ఈసారి మాత్రం ఈ పదవులపై పెద్దగా ఆసక్తి కన్పించట్లేదు. బీసీసీఐ ఇటీవల సెలక్టర్ పదవి కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈపాటికే భారత మాజీ క్రికెటర్ల నుంచి చాలా దరఖాస్తులు వచ్చి ఉంటాయని అనుకోవడం సహజమే. కానీ, అలా జరగలేదు. ఓ ఇద్దరు మాజీలైతే ఏకంగా తమ వద్దకు వచ్చిన ఆఫర్ ను కూడా తిరస్కరించారని వార్తలూ వస్తున్నాయి. వారిద్దరికి వందకుపైగా టెస్టులు ఆడిన అనుభవం ఉందని సమాచారం. నాలుగేళ్లపాటు చీఫ్ సెలక్టర్ గా పనిచేసిన అజిత్ అగార్కర్ పదవీ కాలం అక్టోబర్ 4తో ముగిసింది. ఆ వెంటనే బీసీసీఐ వెస్ట్ జోన్ నుంచి సెలక్టర్ పదవి కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. అక్టోబర్ 14 సాయంత్రం 5 గంటలతో గడువు ముగిసింది. రమేశ్ పొవార్, సమీర్ దిఘే మాత్రమే అప్లై చేసుకున్నారు. పార్థివ్ పటేల్ దరఖాస్తు చేసుకుంటే.. అతడే చీఫ్ సెలక్టర్ గా నియమితులయ్యేవాడు. కానీ, అతడు ఆసక్తి చూపించలేదు. దీంతో ప్రజ్ఞాన్ ఓజా చీఫ్ సెలక్టర్ కావడం ఖాయమే. ఓజాతోపాటు ప్రస్తుతం ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా, ఎస్ఎస్ దాస్ సెలక్టర్లుగా ఉన్నారు.

రామోజీ ఫిల్మ్ సిటీలో డ్రాగన్ యాక్షన్

'డ్రాగన్' అవతారంలో అలరించడానికి సన్నద్ధమవుతున్నారు అగ్రహీరో ఎన్టీఆర్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్నారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. గాయం కారణంగా కొన్ని రోజులుగా ఎన్టీఆర్ షూటింగ్ నుంచి విరామం తీసుకున్నా.. ఈ సినిమా చిత్రీకరణ మాత్రం ఎలాంటి అంతరాయం లేకుండా శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడాయన గాయం నుంచి కోలుకొని మళ్లీ సెట్లోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన టాకీ పార్ట్ సన్నివేశాల్ని రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరిస్తున్నారు. ఎన్టీఆర్ తో పాటు ఇతర తారాగణంపై ఈ సీక్వెన్స్ ను తెరకెక్కిస్తున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో అనిల్ కపూర్, బిజూ మేనన్, ఖుష్బూ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎన్టీఆర్.. లూగర్ అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

అప్పుడు రజనీ దత్తపుత్రుడిగా.. ఇప్పుడు అతిథి పాత్రలో: 'జైలర్ 2'లో హృతిక్

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' అభిమానుల కోలాహలం మధ్య గురువారం విడుదలైంది. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. 'జైలర్'లో లాగే ఇందులోనూ పలువురు ప్రముఖ నటులు అతిథి పాత్రల్లో మెరిశారు. అయితే వారిలో హృతిక్ రోషన్ పాత్ర గురించి ప్రేక్షకులు ప్రత్యేకంగా చర్చించుకుంటున్నారు. దర్శకుడు నెల్సన్ 'రోడీ' పాత్రలో హృతిక్ ను స్టైలిష్ గా చూపించిన విధానం ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలోనే రజనీకాంత్ ఫ్యాన్స్ తో పాటు హృతిక్ అభిమానులు 40 ఏళ్ల క్రితం నాటి ఓ సినిమాను గుర్తు చేసుకుంటున్నారు. అదే 1986లో విడుదలైన బాలీవుడ్ చిత్రం 'భగవాన్ దాదా'.

ఈ చిత్రంలో రజనీకాంత్ తో పాటు హృతిక్ తండ్రి రాకేశ్ రోషన్, శ్రీదేవి ప్రధాన పాత్రల్లో నటించారు. అప్పుడు 12 ఏళ్ల వయసున్న హృతిక్ ఆ సినిమాలో రజనీకాంత్ దత్తపుత్రుడిగా కనిపించారు. పలు సన్నివేశాల్లో రజనీతో కలసి సందడి చేశారు. ఆ తరువాత కొన్నేళ్లకు తన తండ్రి తెరకెక్కించిన 'కహోనా ప్యార్ హై'తో కథానాయకుడిగా పరిచయమయ్యారు హృతిక్. అనంతరం క్రిష్, ధూమ్ 2, అగ్నిపథ్ లాంటి చిత్రాలతో స్టార్డమ్ను సొంతం చేసుకున్నారు. మళ్లీ ఇన్నాళ్లకు ఆయన 'జైలర్ 2'లో అతిథి పాత్రలో నటించి సూపర్బార్తో మరోసారి తెరను పంచుకోవడంపై అభిమానులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ఆ రెండు సినిమాల్లో రజనీ-హృతిక్ల సన్నివేశాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు.

ఆసియా గేమ్స్ పతక విజేతలతో ముచ్చటించిన ప్రధాని

ఆసియా క్రీడల పతక విజేతలతో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంభాషించారు. తన నివాసంలో అథ్లెట్లతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. స్వర్ణాలు గెలిచిన భారత హాకీ, క్రికెట్ పురుష, మహిళా జట్లతోపాటు ప్రతి అథ్లెట్ తో మోదీ ఫొటోలు దిగారు. జపాన్ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ 85 పతకాలను గెలిచి తన నాలుగో ప్లేస్ ను కాపాడుకుంది. ఇందులో 21 బంగారు, 27 రజత, 37 కాంస్య పతకాలు ఉన్నాయి.

'డ్యూ డేట్'లో పవర్ ఫుల్ లాయర్గా విలక్షణ నటుడు సునీల్..

హీరోమేష్ పుడిపెద్ది హీరోగా, జయశ్రీ హీరోయిన్గా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'డ్యూ డేట్'. వరిష్ స్టూడియోస్ పతాకంపై పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను నిర్మాతలుగా ఆనంద్.కె. దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఇటీవల ఘనంగా పూజా కార్యక్రమాలతో స్టార్ట్ అయింది. ప్రస్తుతం ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్ లో జరుగుతోంది. ఈ షెడ్యూల్లో పలు కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఇటీవల కమెడియన్ కృష్ణభగవాన్ 'డ్యూ డేట్' షూటింగ్ లో జాయిన్ అయిన సంగతి తెలిసిందే. చాలా కాలం విరామం తరువాత కృష్ణ భగవాన్ ఈ చిత్రంలో ఓ మంచి పాత్రను పోషిస్తున్నాడు. ఇప్పుడు తాజాగా ఈ సినిమా షూటింగ్ లో నటుడు సునీల్ జాయిన్ అయ్యాడు. ఈ చిత్రంలో సునీల్ ఓ లాయర్ పాత్రలో నటిస్తున్నాడు.



ఆయన కెరీర్ లో ఇదొక డిఫరెండ్ పాత్రగా ఎప్పటికీ నిలిచిపోతుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ఈ చిత్రంలో నటుడు సునీల్ పవర్ ఫుల్ లాయర్ శేఖర్ చంద్రగా కనిపించబోతున్నాడు. ఆయన పాత్ర సినిమా పెద్ద ఎస్సెట్ గా ఉంటుంది. ప్రజెంట్ బర్నింగ్ ఇష్యూ ఆధారంగా అల్లుకున్న ఈ కమర్షియల్ కోర్ట్ రూమ్ డ్రామా ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రతి మనిషి, ప్రతి నెలా గుర్తుపెట్టుకునే డ్యూ డేట్ చుట్టూ పూర్తి వాణిజ్య అంశాలతో అల్లుకున్న కథ ఇది. ఈ సినిమా ప్రేక్షకులకు ఎంటర్టైన్మెంట్ను అందించడంతో పాటు అందర్ని ఆలోచింపజేస్తుంది. హృదయాలకు హత్తుకుంటుంది' అని చెప్పుకొచ్చారు.

పెళ్లి చేసుకునేది పనిమనిషి అవ్వడం కోసం కాదు.. - అనుపమ

యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'క్రేజీ కల్యాణం'. ఈ సినిమా రిలీజ్కు రాబోతుండగా.. ప్రమోషన్స్లో పాల్గొన్న అనుపమ తన పెళ్లిపై షాకింగ్ కామెంట్స్ చేసింది. 'ఈ సినిమాలో నాకు పెళ్లి అవుతుందా కాదా అనేది పక్కకి పెడితే.. ఇందులో నా పెళ్లిపై చాలా ఒత్తిడి ఉంటుంది. కానీ అలా మా ఇంట్లో నా పెళ్లి గురించి ఏమాత్రం ఒత్తిడి లేదు. నీకు ఇష్టమైనప్పుడు పెళ్లి చేసుకోమనే మా వాళ్లు అంటారు. నాకైతే పెళ్లికి ముందే ఒక బేబిని కనాలనిఉంది. భవిష్యత్తులో నాకు అసలు పెళ్లవుతుందో లేదో నాకే క్లారిటీ లేదు.

కానీ, ఒక పాపనో, బాబునో పెంచుకోవాలనే కోరిక మాత్రం బలంగా ఉంది. అది అడాప్షన్ ద్వారానో లేదా ఐవీఎఫ్ ద్వారానో ఎలాగైనా సాధ్యమే కదా' అంటూ ఓపెన్ అయింది. అలాగే దాంపత్య జీవితంలో భార్యాభర్తల సమానత్వం గురించి మాట్లాడుతూ.. 'పెళ్లి చేసుకునేది ఉచితంగా వచ్చే పనిమనిషి కోసం కాదు. ఆడపిల్లల బాధ్యత కేవలం వంటింటికే పరిమితం కాకూడదు. బయటకు వెళ్లి అలిసిపోయి ఇంటికి వచ్చాక మహిళ ఒక్కతే వంటింట్లోకి వెళ్లి వంట చేయాల్సి రావడం, పురుషులు విశ్రాంతి తీసుకోవడం సరైన పద్ధతి కాదు. ఇంట్లో పనులను ఇద్దరూ సమానంగా పంచుకోవాలి. కనీసం ఆమెకు తోడుగా నిలిచే భాగ్యస్వామ్యం ఉండాలి' అని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది.

'RC-17' డెన్ రెడీ.. ఎగ్జైటింగ్ అప్డేట్స్ కోసం వేచి ఉండాలంటూ సుకుమార్ పోస్ట్

ఇండస్ట్రీలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ మరోసారి పట్టాలెక్కడానికి సిద్ధమవుతోంది. ఆల్ టైమ్ బ్లాక్ బస్టర్ 'రంగస్థలం' తర్వాత ఈ క్రేజీ కాంబో రిపీట్ అవుతుండటంతో భారీ హైప్ క్రియేట్ అయింది. 'RC 17' వర్కింగ్ టైటిల్ తో రాబోతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ముహూర్తంపై గత కొంతకాలంగా రకరకాల పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి.

తాజాగా, ఈ ప్రచారాలకు తెరదించుతూ దర్శకుడు సుకుమార్ స్వయంగా ఈ విషయంపై అదిరిపోయే హింట్ ఇచ్చారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డెన్ను నేడు ఆయన అధికారికంగా ప్రారంభించారు. త్వరలోనే పూజా కార్యక్రమాలతో ఈ సినిమా అసలు ప్రయాణం మొదలవుతుందని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, త్వరలోనే మోస్ట్ ఎగ్జైటింగ్ అప్డేట్స్ రాబోతున్నాయని, అందరూ వేచి చూడాలని ఫ్యాన్స్ను కోరారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.